వనిత

డిసెంబర్ పదిహేను : 1976

విడి ప్రతి ఒక రూపాయి

మీ కేశ సంపదకు

జుట్టు అద్భుతంగా ఉండేటట్టు చేసేది రీటా-దానిలో అటువంటి శక్తి, సువాసనా ఉన్నాయి - శిరోజాలు సహజంగా, చక్కగా పెరగడానికి. చల్లదనానికి. దానికదేసాటి.

రీటా వాడి మీ కురుల సౌభాగ్యాన్ని వృద్ధి చేసుకోండి. మీ శిరోజాలు ఏపుగా, ఒత్తుగా పెరిగి నిగనిగలాడుతూ మెత్తగా ఉంటాయి.

★ స్త్రీలూ పురుషులూ వాడవచ్చును

రీటా

★ నేడే ఒక సీసా కొనండి

ప్రతిచోటా దొరుకును

వీటో కంపెని, బొంబాయి . కలకత్తా . మద్రాసు

973

విజయ సాధనకు మార్గదర్శి 999 అనే తారక మంత్రమే!



ఓవర్‌లాక్ మిషన్లు



ఎరువుల మూటలు
కుట్టు మిషన్లు

ఇవేగాక

"గురు"

ఓవర్‌లాక్ మిషన్లు
శివా కుట్లుమిషన్లు
మోటార్లు

వివరాలకు:
ఫోన్ { 22698
27876
సంప్రదించండి

పంపిణీదారులు

జయగజలక్ష్మి మెషినరీస్

2/156, (పై మేడమీద) బ్రాడ్వే, మద్రాసు-600001.

అన్నిచోట్లా డీలర్లు కావలెను

వనిత

స్త్రీ జన పక్ష పత్రిక

సంపుటి: 2 సంచిక: 12

డిసెంబర్ పదిహేను: 1976

విడి ప్రతి: ఒక రూపాయి

సం॥ర చందా: ఇరవైనాలుగు రూపాయిలు

శ్రీలంక: 0. 97 సెంట్స్

మలేసియా: 65 సెంట్స్

చిరునామా:

చందమామ బిల్డింగ్స్

మద్రాసు-600 026

వచ్చే సంచిక

నూతన సంవత్సర సందర్భంగా రానున్న జనవరి ఒకటవ తేదీగల 'వనిత' ''సౌందర్య విశేష సంచిక''గా వెలువడబోతున్నది. శరీర, ముఖ, చర్మ సౌందర్యానికి సంబంధించిన విశేషాలు, వ్యాసాలు, చిట్కాలు-ప్రధానంగా గల ఈ సంచికలో

ఇంకొక సశేష నవల కూడా ఆరంభమవుతున్నది

"కాంతి కిరణాలు"

రచన: శీలంశెట్టి రమాదేవి

మరొక ఆకర్షణ:

మాదిరెడ్డి సులోచన

కథ

ఒక్క మాట

విశాఖపట్నం నుంచి దినమణి ప్రభాకర్, పార్వతమ్మ, కామేశ్వరిగార్లు రాసిన లేఖ చదివాను. వారు కొన్ని శీర్షికలను తొలగించమన్నారు. బాగానే ఉంది. తొలగించమన్న శీర్షికలలో వస్తువులు తయారుచేయడం, బామ్మగారి పేజీలను కూడా చేర్చినందుకు నేను చాలా బాధపడుతున్నాను. 'కాఠిన్యం' కథ నా కెంతో నచ్చింది. 'సూడోసయిసిస్' కథలో లాగ కాంతమ్మ లాంటి మూర్ఖులు, చంద్రం లాంటి అవివేక చూడామణులు మారగలరని ఆశిద్దాం.

—కె. గీతాకుమారి, విశాఖపట్నం

విశాఖపట్నం పఠితలు వ్రాసిన విషయాలు నిజమైనప్పటికీ "బామ్మగారి పేజీ" కూడా తీసివేయమనడం భావ్యం కాదు. ఇదే సంచికలో మరో పఠిత "మాటలకొలువు ఎందుకు?" అన్నారు. నిజానికి, ఏ పత్రికలోనైనా పాఠకులకు ఆసక్తి కలిగించేది 'పజిల్' కాబట్టి మాటలకొలువు ఎంతో ఉపయుక్తమైనదని నా అభిప్రాయం.

—కె. ఈశ్వరి, మోరి

వైద్య విజ్ఞానం-డాక్టర్ సలహాలు లాంటి ప్రత్యేకమైన శీర్షికలకన్నా "సూడోసయిసిస్" లాంటి ఓ కథ ఉంటే చాలు. సర్దుకోగల కొద్దిపాటి శరీరలోపం చేత గర్భధారణ జరగకపోగా పిల్లలు కావాలనే బలియమైన కాంక్షచేత శరీరంలోని "హార్మోన్స్" గతి తప్పి, తత్ఫలితంగా శరీర తత్వంలో ఏర్పడే పరిణామాలను రచయిత్రి ఒక కథ రూపంలో మనకు అందజేయటం నిజంగా ఎంతో విజ్ఞానాత్మకంగా ఉంది.

—వనజా రాథర్, బెంగళూరు

గత నెల 19న "కళాసాగర్-వనిత" సమర్పించిన "మదర్స్ డే"లో ఆటలు, పాటలు, ముగ్గులు, వక్తృత్వపోటీ, స్లోగన్ పోటీల్లాంటివి-24 గంటలకు సరిపడే కార్యక్రమాన్ని 4 గంటలలో కుదించి జయప్రదంగా సమర్పించి, స్త్రీ సమాజంలో నూతన చైతన్యాన్ని కలిగించి ఉత్సాహాన్ని రేకెత్తించిన మీకు - కళాసాగర్ వారికి నా హృదయపూర్వక ధన్యవాదములు.

—వెలుగుల నాగేశ్వరి, మద్రాసు

బ్రెడ్ బోండా వంటకము చాలా బాగుంది. మేము చేసాము. దానిని అందించిన సులక్షణా రాజగోపాలన్‌గారికి మా కృతజ్ఞతలు. 'దేవుడా నువ్వుండి తీరాలి' కథ చాలా బాగుంది.

—మువగాల గంగా పార్వతి, గుంటూరు

ఉన్నత ప్రమాణాల్లో జరిగిన "మదర్స్ డే" లాంటి ఎంతో నావెల్టీ ఉన్న కార్యక్రమాలు ఆంధ్రదేశం లోని ప్రతి పెద్ద పట్టణంలోనూ జరగాలి. ప్రతి చోట ఒక్కొక్క రాజ్యలక్ష్మి ని కని పెట్టాలి. అప్పుడే వరకట్న నిర్మూలన ఉద్యమం ప్రారంభమౌతుంది. "వనిత" కృషికి సార్థకత సిద్ధిస్తుంది.

—వగ్మాన, మద్రాసు

లండన్ విశేషాలు

ఛాయా ఆర్య

ఈ సంచిక ముఖపత్ర వనిత శ్రీమతి ఛాయా ఆర్య – 'వనిత'లో అందచందాలు, బొమ్మల డిజైనింగ్, ఫాషన్స్, మొదలైన విషయాల గురించి రచనలు చేయడం ద్వారా పరితలకు పరిచితురాలు. '59లో ఆమె ప్రసిద్ధ ఛాయాగ్రాహకుడు శ్రీ జితేంద్ర ఆర్యను వివాహం చేసుకుని-భర్త ఉద్యోగరీత్యా కొన్నాళ్ళపాటు లండన్‌లో ఉన్నారు. స్వదేశానికి తిరిగి వచ్చిన తర్వాత ఈ మధ్యనే లండన్ వెళ్ళారు. అక్కడ తనకు ఆసక్తిదాయకంగా కనిపించిన విశేషాలను ఈ వ్యాసంలో ఆమె వివరిస్తున్నారు:

నేను–1959లో తొలిసారిగా లండన్‌కు వెళ్లాను. అప్పుడు నేను కొత్త పెళ్ళికూతుర్ని. మా వారు శ్రీ జితేంద్ర ఆర్య అప్పటికి కొన్ని సంవత్సరాలుగా అక్కడే స్థిరపడిపోయి, వివిధ పత్రికలకు ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తున్నారు.

కొత్త దేశం–కొత్త వాతావరణం....తొలి రోజుల్లో నాకు వింతగానే తోచింది. నేను బొంబాయిలో పెరిగినా, నాది కాన్వెంటు చదువే అయినా-మొదట్లో అక్కడి వాళ్ళు మాట్లాడే ఇంగ్లీషు తీరును అర్థం చేసుకోవడం కాస్త ఇబ్బందే అయింది. ఐతే రాను రాను–అదేమంత సమస్యగా అనిపించలేదు. అక్కడి వాళ్ళ అలవాట్లు, పద్ధతులు అవీ క్రమ క్రమంగా అర్థం చేసుకున్నాక, అక్కడ స్థిరపడడంలో సాకే విధంగానూ కష్టమనిపించలేదు!

ఋతువులు మారుతున్నప్పుడు ఆ వాతావరణంలోని మార్పులు – పెద్ద పెద్ద నగరాలలో స్పష్టంగా తెలియవు. కానీ లండన్‌లో ప్రకృతి సౌందర్యంలోని మార్పులన్నీ మనకు నయనానందకరంగా కనిపిస్తాయి. ఎండా కాలంలో లండన్ నగరం–తోటలు, పార్కుల్లోని అందమైన చెట్లతోనూ, చక్కని పువ్వులతోనూ - చూడ్డానికి ఎంతో ముచ్చటగా ఉంటుంది. శరదృతువులో ఆకులు రాలిపోతున్న చెట్లు, శీతాకాలంలో–మోడు వారిన చెట్లపై మంచు కురిసి, అవి తెల్లగా వెండి మబ్బులా కనిపించడమూ చూడ్డానికి ఆకర్షణీయంగా ఉంటాయి. ఆ కాలంలో అంతా మంచుమయం. రోడ్ల పైనా, పొలాల్లోనూ, ఇళ్ళ పైనా ఎక్కడ చూసినా మంచు తెల్లగా మెరుస్తూ ఉంటుంది. ఆ తర్వాత – ఉన్నట్లుండి ఆకులు చిగురించడం, పువ్వులు పూయడంతో ప్రకృతి వసంతఋతువుకు స్వాగతం పలుకుతుంది.

ఆంగ్లేయులు స్వతసిద్ధంగా ప్రకృతిసౌందర్యాన్ని విశేషంగా ఆరాధిస్తారు. అందుకు చిహ్నంగా దాదాపు ప్రతి ఇంటి ముందూ మన కొక తోట కనిపిస్తుంది. ఆ తోటలో రకరకాల అందమైన చెట్లను పెంచడానికి వాళ్ళెంతో ఆసక్తి చూపిస్తారు. వీలైనంత వరకూ ప్రకృతి ఒడిలోని ప్రశాంతతను అనుభవించాలని ఆశిస్తూంటారు. అందువల్లే వారాంతంలో కాని, సెలవుల్లో కాని–నగరాలకు దూరంగా ఉండే సుందరమైన పల్లెసీమలకు విహార యాత్రలు చేస్తుంటారు.

లండన్‌లో కొన్ని సంవత్సరాలు ఉన్న తర్వాత స్వదేశానికి మేము తిరిగి వచ్చేశాము. తిరిగి వచ్చిన తర్వాత – మళ్ళీ ఇటీవలే లండన్ వెళ్ళే అవకాశం ఏర్పడింది.

ఈసారి వెళ్ళినప్పుడు, ఆ నగరం కాస్త విశాలమైనట్లు కనిపించడం, కొన్ని ఆకాశహర్మ్యాలు కొత్తగా నిర్మించబడడం తప్ప–మరే కొత్త మార్పులూ నాకు కనిపించలేదు. ఐతే జనాభా మాత్రం అధికమైంది. మనదేశం నుంచి అక్కడకు వెళ్ళి స్థిరపడిన భారతీయులు, ఉగాండా నుంచి కాందిశీకులుగా తరలివచ్చిన భారతీయులు, పాకిస్తానీయులు, అరబ్బులు విశేషంగా కనిపించారు. వీళ్ళలో చాలామంది అక్కడ వివిధ వ్యాపారాలను ప్రా[illegible]రు. కొన్నిసంవత్సరాల క్రితం చీరె కట్టుకున్న వాళ్ళు – అక్కడ నడిచి వెళ్తూంటే–ఆంగ్లేయులు విచిత్రంగా చూస్తూ ఉండే వాళ్ళు. ఇప్పుడు చీరెలు కట్టుకునే స్త్రీల సంఖ్య అక్కడ ఎక్కువ కావడంతో-ఎవరూ మునుపటిలా తమ ఆశ్చర్యాన్ని ప్రదర్శించడం లేదు!

మరో విశేషం–ఇంగ్లాండులో ఉన్న డాక్టర్లలో నూటికి 40 మంది మన భారతీయులే ఉన్నారు. అక్కడి వాళ్ళందరూ–వీళ్ళపట్ల ఎంతో గౌరవాన్ని చూపడం నేను గమనించాను. ఇక ఆసియాకు చెందిన వారిలో–విద్యార్థులు కాని చాలామంది అక్కడి కర్మాగారాలలోను, బ్రిటిష్ రైల్వేలలోనూ పనులు చేస్తున్నారు. కొందరు బస్సు కండక్టర్లుగా కూడా పనిచేస్తున్నారు. వాళ్ళ సగటు ఆదాయం వారానికి 40 పౌండ్ల వరకూ ఉంటుంది. ఐతే–అక్కడి జీవన వ్యయంతో పోల్చి చూస్తే ఈ సంపాదన ఏమాత్రం చాలదనిపిస్తుంది. అందువల్లే కొన్ని కుటుంబాలలో–ఇల్లు గడవడానికి భార్యాభర్తలు ఇద్దరూ ఉద్యోగాలు చేస్తుంటారు.

ఇక అక్కడి గృహిణుల దైనందిన జీవితం చాలా పకడ్బందీగా ఉంటుంది. అన్నీ టైమ్ ప్రకారం జరిగిపోతుంటాయి.

ఇంగ్లాండులో వనితలు వంటచేయడానికి పెద్దగా

శ్రమపడవలసిన అవసరం ఉండదు. ఎంచేతంటే చాలావరకు అక్కడి కూరగాయలు అవీ తాజాగా, కొన్న వెంటనే వంట చేయడానికి అనువుగా పరిశుభ్రం చేయబడినవి దుకాణాల్లో లభిస్తాయి. కొన్ని ఆహారపదార్థాలైతే కాస్త వెచ్చబెట్టి – వడ్డించడానికి అనువుగా కూడా ఉంటాయి. సాధారణంగా గృహకృత్యాలలో భర్త, పిల్లలు కూడా గృహిణికి సాయపడుతూ ఉంటారు. రాత్రి భోజనాలైన తర్వాత ఇంటిల్లిపాదీ కలిసి-టెలివిజన్ కార్యక్రమాలు చూస్తూ కూర్చుంటారు.

అక్కడ టెలివిజన్ ఎంతో అభివృద్ధి సాధించింది. టి. వి. లో ఉండే మూడు, నాలుగు ఛానెల్స్ ద్వారా ఎవరెవరికి ఏ రకం కార్యక్రమాలు ఇష్టమైతే, అవి చూసుకోవచ్చు. ఆసియాకు చెందినవారికని – ప్రత్యేకంగా వారానికి రెండు కార్యక్రమాలు ఉంటాయి. టి. వి. లో కొత్త కొత్త సినిమాలు, ఎన్నో రకరకాల వినోద కార్యక్రమాలు చూపిస్తుంటారు. అందువల్ల అక్కడ థియేటర్లలో ప్రదర్శింపబడే సినిమాలకు — ఏవో కొన్ని ప్రత్యేక ఆకర్షణలు ఉంటే తప్ప అంతగా ప్రజాదరణ లభించడం లేదు.

ఇంగ్లండులో నా[illegible]గా కనిపించిన మరో విశేషం ఏమిటంటే–ప్రభుత్వం వారు వయోవృద్ధులకు కల్పించిన సదుపాయాలు! తమ తమ ఉద్యోగాలనుంచి రిటైర్ అయినవారు, వృద్ధులూ– రద్దీలేని సమయాల్లో బస్సులలోను, రైళ్ళలోనూ ఉచితంగా ప్రయాణం చేయవచ్చును. అలా వారు తమ కుటుంబసభ్యులనో, డాక్టర్లనో తరచుగా కలుసుకుంటూ ఉంటారు. ప్రభుత్వం అటువంటి వారికి 'పెన్షన్' కూడా ఇస్తోంది! ఎవరైనా అంగవైకల్యం వల్లనో, మరే కారణం చేతనో ఏ పనీ చేయలేని స్థితిలో ఉంటే – ప్రభుత్వం వారికి ఉచితంగా భోజనాలు సమకూర్చే సదుపాయం కూడా అక్కడ ఉంది!

ఇక అక్కడి పరిశుభ్రతను గురించి తప్పక చెప్పుకోవాలి. వీధులలోను, రోడ్ల మీద-ఎక్కడా చెత్తా చెదారం కనిపించదు. ప్రతి కాస్త దూరానికీ ఒక చెత్త కుండీ ఉంటుంది. అక్కడి పౌరులు కూడా పరిశుభ్రత విషయంలో ఎంతో శ్రద్ధ చూపిస్తూ ఉంటారు. చిన్న కాగితం ముక్క కూడా అశ్రద్ధగా విసిరి పారేయకుండా – చెత్త కుండిలో వేస్తారు. అక్కడి గృహిణులు కూడా అంతే. పనికిరాని వస్తువులను–తమ ఇళ్ళ ముందు ఉండే చెత్తకుండీలో వేసేస్తే (వీటిపైన మూతలు ఉంటాయి!) వారానికి రెండుసార్లు–మునిసిపాలిటీ వారొచ్చి, వాటిని ఖాళీచేసి వెళ్ళిపోతుంటారు.

'షాపింగ్' చేయడంలో ఆసక్తి ఉన్న వారికి 'లండన్' నగరం చాలా సరదా కలిగిస్తుంది. అన్నిరకాల వస్తువులూ — అక్కడి డిపార్ట్‌మెంటల్ స్టోర్లలో ఆకర్షణీయంగా, కళ్ళకు దిగ్భ్రాంతి కలిగేలా కనిపిస్తూంటే-మనం ఏ ఒక్కటైనా కొనకుండా ఉండలేము. కొందరు ఉండబట్టలేక, ఏదో ఒకటి దొంగిలించి, మెల్లగా జారుకోడానికి కూడా ప్రయత్నిస్తుంటారు. అలా చిల్లర దొంగతనాలు అక్కడ జరుగుతూ ఉండడం చాలా సహజమట! ఆ విధంగా జరగకుండా ఉండడానికి కొన్ని దుకాణాలలో–టి. వి. కెమేరాలను, 'ఎలక్ట్రానిక్ కళ్ళ'నూ ఏర్పాటు చేసి ఉంచారు!

ఇలా అక్కడి విశేషాలను గురించి ఎంతైనా చెప్పవచ్చు. అన్నిటికంటే ప్రధానమైనది అక్కడి ప్రజల సౌజన్య స్వభావం! వాళ్ళు సభ్యత, ఓర్పు మొదలైన సు.పణాలతో ఇతరులను చాలా సులభంగా ఆకట్టుకుంటారు. అందువల్లే అక్కడి ప్రజలను మనం ఒకసారి కలుసుకున్న తర్వాత, తేలిగ్గా మరచిపోలేము! □

బాలల దినోత్సవ సందర్భంగా (నవంబర్ 14) బాలల అకాడమీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు–జిల్లాల వారీగా పిల్లల పోటీలు జరిపారు. వరంగల్ జిల్లా నుంచి, కూచిపూడి నృత్యం (జూనియర్స్)లో యమ్. ఉషా వైజయంతిమాల ప్రథమస్థానం పొందింది. పన్నెండు సంవత్సరాల ఈ అమ్మాయి వరంగల్‌లోని ప్లాటినమ్ జూబిలీ హైస్కూలులో ఎనిమిదవతరగతి చదువుతోంది.

సైకాలజీ:

ఒక షాపువాడు కొత్తరకం కప్పు సాసర్లూ తెప్పించి, 'ఆరు రూపాయలు' అంటూ అమ్మకానికి పెట్టాడు. ఆ రకం నచ్చలేదో–ఏమోగాని, ఎక్కువగా అమ్మకం జరగడం లేదు. షాపువాడు దిగులుపడిపోయాడు. కొన్నాళ్ళయిన తర్వాత అతనికో 'ఐడియా' వచ్చి–ఆ ఐడియాని అట్టమీద రాసి, షాపులో వేళ్ళాడదీశాడు: "ఉచితము: ఆరు రూపాయల కప్పు కొన్నవారికి–సాసరు ఉచితముగా ఇవ్వబడును." ఆ "ఉచితము"ను చూడగానే చాలామంది స్త్రీలు షాపులో జొరబడి, తెగ కొనేశారు!

శరీర సౌందర్యం కాపాడుకోవడానికి
అనుసరించవలసిన విధానల గురించి, వస్త్రధారణ గురించి
సులభంగా చెయ్యదగిన చేతిపనుల గురించి మీకు ఏవైనా
సందేహాలు ఉన్నా, సలహాలు కావలసి వచ్చినా
వాటిని కార్డుల మీద రాసి ఎడిటర్ 'వనిత'
చందమామ బిల్డింగ్స్, మద్రాసు 600 026
చిరునామాకు పంపితే చాలు. ఈ కార్డుల మీద ఇవి తప్ప
తక్కిన విషయాలేవీ ఉండకూడదు.

సందేహాలు సమాధానాలు

ఛాయా ఆర్య

వై. పద్మ, శ్రీకాకుళం

పచ్చని శరీర ఛాయ కలిగివున్న అమ్మాయిలు ఏరంగు 'లిప్‌స్టిక్' వేసుకుంటే బావుంటుందో చెబుతారా?

శరీరఛాయ మరీ పచ్చగా వుంటే, పెదవులకు వాడే రంగు బాగా ముదురుగా వుండాలి. వాటిలో ఎరుపు, ముదురు ఎరుపు వాడితే బాగానే వుంటాయి. మరీ పల్చగా వుండే రంగులు వాడితే ప్రయోజనం వుండదు— మీరు చెప్పిన ఛాయ గలవారికి. సాధారణంగా- పగటిపూట 'లైట్'గా వుండే రంగు, సాయంకాల వేళల్లో ముదురుగా వుండే రంగూ వాడతారు. దీపాల వెలుతుర్లో ముదురు రంగులు, 'లైట్'గా కనిపిస్తాయి.

దుగ్గిరాల వనజ, రాజమండ్రి

తలకు తరచు రంగువేస్తూ వుండడంవల్ల గుడ్డితనం రావడానికి అవకాశం వుందని అంటున్నారు. నిజమేనంటారా?

నిజం కాదు. కొందరు ఆలా అనుకుంటూ వుంటారు గాని, కంటి చూపుకూ తలకు రంగు వెయ్యడానికీ ఏమీ సంబంధం లేదు. కంటి చూపును అదేమీ మందగించదు. అయితే, ఆ రంగులో కొన్ని రసాయనిక పదార్థాలు కలిపివుంటాయి గసక, కొన్నిరకాల చర్మాలకు ఈ రంగు పడదు. అందుకనే రంగు వేసుకునేముందు, కొద్దిగా వేసుకుని పరీక్షించుకోవాలి. అది, చర్మానికి మంట కలిగించకుండావుంటే - వాడాలి. కలిగిస్తే మానెయ్యాలి. రంగుల్లోనూ చాలా రకాలున్నాయి. కొన్ని చౌకరకం రంగులయితే, తేలిగ్గా చర్మానికి మంట కలిగిస్తాయి. అంచేత, పదిమందీ ఉపయోగిస్తున్న రకాన్నే వాడితే ఇబ్బంది వుండదు. తొలిప్రయత్నమే అయితే 'హెయిర్ డ్రెసర్'ను అడిగి, ఏది మంచిదో తెలుసుకోవచ్చు.

వి. విశాలాక్షి, మద్రాసు

చాలామంది ఆడపిల్లలు 'నైట్‌గౌన్స్' లాంటివి ధరించి, సినిమాలకు రావడం, స్నేహితుల ఇళ్ళకు వెళ్ళడం తరచు చూస్తున్నాము. అవి సభ్యమైన దుస్తులేనంటారా? కాకపోతే, వాళ్ళు అలాంటివి ఎందుకు వేసుకుంటున్నారంటారు?

'నైటీస్' గాని, మీరు చెప్పిన నైట్ గౌన్స్ గాని — వాటి పేరులోనే వున్నట్టు — వాటిని రాత్రులు నిద్రపోయేటప్పుడే ధరించాలి. ఒకవేళ, బెడ్‌రూమ్‌లో నుంచి ఛట్టున బయటికి రావలసివస్తే - పైన చిన్న కోటు లాంటిది వేసుకుని రావాలి. నైటీస్ ధరించేవాళ్ళు, అలాగే పాటిస్తారు. పార్టీలకూ, సినిమాలకూ ఇలాంటి దుస్తులు వేసుకుని రావడం మర్యాద కాదు; సభ్యతా కాదు. అయితే, నైట్ డ్రెస్‌లాగే కనిపించే 'మాక్సీ'లను ధరించి, సినిమాలకూ వీధుల్లోకీ రావడం — ఇవాళ పరిపాటయిపోయింది. కాస్త 'డీసెంట్'గా వుండే 'మాక్సీ'లు ధరిస్తే పర్వాలేదు.

జి. వి. వనలత, బెంగళూరు

'స్ప్రే' చేసే విధానంలో ఎన్నో 'పెర్‌ఫ్యూమ్స్' (అత్తర్లు) విదే[illegible] తయారవుతున్నాయి. భారతదేశంలోకూడా అలాంటివి తయారవుతున్నాయా? తయారయితే, వాటిల్లో మీ ఉద్దేశంలో మంచిది ఏది? ఒకవేళ దాన్ని శరీరంమీద జల్లుకున్నప్పుడు, శరీరంమీద మంట పుట్టడం, దురద వెయ్యడం వంటిది ఏదైనా జరుగుతుందా?

అలాంటివి మనదేశంలోనూ తయారవుతున్నాయి. నాకు తెలిసినది — 'పాయిస్' అన్నది. ఇలాంటివాటిని ఇంకా తక్కిన కంపెనీలు తయారుచేస్తున్నాయో లేదో నాకు తెలీదు. ఈ 'డియోడరెంట్స్'ను శరీరం మీద చల్లినప్పుడు ఇవి చర్మానికి ఎలాంటి హానీ కలిగించవు. శరీరం మీద నుంచి వచ్చే దుర్వాసనను తొలగించడానికి, వీలైనప్పుడల్లా చంకల కింద శుభ్రం చేసుకోవాలి. ముఖ్యంగా ఎండాకాలాల్లో చంకల్లో వెంట్రుకలు పెరగనివ్వకుండా ఎప్పటికప్పుడు శుభ్రంగా వుంచుకోవాలి. ముందు శుభ్రం చేసుకోకుండా 'డియోడరెంట్స్'ను చల్లడం వల్ల ఏమీ లాభం వుండదు.

మల్లాది జయలక్ష్మి, విజయవాడ

సినిమాల్లోని హీరోయిన్ల కళ్ళ వెంట్రుకలు పొడుగ్గా, అందంగా కనిపిస్తాయి. ఆ విషయమై నేను తెలుసుకోగా-వాటిని 'ఐ లాషెస్' అంటారనీ, వాళ్ళు అవి అంటించుకుంటారనీ తెలిసింది. ఇలాంటి 'ఐ లాష్'లను మామూలుగా అందరూ ధరించ వచ్చునా? ధరించి బయటకు వెళ్ళ వచ్చునా? అయితే, అవి ఎక్కడ దొరుకుతాయి? వాటి ధర సుమారుగా ఎంత వుంటుంది? తెలియ జేస్తారా దయచేసి?

తెరమీద అందంగా కనిపించడానికి మేకప్ వేసుకున్నట్టే-కళ్ళు పెద్దవిగా కనిపించడానికి సినిమాతారలు – కృత్రిమమైన 'ఐ లాషెస్' వాడతారు. అలాగే, 'మోడల్స్' కూడా వాటిని వాడతారు. అయితే, వాటిని తరచూ వాడడం మంచివిధానం కాదు. ఎంచేతంటే, కనురెప్పల మీద, 'గమ్' (జిగురు) రాసి, వాటిని అతికిస్తారు. వాటిని మళ్ళీ తీసినప్పుడు సహజంగా కనురెప్పల మీద వుండే వెంట్రుకలు వూడివచ్చే ప్రమాదం వుంది। తరచుగా వాటిని వాడడం మంచిదికాదుగాని, ఎప్పుడైనా పెద్దసందర్భం అనుకున్నప్పుడు – వాడవచ్చును. కాని, దీంట్లోనూ ఒక ప్రమాదం వుంది. మీరు అనుకోకుండా ఏడవ వలసి వచ్చిందనుకోండి – ఆ నీటికి అంటించిన జిగురు కరిగిపోవడం, 'ఐ లాష్' వూడి రావడం జరుగుతుంది. సగం సగం వూడి వచ్చిన 'ఐ లాష్'తో చూసినపుడు, అది చాలా తమాషాగా కనిపించి, ఎదటివారికి ఫక్కున నవ్వుతెప్పిస్తుంది. అసలు-'ఐ లాష్' కంటే – కళ్ళ కింద 'నల్లగీత' గీసుకుని, కనురెప్పలకు కాటుక బాగా పెట్టుకుని, కళ్ళు పెద్దవిగా కనిపించేలా చేసుకోవచ్చును. రాత్రి వేళ పడుకునేటప్పుడు, మస్కర లాంటిది కళ్ళకు వాడితే, ఆ వెంట్రుకలు పొడుగు ఎదిగే అవకాశం వుంది. మన దేశంలో– కృత్రిమమైన 'ఐ లాష్'లను ఏ కంపెనీ తయారు చేస్తున్నదో నాకు తెలీదు. *

ఆర్.రాజ్యలక్ష్మి

కళాసాగరి-వనిత కలిసి నిర్వహించిన 'మదర్స్ డే' కార్యక్రమాలలో పాల్గొని-వక్తృత్వపోటీలలో ప్రథమ బహుమతి పొందిన కుమారి ఆర్. రాజ్యలక్ష్మి వృక్షశాస్త్రంతో బి. యస్ సి చదువుకున్నది. స్కూలు, కాలేజీలో చదువుకుంటున్న రోజుల్లో ఆమె వక్తృత్వంలో ప్రవేశం సంపాయించింది.

''నేను తొమ్మిదవ తరగతి చదివేటప్పుడు మొట్టమొదటిసారిగా సర్ త్యాగరాయ కళాశాలలో వేదిక మీద మాట్లాడే అవకాశం కలిగింది. అదే మొట్టమొదటిసారి కావడంవల్ల ఎంతో భయపడ్డాను అప్పుడు నాతో అక్కడికి వచ్చిన నా గురువుగారి మాటలు, ఇంట్లో ధైర్యం చెప్పి పంపిన మా అమ్మ మాటలవల్లా — ఒంట్లో ధైర్యాన్ని కూడదీసుకుని, అదురుతున్న గుండెతో వేదికనెక్కాను. అక్కడ ఆసీనులైన విద్యార్థీవిద్యార్థినులు, అధ్యక్షులు మొదలైన ప్రేక్షకులను చూడగానే అంతవరకు చిక్కబట్టుకున్న ధైర్యం జారిపోయింది. కాని ఎలాగో భగవంతుణ్ణి తలచుకుని రెండు వాక్యాలు మాట్లాడాను. పోనుపోను, అక్కడ వేనొక డిబేట్‌లో మాట్లాడుతున్నట్లు కాక - ఇంట్లో వాళ్ళతో మామూలుగాఏదో విషయం గురించి మాట్లాడుతున్నట్లే ఫీల్ అయ్యాను. అందుకే 'ప్రోత్సాహం' మనిషిని నాలుగడుగులు ముందుకు వేయిస్తుందని, అటువంటి ప్రోత్సాహమే అన్ని విషయాల్లోనూ పిల్లలకు అవసరమని నాకు అనుభవం ద్వారా తెలిసివచ్చింది.'' అని చెప్పింది ఆమె.

రాజ్యలక్ష్మి వక్తృత్వంలోనే కాకుండా, వ్యాస రచనల పోటీల్లోనూ పాల్గొనేది; బహుమతులు సంపాయించేది. ఆలిండియారేడియో వారు నిర్వహించే మహిళామండలి కార్యక్రమాల్లో కూడా ఆమె–చాలాసార్లు పాల్గొన్నది.

రాజ్యలక్ష్మికి కథలు రాయడం కూడా వచ్చును. ''అయితే అవి కాలేజి మాగ్‌జైన్స్‌లో మాత్రమే వచ్చాయి. పత్రికలకు ఇంతవరకూ పంపలేదు'' అన్నది ఆమె.

రాజ్యలక్ష్మికి ఇరవైఏళ్ళు. ఆమె పుట్టుకా, పెరుగుదలా, చదువూ అంతా మద్రాసులోనే. ''మంచి మంచి పుస్తకాలు చదవడం, తెలియని చాలా విషయాలు తెలుసుకోడం నా హాబీ'' అంటుంది ఆమె.

ఆమెకు సాహిత్యాభిలాష కూడా ఎక్కువే సాహిత్య సమావేశాలకు వెళ్ళడంలో ఎంతో ఉత్సాహం చూపుతుంది. ''చదువు పూర్తయిపోయినా, నేను నా కాలాన్ని వృధాగా గడపడం లేదు. వీలైనన్ని చేతిపనులు నేర్చుకుంటున్నాను. తప్పని సరయితే తప్ప, ఏదో 'ఫాషన్'కి అన్నట్టు స్త్రీలు ఉద్యోగాలు చెయ్యకూడదు అని నా అభిప్రాయం. స్త్రీకి విద్య చాలా అవసరం. అయితే అది 'ఉద్యోగం కోసమే' అన్నట్టుగా ఉండకూడదు. తనను, తన కుటుంబాన్ని చక్కదిద్దడానికి ఆ చదువు ఉపయోగపడాలి'' అంటుంది రాజ్యలక్ష్మి.

1976 సంవత్సరాల క్రితం డిసెంబరు 25 వ తేది. ఆ రోజు ప్రపంచ చరిత్రను మార్చిన రోజు. ఆ రోజున–జూడా సామ్రాజ్యంలోని బెత్లెహేమ్ అన్న గ్రామంలోని ఒక మారుమూల కుటీరంలో ఏసుక్రీస్తు పుట్టాడనీ, అందుకే ఆ రోజును క్రిస్మస్ పండగగా జరుపుకుంటారనీ అందరికీ తెలుసు. అయితే క్రిస్మస్ పండగను జరుపుకునే పద్ధతులలో మాత్రం ఆయా దేశాలను బట్టి ఎన్నో మార్పులు కనిపిస్తాయి.

క్రిస్మస్–పిన్నా పెద్దా అందరికీ సంబంధించిన పండగ. ప్రజల మధ్య సుహృద్భావాన్నీ శాంతినీ పెంపొందింపజేయడానికి తన జీవితాన్ని అంకితం చేసిన క్రీస్తు పుట్టినరోజైన క్రిస్మస్ నాడు కూడా సుహృద్భావాన్నీ. ప్రేమాభిమానాలను పెంపొందించే ప్రయత్నాలు జరుగుతుంటాయి.

ఈ పండగ పిల్లలకు బాగా ఉత్సాహకరంగా ఉంటుంది. వాళ్ళకు క్రిస్మస్ తాతయ్యగా పేరు గడించిన శాంతాక్లాస్ నుంచి బహుమతులు లభిస్తాయి. మిఠాయిలూ, టపాకాయలూ వాళ్ళకు పుష్కలంగా దొరుకుతాయి.

క్రీస్తు పుట్టిన విషయాన్ని. ఆకాశంలోని దివ్య నక్షత్రం ద్వారా తెలుసుకున్న ముగ్గురు ప్రాచ్య దేశాల జ్ఞానులు–ఆ పిల్లవాణ్ణి వెదుక్కుంటూ బయలుదేరుతారు. ఆ అపురూపమైన పిల్లవాడికి ఇచ్చేందుకు ఏవేవో కానుకలు తెస్తారు. అలా క్రిస్మస్ సందర్భంగా కానుకలు ఇచ్చే అలవాటు క్రీస్తు పుట్టుకతోనే ప్రారంభమైంది. క్రీస్తు జన్మించిన నాలుగు శతాబ్దాల తర్వాత 'శాంతాక్లాస్' పుట్టాడు. లిసియా అన్న ఊళ్ళో ఒక వర్తకుడుండేవాడు. బీదవాడైన అతను తన ముగ్గురు కూతుళ్ళకూ ఎలా పెళ్ళిచెయ్యాలో తెలియక ఇబ్బందిపడుతుండేవాడు. అప్పుడు నికలస్ అన్న బిషప్ వర్తకుడి సమస్య గ్రహించి రహస్యంగా అతని యింట డబ్బుతో నిండిన సంచీ వేశాడు. ఆ డబ్బుతో వర్తకుడు తన కూతుళ్ళ పెళ్ళిచేశాడు. ఆ తర్వాత నికలస్‌ను సెయింట్ నికలస్ అనసాగారు. కాలక్రమాన సెయింట్ నికలస్ పేరు 'శాంతాక్లాస్'గా మారిపోయింది. శాంతాక్లాస్‌ను పిల్లలకు బహుమతులు తెచ్చే తాతయ్యను చేశారు. అలా ఆయన చుట్టూ ఏవేవో కథలు అల్లారు. శాంతాక్లాస్ ఎగురుకుంటూ వచ్చి చిమ్నీల ద్వారా బహుమతులు వేసిపోతాడని నమ్మేవారూ ఉన్నారు.

ఇవాళ్టి పిల్లలకు శాంతాక్లాస్ పేరిట కోరిన బహుమతులిచ్చేది తమ తల్లిదండ్రులే నన్న విషయం బాగా తెలుసు! అయితే–క్రిస్మస్ సందర్భంగా పిల్లల పడకల పక్కన వారి సాక్స్ ఉంచడం, అందులో వారు కోరిన బహుమతులు పెట్టడం వంటి అలవాట్లు కూడా ఇటీవల మారిపోతున్నాయి.

శాంతాక్లాస్ మాట ఎలా ఉన్నా అన్ని దేశాలలోనూ క్రిస్మస్ చెట్టును అలంకరించే ఆనవాయితీ మాత్రం తప్పలేదు. ఈ క్రిస్మస్ చెట్టును అలంకరించే అలవాటు జర్మనీలో ప్రారంభమైంది. దాదాపు 1200 ఏళ్ళ ముందు ఇంగ్లండుకు చెందిన బోనిఫేస్ అన్న క్రైస్తవ మత బోధకుడు జర్మనీకి మతప్రచారం కోసం వెళ్ళాడు. ఒకరోజు అతనికి ఒక ఘోరం కనిపించింది. పిడుగుల దేవుడైన థోరస్ ఒక ఓక్ చెట్లో ఉన్నాడని నమ్మే ఆ ప్రాంత ప్రజలు–ఆ చెట్టుకు ఒక చిన్నపిల్లవాణ్ణి బలి చెయ్యడానికి సిద్ధంచే[illegible]. బోనిఫేస్ ఆ ప్రజలకు నచ్చచెప్పి ఆ బాలుణ్ణి రక్షించి ఆ 'ఓక్ చెట్టును నరికి అందులో ఏ శక్తి లేదని చూపాడు. అతని శక్తి ఆ ప్రజలకు ఆశ్చర్యం కలిగించింది. ఆ పడిపోయిన చెట్టు పక్కనే మొలకెత్తుతున్న చిన్న ఫర్ మొక్కను చూపి, అది వారు బలి చెయ్యబోయిన పిల్లవాడిలా ఉందని చెప్పి – ఆ మొక్కను క్రీస్తు బోధించిన ప్రేమకూ, అమాయకత్వానికి గుర్తుగా స్వీకరించాలన్నాడు. అలా ఫర్ మొక్క క్రిస్మస్ చెట్టుగా రూపొందింది. దానికి దీపాలు అమర్చి క్రీస్తు పుట్టినప్పుడు కనిపించిన నక్షత్రాలను జ్ఞాపకంచేసుకుంటుంటారు. ఆ చెట్టుకు దీపాలతోబాటు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసే కార్డులు, బహుమతి వస్తువులూ, తీపి పదార్థాలూ, బెలూన్లు కూడా కడుతూ ఉంటారు.

మన దేశంలో క్రిస్మస్ పండగ చేసుకునే పద్ధతులకూ విదేశాలలో ఉన్న పద్ధతులకూ ఎంతో తేడా ఉంది. మొదట్లో ఎలా ఉన్నా కాలక్రమాన- మన దేశ ఆచారవ్యవహారాలు కూడా క్రిస్మస్ పండగలో చోటుచేసుకున్నాయి. ఆ రోజు క్రైస్తవులు తమ తాహతుకు తగ్గట్టు కొత్త గుడ్డలు ధరించి చర్చికి వెడతారు. క్రిస్మస్ సందర్భంగా

కుటుంబసభ్యులందరూ ఏ ఊళ్ళలో ఉన్నా వచ్చి ఒకచోట చేరతారు. అలా అంతా కలిసి చర్చికి వెళ్ళి వచ్చాక—సన్నిహితుల ఇళ్ళకు వెడతారు. ఇల్లాళ్ళు ఇరుగుపొరుగువాళ్ళకూ, సన్నిహితులకూ తినుబండారాలు పంచుతారు. కొత్తగా పెళ్ళయిన కూతుళ్ళనూ, అల్లుళ్ళనూ, కొడుకులనూ, కోడళ్ళను క్రిస్మస్ సందర్భంగా పిలిపించి ఆనందంగా కాలం గడుపుతారు.

మనదేశంలో ఫర్ చెట్టు లేదు గనుక—చవుకు మానుల కొమ్మలు తెచ్చి దాంతో క్రిస్మస్ చెట్టును రూపొందిస్తూ ఉంటారు. దాన్ని ఇంట్లో ఒక ప్రముఖమైనచోట ఉంచి చక్కగా అలంకరిస్తారు.

జర్మనీనుంచి మద్రాసుకువచ్చి ఒక భారతీయుణ్ణి పెళ్ళాడిన శ్రీమతి గిసెలా ఆద్వానీ జర్మనీలో క్రిస్మస్ ఎలా జరుపుకుంటారో 'వనిత'కు చెప్పారు: "క్రిస్మస్ మరో నెలరోజులుందనగానే జర్మనీలో సంబరం ప్రారంభమవుతుంది. ప్రతి రోజూ ఏదో ఒక ఆసక్తికరమైన విశేషం ఎదురవుతూనే ఉంటుంది. ప్రత్యేకమైన బిస్కట్లూ అవీ తయారు చేస్తారు. క్రిస్మస్ రోజున—వేకువనే నాలుగున్నర గంటలకల్లా చర్చిలో సర్వీస్ ఉంటుంది. చర్చికి వెళ్ళివచ్చిన కుటుంబ సభ్యులంతా క్రిస్మస్ చెట్టు చుట్టూ ముగుతారు. అక్కడ బహుమతుల పంపకం, పాటలు పాడడం, గంటలు మోగించడం వంటివి సాగుతాయి. ఆవేళ భోజనం ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. అంగళ్ళను పెద్ద ఎత్తున అలంకరిస్తారు. క్రిస్మస్ ముందు వెనకా కూడా ఊళ్ళన్నీ పండగ ధోరణిలో పడిపోతాయి" అన్నారు ఆమె.

"స్వీడెన్‌లో డిసెంబరు 13 నుంచీ క్రిస్మస్ సందడి ప్రారంభమవుతుంది. ఆరోజును లూసియా (అంటే దీపాల పండగ) అంటారు. ఇటలీనుంచి ఒక మతాచార్యుడు దీపాన్ని తీసుకొచ్చాడని స్వీడన్ ప్రజల విశ్వాసం. చిన్నపిల్లలు తెల్లని గుడ్డలు ధరించి చేతుల్లో దీపాలు పట్టుకుని ఊరేగుతారు. కాఫీ, కాషాయం రంగు బన్నులు, అల్లం బిస్కట్లు—పంపిణీ అవుతాయి. ప్రతి యింట్లోను ఉయ్యాల తొట్టి ఉంచి—అలా క్రీస్తు పుట్టుకను సూచిస్తారు. పిల్లలకు డిసెంబరు 1వ నాడు 24 చక్రాలున్న బండిని ఎంబ్రాయిడరీ చేసి యిచ్చి—క్రిస్మస్ రోజుదాకా అందులో రోజూ ఒక బహుమతి చొప్పున పెడుతుంటారు," అన్నారు స్టీనావాసు. ఆమె స్వదేశం స్వీడెన్. శ్రీమతి గిసెలాలా ఈమెకూడా ఒక భారతీయుడి ఇల్లాలే!

పిండివంటలు లేకుండా పండగ కాదు. కనుక క్రిస్మస్ సందర్భంగా చేసుకోదగ్గ రెండు పిండి వంటల గురించి తెలుసుకుందామా?

క్రిస్మస్ కేక్

మొదట ఒక 'పుడ్డింగ్' చేసే విధానం గురించి తెలుసుకుందాము. ఈ పుడ్డింగ్‌ను 'చాకొలేట్ పుడ్డింగ్' అంటారు.

దీన్ని ఎలా చేస్తారు?

ఈ పుడ్డింగ్ చెయ్యడానికి 75 గ్రాముల మైదా పిండి, ¼ టీ స్పూను బేకింగ్ పౌడర్, 2 టేబుల్ స్పూనుల కోకో, బ్రెడ్‌ముక్కలు కొన్ని, దాదాపు 60 గ్రాముల సుయెట్ (ఇది పట్టణాలలో దొరుకుతుంది. సుయెట్ అంటే ఒకరకమైన కొవ్వు పదార్థం), 60 గ్రాముల చక్కెర, గుడ్డు, పాలు, వెనిల్లా ఎసెన్స్ (కొన్నిచుక్కలు), చిటికెడు ఉప్పు సిద్ధం చేసుకుంటారు.

మొదట మైదాపిండికి ¼ టీ స్పూను బేకింగ్ పౌడరును కలుపుకుంటారు. ఆ తర్వాత దానికి 2 టేబుల్ స్పూనుల కోకోను కలుపుతారు. దానికో చిటికెడు ఉప్పు కలిపి, ఆ మిశ్రమాన్ని అలాగే జల్లించి విడిగా తీసిపెడతారు.

ఆ మిశ్రమానికి బ్రెడ్‌ముక్కలు, సుయెట్ చేర్చి బాగా కలుపుతారు.

ఆ తర్వాత కాచినపాలను, గుడ్డునూ తీసుకుని పగలగొట్టి మొదటతయారుచేసుకున్న మిశ్రమానికి కలిపి, దానికి వెనిల్లా ఎసెన్స్ చేరుస్తారు. ఇలా తయారు చేసిన మిశ్రమంలో కాచినపాలు మరిన్ని పోసి మొత్తం మిశ్రమం కొద్దిగా జిగురులా సాగే తీరులో తయారు చేసుకుంటారు.

ఒక శుభ్రమైన బేసిన్ తీసుకుని దాని లోపలి అంచులకు నెయ్యి (లేదా వెన్న) పూసి ఉంచుకుంటారు. ఆ బేసిన్‌లో కొద్దిగా మైదాపిండి చల్లి ఆ తర్వాత తయారు చేసుకున్న మిశ్రమాన్ని అందులో పోస్తారు. విడిగా దొరికే గ్రీస్ ప్రూఫ్ పేపర్ (బటర్ పేపర్) తీసుకుని దానికి నెయ్యి (లేదా వెన్న) పూసి—ఆ పేపర్‌ను బేసిన్‌లోని మిశ్రమం మీద కప్పిపెడతారు. అలాగే ఆ మిశ్రమాన్ని దాదాపు 1¾ గంటసేపు ప్రెషర్‌కుక్కర్ ఉపయోగించి ఆవిరిలో పెట్టడమో, ఉడికించడమో చేసి 'చాకొలేట్ పుడ్డింగ్' తయారు చేస్తారు. ఈ పుడ్డింగ్‌ను చాకొలేట్ సాస్‌తోగానీ, కస్టర్డ్ సాస్‌తోగానీ కలిపి తింటే బావుంటుందంటారు—ఆ రుచి తెలిసినవారు.

ఇక—క్రిస్మస్ సందర్భంగా రుచి చూడదగ్గ కేక్ ఒకటి ఎలా తయారు చేస్తారో చదివి, తెలుసుకోవచ్చు.

12 టేబుల్‌స్పూనుల మైదాపిండి (లేదా 12 అవున్సులు), ఒక టీ స్పూను ఉప్పు, 280 గ్రాముల వెన్న, బాగా పొడిచేసిన చక్కెర 10 టేబుల్ స్పూనులు, పెద్ద గుడ్లు 5, పెద్ద నిమ్మపండు ఒకటి, 225 గ్రాములు ఎండిన 'ప్లమ్' పళ్ళు, 225 గ్రాముల చెర్రీపళ్ళు, 225 గ్రాములు పైనాపిల్ పళ్ళముక్కలు తీసుకుని కేక్ తయారుచేస్తారు.

ఇవన్నీ సిద్ధంచేసుకున్నాక, ప్లమ్ పళ్ళను ముందురోజు రాత్రే నీళ్ళలో వేసి నానబెట్టి, మర్నాడు ముక్కలు ముక్కలుగా తరిగి ఉంచుకుంటారు. నిమ్మపండును పిండి రసం తీసి ఉంచుకుంటారు. తర్వాత దానిమీది తొక్కను తురిమి 'కోరు' సిద్ధంచేసుకుంటారు. చెర్రీపళ్ళను బాగా కడిగి సగానికి కోసి, ఆ ముక్కలు తీసుకుంటారు. పైనాపిల్ ముక్కలను కూడా బాగా చిన్న ముక్కలుగా కోసుకుంటారు.

మొదట మైదాపిండిలో ఉప్పు వేసి, దాన్ని బాగా జల్లిస్తారు. ఒక పింగాణిపాత్రలో వెన్నను, చక్కెరను వేసి కర్ర చెమ్చాతో బాగా కలియబెడతారు. చక్కెర, వెన్న మిశ్రమంలో గుడ్లను పగలగొట్టి వేసి, అందులో నిమ్మపండు తొక్క కోరును వేసి, ఆ మిశ్రమాన్ని బాగా కొడతారు. అలా కొట్టడం వల్ల మిశ్రమం ముద్దగా

అవుతుంది. ఇలా చివరి గుడ్డును పగలగొట్టి వేస్తున్నప్పుడు ముందుగా జల్లించి ఉంచిన మైదా పిండిని కూడా చక్కెర వెన్న మిశ్రమాలతో కలుపుతారు. తర్వాత, ముందుగా తరిగి ఉంచుకున్న పళ్ళముక్కలు, నిమ్మరసం – ఈ మిశ్రమానికి కలుపుతారు.

అన్నిటినీ బాగా కలియబెడతారు. మొత్తంమీద మిశ్రమం మరీగట్టిగా, మరీపలచగా కాకుండా మధ్యరకంగా ఉండేలా చూసుకుంటారు.

తర్వాత, ఈ మిశ్రమాన్ని 8నుంచి 9అంగుళాల వ్యాసం గల వృత్తాకారపు కేక్‌టిన్ను (ఇది కాస్త లోతుగా కూడా ఉంటుంది) తీసుకుని – అందులో వేస్తారు. అలా వేస్తున్నప్పుడు మిశ్రమం మీది భాగం మధ్య కాస్త లోతుగా ఉండేలా చూసుకుంటారు. మిశ్రమం వేసేముందే టిన్ను లోపలి అంచులకు వెన్న పూసి ఉంచుకుంటారు.

ఈ కేక్‌టిన్నును 310 డిగ్రీ (ఫారన్‌హీట్) ఉష్ణోగ్రతలో $1\frac{1}{2}$ గంటలసేపు 'బేక్' చేసి, తర్వాత ఉష్ణోగ్రతను 290 డిగ్రీలకు తగ్గించి $2\frac{1}{2}$ గంటలసేపూ 'బేక్' చేస్తారు.

ఈ రకంగా తయారు చేసే ఈ కేక్‌ను 'గోల్డన్ ఫ్రూట్ కేక్' అంటారు.

వర్ణచిత్రం : సత్యకుమార్

విద్యార్థినులు అలంకరణ

పి. మాధవి

ఆ రోజు శనివారం. లక్ష్మిగారింట్లో నేనూ, మరో ఫ్రెండూ మాట్లాడుతూ కూర్చున్నాం. నాలుగున్నర కొట్టింది గడియారం. ఇంటికి పోదామని బయటకు రాబోతుండగా గేటు విసురుగా తోసుకుని ధుమధుమలాడే ముఖంతో, జోళ్ళను పెద్దగా చప్పుడు చేసుకుంటూ లోపలికి వచ్చింది లక్ష్మిగారి పెద్దమ్మాయి కమల. చేతిలో ఉన్న పుస్తకాలను ఓ మూలకు గిరవాటువేసి, ఎర్రబడ్డ ముఖంతో "నేనింక [redacted] వెళ్ళనమ్మా" అంది తీవ్రంగా. ముగ్గురం ఒక్కసారిగా తెల్లబోయాం. "అదేం. ఇప్పుడేమయింది?" అంది లక్ష్మి. ఆ పిల్ల జవాబు చెప్పకుండా ఏడుస్తూ కూర్చుంది. కాలేజీకి వెళ్ళనని మొరాయించింది. అడగ్గా-అడగ్గా తేలినవిషయం ఏమంటే, ఆ అమ్మాయి ఇంటికి వస్తూంటే కొందరు పెంకికుర్రాళ్ళు—కూడా వెంబడించి ఏవేవో కూతలు కూశారట, నవ్వారుట.

ఆ అమ్మాయిని అప్పుడు పరీక్షగా చూశాను. పల్చని షిఫాన్‌చీర కట్టుకుంది. ఆ చీరలోపలి శాటిన్ పూలపావడా స్పష్టంగా బయటకుకన్పిస్తోంది. జడను తమాషాగా సగంనుంచి రెండు అల్లికలు మాత్రం అల్లి మిగతా జుట్టు తుప్పలా వదిలేసింది వీపు మీద. పెదాలకు, పొడుగ్గా పెంచుకున్న గోళ్ళకు రంగు వేసింది. వీపూ, పొట్టా సగానికి కన్పించేలా పొట్టి జాకెట్టు వేసుకుని, కాటుక రేఖలను కళ్ళ కొసలనుంచి కణతలవరకు పెట్టింది. ఇంకా ఏమిటేమిటో; అదంతా నేను వర్ణించలేననుకోండి. మొత్తంమీద ఆ అమ్మాయి వాలకం చూస్తే, ఏ బ్యూటీ కాంపిటిషన్‌కో, పిక్చర్‌కో, పార్టీకో వెళ్ళిందనుకుంటారు కాని, కాలేజీకి చదువుకోడానికి వెళ్ళిందని ఎవరూ అనుకోరు. మనస్సులోని ఈ భావమే ఆ అమ్మాయితో చెప్పాలనిపించింది. మొహమాటంకొద్దీ ఊరుకున్నాను. కాని నా ఫ్రెండ్ ఉంది చూశారూ, మనసులోని మాటలను తపీమని మొహం మీద అనేసే రకం.

"చూడమ్మా! వాళ్ళేదో అంటున్నారని బాధపడుతున్నావ్‌కాని నీ విషయం కూడా ఆలోచించు. నువు చేసుకున్న అలంకరణ చూసేవాళ్ళకి నీమీద ఏహ్యాభావం కలిగిస్తుందే కాని, సద్భావం కలిగించదు. అందువల్లే వాళ్ళంత లోకువగా మాటలంటున్నారు. నీ కూడా వస్తున్న మిగతా పిల్లల్ని అంటున్నారా? కారణం ఏమిటంటావు?" నా ఫ్రెండు మాటలకు ఇంకొకరయితే కోపగించుకునేవారే కాని, స్వతహాగా మంచిపిల్ల కాబట్టి వింటూ కూర్చుండిపోయింది. ఇలాంటి అనుభవాలు నేటి విద్యార్థినులకు సర్వసాధారణమయిపోయింది. నేనీ వ్యాసాన్ని వ్రాస్తుంటే, నాకు తెలీకుండా చదువుతూన్న మా చెల్లాయి కోపంగా "ఒక్క కాలేజీ పిల్లలేనా అట్లా తయారవుతోంది? మిగతా ఆడవాళ్ళు తయారవటంలేదా?" అంది. తక్కిన స్త్రీల విషయంలో కాక, విద్యార్థినులకు ఒక ప్రత్యేకత ఉంది. రోడ్డు మీద బయటకు వెళ్ళి చదువుకోని అమ్మాయి ఎంత ఫాషన్‌గా తయారయి వెడుతున్నా అంతగా ఎవరూ పట్టించుకోరు.

ఆదే-రోజూ కాలేజీకి వెళ్ళే అమ్మాయి అయితే, ఎన్ని జతల కళ్ళో ఆమెను వెంటాడుతుంటాయి. ఆమె కట్టూ, బొట్టూ, తీరును విమర్శిస్తుంటాయి. అందుచేత విద్యార్థినులు—ముఖ్యంగా మగవాళ్ళతో కలిసి చదువుకునే విద్యార్థినులు-తమ వస్త్రాలంకరణ విషయంలో ప్రత్యేకశ్రద్ధ తీసుకోవాలి. అట్లానే ఉద్యోగాలు చేస్తున్న స్త్రీలు కూడా, తమ్ము తాము గుర్తుంచుకుంటూ, అతిగాపోకుండా, ఆడంబరం లేకుండా వినయం ఒప్పేవిధంగా అలంకరించుకున్నపుడే, నలుగురి మధ్యా నిలబడి గౌరవంగా ఉద్యోగం చెయ్యగలుగుతారు. అట్లాగని విద్యార్థినులంతా విపరీతంగా తయారవుతున్నారని అనను. వారి వారి అభిరుచులనుబట్టి, వారి కిష్టం వచ్చినట్లు అలంకరించుకోవచ్చు. అలంకరణ దోషమని ఎవరూ అనరు. కాని ఆ అలంకరణ విపరీతమై పరిమితి దాటినప్పుడు—మన సంతోషం కోసం, మన ఆనందం కోసం చేసుకున్న అలంకరణ ఇతరులకు ఎబ్బెట్టుగా కనిపించవచ్చు. దుష్ఫలితాలను కలిగించవచ్చును. అప్పుడు మన అలంకరణ సవరించుకోమని చెప్పే హక్కు ఇతరులకు ఉంది.

ఈ అలంకరణ ఎంత విపరీతంగా ఉండకపోతే, కొందరు ప్రిన్స్‌పాల్స్—ట్రాన్స్‌పరెంట్ (ఉల్లిపొర) దుస్తులు వేసుకుని ఎవరూ కాలేజీకి రాకూడదని నోటీసులు పంపిస్తారా? విద్యనార్జించడానికి వెళుతున్న విద్యాలయాన్ని ఫ్యాషను సెంటర్సుగా—కొందరు విద్యార్థినులు చూస్తున్నారనడం అబద్ధం కాదు. సహజంగా ఆ వయస్సులో ఉద్రేక హృదయాలు గల కాలేజీ యువకులు, ఈ విపరీత ఆకర్షణలకు మరింత ఉద్రేకపడుతూ, కేకలు వేస్తున్నారంటే, ఏవేవో కొంటెపనులు చేస్తున్నారంటే, చేయరూ మరి? మనం ధరించే దుస్తులను బట్టి మన ప్రవర్తనను ఇతరులు నిర్ణయిస్తారనేది నగ్నసత్యం.

పూర్వం ఒంటినిండా దుస్తులు ధరించడం నాగరికత అనిపించుకుంది. ఈ నవీన యుగంలో శరీరాన్ని ఎంత బహిర్గతంచేస్తే అంత నాగరికతగా చెలామణి కావడం పరిపాటి అయిపోయింది. ఇంట్లో ఎలా ఉన్నా, ఇల్లు విడిచి నలుగురి మధ్య ముఖ్యంగా మగవాళ్ళ మధ్య సంచరించేటప్పుడు మన దుస్తుల అమరిక విషయంలో ప్రత్యేక శ్రద్ధ

తీసుకోవాలి. ఇతరులకు మనమీద గౌరవభావం కలగాలి. ఈ రోజుల్లో విద్యార్థినులు పావడ మీద అరగజం వోణీముక్క ధరించిరావటం ప్యాషను అయింది. ఈ ఓణీ ఎందుకు వేసుకుంటున్నారో అర్థంకాదు. ఇట్లా తయారై స్కూళ్ళకు, కాలేజీలకు వెళుతూన్న ఆడపిల్లల్ని చూస్తూ ఆ తల్లి తండ్రులు, ముఖ్యంగా తల్లులు ఎట్లా ఊరుకుంటున్నారా అనిపిస్తుంది. ఆడపిల్లల వస్త్రాలంకరణ విషయంలో తల్లులు తగిన జాగ్రత్త తీసుకోవడం మంచిది.

తన కుమార్తె ఎలాంటి దుస్తులు ఎలా ధరించి వెడుతుందో తల్లి పర్యవేక్షించడం ఎంతో అవసరం. అలా అని ఆ పర్యవేక్షణ కూడా అతిగా వుండకూడదు. అతిగా పోతూ పిల్లల సున్నితమైన మనస్సులను నొప్పించకూడదు. ఒక్కొక్కసారి మితిమీరిన పర్యవేక్షణ పిల్లల్ని పాడు చేస్తుంది కూడా. దుస్తులను ఎలా ధరించితే బాగుంటుందో, మర్యాదగా వుంటుందో వారికి నేర్పించాలి. ఈ విషయంలో మొగట తల్లులే పిల్లలకు మార్గ దర్శకులు కావాలి. కాన్వెంటు విద్యార్థినులు ఆదర్శంగా కనబడతారు. ఎవరెవరి అంతస్తులు ఎలాటివయినా, అభిరుచులు ఎలా ఉన్నా అంతా ఒకటే యూనిఫారం ధరించడం వలన ఏ ఆకర్షణకూ లొంగిపోకుండా, తమ లక్ష్యం మీద దృష్టి ఉంచడానికి వీలవుతుంది. విద్యార్థినులంతా విపరీతంగా తయారవుతున్నారని నా ఉద్దేశ్యం కాదు. ఎంత ఉన్నతమైన చదువులో ఉన్నా, ఎంతో నిరాడంబరంగా, సామాన్యంగా కనిపించే ఆదర్శ విద్యార్థినులు ఎంతో మంది ఉన్నారు.

ఏ వేళప్పుడు ఎలాంటి దుస్తులు వేసుకుని ఎలా తయారయితే బాగుంటుందో మనల్ని, మన పరిసరాల్ని, మనసులో పెట్టుకుని మనకున్న విచక్షణా జ్ఞానం ఉపయోగించుకొని, నిర్ణయించుకోవడం మంచిది.

□

పొరపాటు

నేను కథ వ్రాశాను. నా కెంతో తృప్తిగా వుంది. వ్రాసినది పదేపదే చదువుకున్నాను. బాగానే వుంది నామట్టుకు. యిది పత్రికలో పడాలి. అన్నయ్య గర్వం అణగాలి. పెద్ద....గొప్ప....తనకే కథలు వ్రాయటం వచ్చని గర్వం. ఏ పత్రిక నుంచైనా మనియార్డరు వస్తే ఎంత మురిసి పోతాడని! సరదాకైనా ఎప్పుడూ నా చేతిలోకాని, తమ్ముడి చేతిలో కాని ఒక అయిదు రూపాయలు పెట్టి ఎరగడు. నేను అలా కాదు. నా మొదటి కథ అచ్చయితే యింట్లో అందరికీ నాకు తోచిన ప్రజెంటేషన్లు కొంటాను. ఫ్రెండ్సుకి 'పార్టీ' యిస్తాను యింతకీ ఈ కథ పోస్టు చెయ్యటమెలా? నాలో నాకే నవ్వు వచ్చింది. కథ చేతిలో పట్టుకునే కలలు కంటున్నాను. అవును. ఈ కథ పోస్టు చెయ్యటమెలా? యింట్లో ఎవ్వరూ లేరు. అమ్మ వూరికెళ్ళింది. అవతల పనిమనిషి అంట్లు తోముతూంది. యిటూ అటూ కాలుగాలిన పిల్లిలా తిరిగాను. నేను రాసిన మొదటి కథ వెంటనే పోస్టు చెయ్యకపోతే ఎంతో చికాగ్గా వుంది. "అక్కా అన్నం పెట్టవూ? స్కూలుకి వెళ్ళిపోవాలి...." తమ్ముడు వచ్చాడు. "ఒరేయ్ చిన్నా....నాకో చిన్న పని చేసిపెడతావురా?" నెమ్మదిగా అడిగాను, అన్నం పెడుతూ. "ఓ...." తల ఎగరవేశాడు. "తలెగరెయ్యటం కాదు. నేను చెప్పినట్లు జాగ్రత్తగా చెయ్యాలి. అంతేకాదు. యింట్లో ఎవ్వరికీ....ముఖ్యంగా అన్నయ్యకీ — చెప్పకూడదు." ఒక్క నిమిషం నా వైపు అయోమయంగా చూసి, "సరే...." అన్నట్లుగా తల ఎగరవేశాడు తమ్ముడు. అన్నం తిన్న తర్వాత నా కథ వాడి చేతిలో పెట్టాను. యింకొక కాగితం మీద అడ్రసూ అదీ వ్రాసి యిచ్చి, ఎలా పోస్టు చెయ్యాలో వివరంగా చెప్పాను. "నాకు తెలుసులే అక్కా. ఎలా పోస్టు చెయ్యాలో....! అన్నయ్య కవర్లు ఎన్నిసార్లు పోస్టు చెయ్యలేదు?" విసుక్కుంటూ వెళ్ళాడు వాడు.

కథ పోస్టుకి పంపించిన దగ్గరనుండి భయం పట్టుకుంది. బాగుందో లేదో? వేసుకుంటారో లేదో? మళ్ళీ ఒకసారి చదవవలసింది. పోని అన్నయ్యకైనా చూపెట్టవలసింది. ఎంతైనా వాడికి కథలు వ్రాయటంలో అనుభవం వుంది కదా....పోనీ పత్రికలో వేసుకున్నారనుకుందాము. పాఠకులకు నచ్చొద్దూ.... 'ఛీ....చెత్తలాగుంది....' అని ఉత్తరాలొస్తే? ఏమైనా...అట్నుంచి రిప్లై రావటానికి కనీసం వెల్లాళ్ళు పడుతుంది. యిప్పటినుండి ఈ ఆలోచనలన్నీ ఎందుకు?

*

"పోస్టు..." కేక.

నా కథ వ్రాసి పంపి యింకా మూడు రోజులే అయింది. అప్పుడే ఏం తెలుస్తుంది?....అనుకుని కూర్చున్నాను.

అన్నయ్య వెళ్ళి కవరు తెచ్చాడు. ఆ కవర్ని చూచిన అన్నయ్య ఎంత ఆశ్చర్యపోతున్నాడో నాకూ అంత ఆశ్చర్యంగానే వుంది.

అప్పుడే ఎలా తిరిగి వచ్చేసింది?

"ఓహెూ....నువ్వూ కథ పంపించేవూ పత్రికకు? మా రచయిత్రులు ఎక్కువైపోవటంతో మగ వాళ్ళ కథలేం కన్పించటం లేదీ మధ్య .. యింతకీ....తిరిగి వచ్చిందిలే....అయితే యిది ఎన్నోది....?" అది [illegible] ఎగతాళో తెలియదు. కవరు విప్పి యిటూ అటూ చూచి...యిల్లదిరిపోయేట్టు నవ్వాడు.

"ఏం? ఏమయింది?" అన్నాను అసహనంగా.

"ఇది తమ్ములుంగార్కిచ్చావా పోస్టు చెయ్యమని? బాగా చేశాడులే. పత్రికల వాళ్ళకు వెళ్ళవలసిన కవరు లోన పెట్టేసి, రిటర్న్ స్టాంప్స్ అంటించినది పోస్టు చేశాడు. ఇది పత్రికాఫీసు చేరనే లేదు."

పత్రిక వాళ్ళు త్రిప్పి పంపలేదు కదా అని సంతోషించినా, నా మొదటి కథ పని యింత అస్తవ్యస్తమైనందుకు ఏడుపొచ్చింది.

"ఛీ....ఏడుస్తున్నావా? ఎందుకు?" ఎప్పుడూ లేనిది అన్నయ్య ప్రేమగా వచ్చి తల నిమిరాడు.

"నా చెల్లి రచయిత్రి అయిందంటే నాకెంత గర్వం? ఎంత సంతోషం? నీ కథ చదివి, ఏమైనా తప్పులుంటే సరిచేసి నేనే పంపిస్తాను...."

సంతోషంగా, కృతజ్ఞతగా అన్నయ్య వైపు చూశాను.

— మా. నీలమణి

వర్ణచిత్రం : కె. ఆర్. వి. భక్త

"మనదేశంలో–పైచదువులపట్ల ఆసక్తి చూపుతున్న విద్యార్థినులందరూ – సాంకేతిక విద్యలపట్ల ఎక్కువ ఉత్సాహాన్ని కనబరచడంలేదు. ఈ ధోరణి సరైనది కాదని నా అభిప్రాయం. కొన్ని వర్ధమాన దేశాలలోని వనితలు సాంస్కృతిక రంగంలోనే కాక పారిశ్రామిక, వైజ్ఞానిక రంగాలలో కూడా చక్కని అభివృద్ధిని సాధిస్తున్నారు. తమ సమయాన్ని–వృథా చేయకుండా, వీలైనంత వరకూ సంఘానికి–ప్రత్యక్షంగాను, పరోక్షంగాను ఉపయోగపడే విధంగా ఎన్నో నిర్మాణాత్మకమైన పనులు చేస్తున్నారు. సాంకేతిక విద్యలలో కూడా ప్రావీణ్యం సంపాయించి–సమాజ శ్రేయస్సుకు అన్నివిధాలా దోహదంచేసే రంగాలలో వనితలు పాల్గొనడంవల్లనే, ఇవాళ రష్యాదేశం–ప్రపంచంలోని ప్రముఖ దేశాలలో ఒకటిగా కీర్తిని పొందగలిగింది" అంటారు పార్లమెంటు సభ్యురాలైన శ్రీమతి జయలక్ష్మి.

శ్రీమతి జయలక్ష్మి – తండ్రిగారైన ఎస్. రామస్వామినాయుడు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న ప్రముఖులు. కీ. శే. కామరాజ్ నాడార్ కు కుడి భుజంగా ఆయన వివిధ రాజకీయోద్యమాలలో పాల్గొన్నారు. కొంతకాలంపాటు తమిళనాడు శాసనసభ సభ్యుడిగా పనిచేశారు. '69లో శ్రీ రామస్వామి నాయుడు మరణించిన తర్వాత, తండ్రి అడుగుజాడల్లోనే పయనించాలని ఆశించిన శ్రీమతి

పార్లమెంటు సభ్యురాలు జయలక్ష్మి

జయలక్ష్మి రాజకీయాలలో ప్రవేశించారు. సన్నిహితుల ప్రోద్బలంతో—'71లో జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా నిలబడి – శివకాశి నియోజక వర్గం నుంచి లోక్‌సభకు ఎన్నుకోబడ్డారు. తమిళనాడు కాంగ్రెస్ పార్టీలో ఒక జిల్లాకు అధ్యక్షురాలిగా పదవిని నిర్వహిస్తున్న ఏకైక వనిత శ్రీమతి జయలక్ష్మి!

రాజకీయ రంగంలో ఆమె కృషికి భర్త ప్రోత్సాహం కూడా లభించింది.

'పార్లమెంటు సభ్యురాలిగా వనితల సంక్షేమానికి మీరు ఏ విధంగా కృషి చేయగలుగుతున్నారు?' అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ శ్రీమతి జయలక్ష్మి ఇలా అన్నారు.

"నా నియోజక వర్గంలో – అగ్గిపెట్టెలు, పటాసులువంటి వాటిని ఉత్పత్తిచేసే సంస్థలలో ఎక్కువ మంది స్త్రీలు పని చేస్తుంటారు. వీళ్ళలో చాలామంది—తమ సంపాదన చాలకపోవడంవల్ల ఇంట్లో ఉండే పిల్లలను కూడా తీసుకొచ్చి వాళ్ళ చేత పనులు చేయిస్తూ ఉంటారు. అందువల్ల పిల్లలకు చదువు నేర్చుకునే అవకాశం లేకపోవడమే కాకుండా, వాళ్ళ ఆరోగ్యం కూడా దెబ్బతినే ప్రమాదం ఉంది. ఈ సమస్యను పరిష్కరించడానికై-నేనొక పథకం రూపొందించి-ప్రభుత్వానికి అందజేశాను. త్వరలోనే వాళ్ళ పరిస్థితి బాగుపడుతుందని నా నమ్మకం."

మరో ప్రశ్నకు సమాధానం చెబుతూ "ఏ కుటీర పరిశ్రమలోనైనా – నలభై మందికి పైగా పనివారుంటే వాళ్ళకు ఆ సంస్థ 'ఫాక్టరీ ఆక్టు' ప్రకారం అన్ని వసతులూ సమకూర్చాలని–ఇటీవల ఒక నిర్ణయం తీసుకోవడం జరిగింది. ఆ విధంగా కూడా ఇక్కడి పనివారికి కొంత మేలు జరుగుతుంది" అన్నారు శ్రీమతి జయలక్ష్మి.

ఈనాటి యువతరం శక్తి సామర్థ్యాల పట్ల శ్రీమతి జయలక్ష్మికి ఎంతో నమ్మకం ఉంది.

"ఈ కాలపు యువతీ యువకులు తెలివైనవారనడంలో ఎంత మాత్రం సందేహం లేదు. ఐతే–వాళ్ళ ప్రతిభకు–సరైన లక్ష్యాన్ని మనం చూపగలగాలి. వాళ్ళకు–సాంఘిక బాధ్యతలపట్ల–ఒక దృక్పథాన్ని ఏర్పరచాలి. ముఖ్యంగా చిన్నచిన్న పట్టణాలలోను, గ్రామాలలోను చదువుకుంటున్న విద్యార్థినులు – తమకు తాముగానే–సాంఘిక సంక్షేమ కార్యక్రమాలను చేపట్టాలి. వాటిపట్ల ఉత్సాహం చూపే వనితలను – మగవాళ్ళు నిరుత్సాహపరచకుండా — వాళ్ళకు సహాయం చెయ్యాలి. ఇంట్లో పెద్దలు కూడా వాళ్ళను అటువంటి సంక్షేమ కార్యక్రమాలకు పాల్గొనేందుకు ప్రోత్సాహాన్ని అందజేయాలి. గ్రామాలు బాగుపడితేనే దేశం బాగుపడుతుందన్న గాంధీజీ లక్ష్యం అప్పుడే నెరవేరుతుంది!" అంటారు శ్రీమతి జయలక్ష్మి.

*

ఆగిపోయిన కలం

కవిత రాయాలని కలలు కన్నాను;
ఆ కలలన్నీ సెలయేటి గలగలల్లా –
ప్రతిధ్వనిస్తూ.... ప్రవహించాయి, నా ఎదలో;
కాని భావతరంగాలు నాకతీతమయ్యాయి
హృదయాన్ని చీల్చుకు వచ్చే ఆవేశానికి –
రూపం కల్పించాలన్నది నా ఆశ;
ఐతే అక్షరమాల అదృశ్యమైంది.

వ్యథ గుండెను పిండేస్తున్నా....
దేన్నో సాధించాలనే ఆరాటం;
ఏమీ చేయలేని పరిస్థితి
ఏదో రాయాలనే తపన—
అదే ఊహకందటం లేదు.

కలమూ కాగితాలూ అందుకున్నా....
పాల నురుగువంటి తెల్లని కాగితంపై,
అమావాస్యలాంటి సిరాను చిందించాను
నాలోని భావం పురి విప్పింది
కాగితం మీద అక్షరాలు చిందుతున్నాయ్....
సిరా యింకిపోతూంది.
కాగితంపై చిందులు వేస్తున్న కలం....
ఆగిపోయింది.
కలం పట్టుకున్న చేయి జారిపోయింది.

—నైనారు అమ్ములు

ప్రయత్నం

నా ఇంటిలోని సమస్యా తిమిరాన్ని
ఛేదింప జాలని నేను
నా వారిలోని అజ్ఞానాంధకారాన్ని
తొలగించలేని నేను
నా మదిలోని ఈర్ష్యా నైరాశ్యాన్ని
రూపు మాపలేని నేను
ఇంటి ముందు సమతా దీపాలు
వెలిగించుతున్నాను
వీధిలోని చీకటిని పారదోలాలని
విశ్వ ప్రయత్నం చేస్తున్నాను.

—విజయ సంజీవ

అనన్య ప్రచారంగల

మహిళ

తెలుగు పత్రికా రంగంలో తొలిసారిగా మహిళ నిర్వహిస్తున్న

అందాల పోటీ

జనవరి 1977 సంచిక నుండి ప్రారంభం

వివరాలకు "మహిళ" చూడండి.

మీ అభిమాన రమణీయ రచయిత్రి

యద్దనపూడి సులోచనారాణి

అందిస్తున్న మహోత్తర బృహత్తర కాదంబరి

సంసారరథం

సీరియల్‌గా జనవరి 1977 సంచిక నుండి ప్రారంభం

విడి ప్రతి: రూ. 2/-

సాలు చందా: రూ. 24/-

మహిళ

తిరుపతి-517 501

మహిళల మధుర జీవనానికి మార్గదర్శి

మహిళ

చందమామ

ఆవంట్స శారదాదేవి

మా ఎదురింటివాళ్ళబ్బాయి. అతనూ నేనూ చిన్నప్పటినుంచి కలిసి ఆడుకున్నాం. కలిసి పెరిగాం. నేను బి.ఎ. చదువుతూ ఉండగా అతను పై చదువులకని అమెరికా వెళ్ళాడు. ఎందుకో నేను అతను నన్ను పెళ్ళి చేసుకుంటాడని ఆశలు పెట్టుకున్నాను. అమెరికానించి తిరిగి రాగానే ఆ విషయం ప్రస్తావిస్తాడని అనుకున్నాను. అందుకే మా అమ్మా నాన్నా నా కోసం సంబంధాలు చూస్తూఉంటే నేను అంత ఆసక్తి చూపించలేదు. ఎన్ని మంచి సంబంధాలు వచ్చినా నాకు నచ్చలేదని తిరగ్గొట్టాను. ఆ నా మనసు తెలియక అమ్మా నాన్నా తికమక పడ్డారు. అయినా నన్ను బలవంతం పెట్టడానికి నచ్చచెప్పడానికి ఎక్కువ ప్రయత్నించలేదు.

శేఖర్ అమెరికా నుంచి తిరిగి వచ్చాడు. నా ఆశలన్నీ నిరాశలైనాయి. అతను తనకు అమెరికాలో పరిచయమైన ఒక పంజాబీ అమ్మాయిని పెళ్ళి చేసుకున్నాడు. ఆ అమ్మాయిని తీసుకునే మా ఊరు వచ్చాడు. ఆ అమ్మాయిని తీసుకునే మా ఇంటికి వచ్చాడు — మమ్మల్ని చూపటానికి. నే నది భరించలేకపోయాను. ముఖమెత్తి ఆ పిల్లను పలకరించలేకపోయాను. లోపలకు వెళ్ళిపోయాను. నా బాధను లోలోపలే అణచుకున్నాను. అమ్మా నాన్నా అతనితో కాస్సేపు కబుర్లు చెప్పారు. అతను నన్ను గురించే మాట్లాడుతున్నాడు. వసంత ఏదీ? ఏం చేస్తోంది? బి.ఏ. పూర్తయిందా? ఎమ్.ఏ. చదవలేదా? పెళ్ళి సంబంధాలు చూస్తున్నారా? ఇలా సాగుతూంది సంభాషణ. నేను అంతా లోపల్నించి వింటున్నాను. కాని బయట పడలేదు. కాస్సేపటికి వాళ్ళు వెళ్ళిపోయారు.

శేఖర్ పెళ్ళైన తరువాత నేను క్రమంగా నా మనసు మార్చుకున్నాను. అతని గురించి ఇంక ఆలోచించడం వ్యర్థం అని త్వరలోనే తెలుసుకున్నాను. నేనూ నా బ్రతుకుబాట సరిదిద్దుకుని సుఖపడాలని స్థిర పడాలని అనుకున్నాను. అమ్మా నాన్నా కుదిర్చిన సంబంధం చేసుకోడానికి ఇష్టపడ్డాను. నాలో మార్పుకు వాళ్ళు సంతోషించారు.

ఒక రోజు రవి వచ్చాడు నన్ను చూడటానికి — పెళ్ళి చూపులకు. హాలులో ఒక మూల కుర్చీలో అతన్ని కూర్చోపెట్టి, ఇంకో మూల కుర్చీలో నన్ను కూర్చోపెట్టారు. అతనికేసి చూడటానికి నాకు భయం సంకోచం. ఎల్లాగో ఒక్క క్షణం ఓర కంట చూశాను. అతను అందంగా ఉన్నాడు.

... కనిపిస్తున్నారు ... తెల్లని ... వెన్నెల ... కాంతిలో ...

... చందమామను చూస్తూ కిటికీ దగ్గర కూర్చున్నాను ... ప్రశాంతంగా ఉంది ... ఆలోచనలు ... వస్తున్నాయి ... ప్రేమించాను ... శేఖర్



గుడ్డలు ఉతకడానికి సబ్బు పౌడర్లు ఉపయోగించే వారు ఆ పౌడరు ద్రవంలో గుడ్డలను తడిపాక దానికి కాస్త ఉప్పు కూడా చేరిస్తే గుడ్డల మురికి మరింత బాగా పోతుంది.

కోడిగుడ్లు నిలవ చెయ్యడానికి ఫ్రిజిడైర్ లేదని బాధపడక్కరలేదు. కొత్త కోడి గుడ్లమీద ఆవనూనె కాని, వనస్పతిగాని పూసి ఉంచితే అవి నాలుగైదు రోజులదాకా తాజాగానే ఉంటాయి.



ఒడ్డూ, పొడుగూ, ముఖాన మంచి వర్చస్సు. తీవిగా ఉన్నాడు. నా మనస్సు తృప్తిపడింది. ఆ క్షణమే మళ్ళా సంకోచం తల ఎత్తింది. అతనికి నేను నచ్చుతానో లేదో అని, మనసు కాస్త నిరాశ చెందింది.

మూడు రోజులకు సంబంధం తెచ్చినాయన వార్త తెచ్చాడు. "[illegible]కు పిల్ల నచ్చింది. ఇంక కట్నం కానుకలు మాట్లాడుకుని పెళ్ళి ఏర్పాట్లు చెయ్యవచ్చు" అని. మా వాళ్ళు సంతోషించారు. డబ్బుకేమీ వెనకాడలేదు. అడిగిన కట్నానికి ఒప్పుకుని పెళ్ళి ప్రయత్నాలు ఘనంగానే జరిపారు. వాళ్ళకు నేను ఒకత్తెనే ఆడ పిల్లను గదా! ముద్దూ మురిపెం అన్నీ బాగా జరపాలనే తాపత్రయం. రవి నన్ను పెళ్ళి చేసుకోటానికి ఒప్పుకున్నందుకు నా మనసు తృప్తిపడింది. మోడు వారిన చెట్టు వసంతానికి ఎదురు చూసినట్లు నేను కొత్త జీవితానికి, కొత్త కోర్కెలతో ఎదురు చూడసాగాను.

ఆకాశమంత పందిరీ, భూదేవి అంత అరుగూ కాకపోయినా పెళ్ళి ఆడంబరంగానే జరిగింది. బంధువులు, స్నేహితులూ చాలా మందే వచ్చారు. పెళ్ళి రోజు సాయంత్రం రిసెప్షన్ జరిగింది. రవీని, నన్నూ ఒక సోఫాలో కూచో బెట్టారు. సాయంత్రం 5 నుంచి రాత్రి 8 వరకూ అలాగే దంతపు బొమ్మల్లా కూచున్నాం చలనం లేకుండా. రవికి కొత్త సూటులో ఉక్కపోస్తూన్నట్లుంది. పదే పదే కర్చీఫ్‌తో మెడ తుడుచుకుంటున్నాడు. నాకు పట్టుచీర, ఒంటినిండా నగలు, ఊపిరాడటం లేదు. ఎందరో వస్తున్నారు, పోతున్నారు. అందరిని చూచి రవీ, నేనూ యాంత్రికంగా నవ్వుతున్నాం, ఒక్కొక్కప్పుడు వాళ్ళు ఎవరో తెలియకుండానే. హఠాత్తుగా శేఖర్ నా ఎదుట ప్రత్యక్షమయ్యాడు – ఒక ప్రజెంట్ పాకెట్‌తో. ఆ పాకెట్ నా చేతిలో ఉంచి అభినందనలు చెప్పాడు. అతన్ని చూడగానే నాముఖం వెల వెల బోయింది. నేనేం మాట్లాడ లేక పోయాను. యాంత్రికంగా పాకెట్ అందుకొని తల వంచుకున్నాను. కాస్సేపు గుండె దడ దడ లాడింది. శేఖర్ అక్కడ ఎక్కువ సేపు ఆగలేదు. రవిని ఏదో పలకరించాడు. ఏమన్నాడో సరిగా తెలియదు. రవి మౌనంగా ఉన్నాడు. అంతే, శేఖర్ అక్కడినించి వెళ్ళిపోయాడు. అతను వెళ్ళిన కాస్సేపటికి నేను కాస్త కోలుకున్నాను. తల ఎత్తి రవికేసి చూశాను. అతను నాలో మార్పు గమనించినట్లున్నాడు. అతని ముఖంలో చిరునవ్వు మాయమైంది. ముఖం కందగడ్డలా జేవురించి ఉంది. నాకు కొంచెం భయమనిపించింది. మళ్ళీ సర్దుకున్నాను. కాస్సేపటికి రిసెప్షన్ పూర్తి అయింది.

ఆ రాత్రి నన్ను చక్కగా అలంకరించారు– గదిలోకి పంపటానికి. స్నానం చేయించి తెల్లని పట్టుచీర కట్టారు. తలనిండా మల్లెపూలు. ఒంటినిండా పన్నీరు, అత్తరు. అదంతా నాకేమిటో ఎబ్బెట్టుగా ఉంది. అయినా అద్దంలో చూసుకున్నప్పుడు నాలో ఏదో కొత్త అందం వచ్చినట్లు నాకే అనిపించింది. నా మనసు సంతోషంతో నిండి ఉంది. గదిలో అడుగు పెట్టగానే రవి నన్ను ఆప్యాయంగా పలకరిస్తాడని, ఆప్యాయంగా నా మీద చేయి వేస్తాడని కలలు కన్నాను. కాని అల్లా ఏమీ జరగలేదు. అతను కొంచెం కటువుగా నన్ను అడిగిన మొదటి ప్రశ్న. "ఇందాక వచ్చిందెవరూ?" అని. నాకేమీ అర్థం కాలేదు. తెల్లబోతూ "ఎవరూ?" అన్నాను. అతను మళ్ళా రెట్టించి అడిగాడు. "అదే, ఇందాక వచ్చాడే, నీకు ప్రెజెంటు ఇచ్చాడూ, అతనెవరూ?" అన్నాడు. అప్పటికి సందిగ్ధంగా ఉన్నా అతను శేఖర్‌ను గురించి అడుగుతున్నాడని ఎల్లాగో పోల్చుకున్నాను. సరళంగానే జవాబు చెప్పాను "అతని పేరు శేఖర్. మా ఎదురింట్లో ఉంటాడు, అమెరికాలో ఇంజనీర్ చదివాడు." రవి కాస్సేపు మౌనంగా ఉన్నాడు. మళ్ళా చాలా తాపీగా అడిగాడు. "అతన్ని నువ్వు ప్రేమించావా?" అని. ఆ మాట నా నెత్తిన పిడుగు పడినట్లయింది. ఒళ్ళంతా గజగజా వణికిపోయింది. ఈ ప్రశ్నకు ఏమని సమాధానం చెప్పను? "లేదు" అంటే అది నిజం కాదు. "అవును" అంటే అది కూడా నిజం కాదు. ఇప్పుడు నేను శేఖర్‌ను ప్రేమించటం లేదు. రవినే ప్రేమిస్తున్నాను. రవితో నా జీవితం మూడు పూవులు, ఆరుకాయలుగా సుఖప్రదం చేసుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. శేఖర్ జ్ఞాపకం ఎప్పుడో మరుగుపడిపోయింది. అతన్ని గురించి నేనిప్పుడు ఆలోచించటం లేదు. మనసులో తికమకపడుతూ ఆలోచనలతో సతమతమవుతూ నేను రవికి ఏమీ సమాధానం చెప్పలేదు. రవి మళ్ళా రెట్టించి అడగలేదు. నా మౌనం అతని అనుమానాన్ని దృఢపరచినట్లుంది. అతను వెళ్ళి మౌనంగా కళ్ళు మూసుకు పడుకున్నాడు. నేను దిగాలుపడి సోఫాలో కూర్చున్నాను. ఆ రాత్రి అమృత భాండంలో విషపు చుక్క పడింది.

రవీ, నేనూ మద్రాసులో కాపురం పెట్టాం. రవి ఎప్పుడూ నాకు చనువివ్వలేదు. ఎన్ని రోజులు గడచినా ముభావంగానే ఉంటున్నాడు. ఎడం ఎడంగానే ఉంటున్నాడు. అసలు అతను ఇంట్లో ఉండేదే తక్కువ. ఆఫీసు మేమున్న ఇంటికి చాలా దూరం. ఉదయం వెళితే రాత్రి ఏ ఎనిమిదికో వస్తాడు. అతను ముభావంగా ఉంటూ ఉంటే నాకూ అతనంటె భయం పోలేదు. రవి శేఖర్‌ను మరచిపోలేదు. రోజుకొకసారైనా అసూయతో శేఖర్‌ను గురించి నన్ను ఎత్తి పొడుస్తూనే ఉండేవాడు. అది నాకు ఎప్పుడూ సూది మొనలా

గుచ్చుకునేది. విపరీతమైన బాధ కలిగేది. ఏ శేఖర్‌ను నేను మరచిపోవాలని విశ్వప్రయత్నం చేస్తున్నానో ఆ శేఖర్‌ను తన అసూయతో రవి మాటి మాటికీ నాకు గుర్తుచేసేవాడు. చందమామలో మచ్చ ఉన్నట్లు రవిలో అనుమానమూ, అసూయ పాతుకుని ఉన్నాయి. వాటిని పోగొట్టటం నాకు సాధ్యం కాలేదు. క్రమంగా అతనిలో మార్పు వస్తుందని ఆశపడ్డాను. పరిచారికలా అతను మెచ్చుకున్నా మెచ్చుకోకపోయినా సేవలన్నీ చేస్తూ వచ్చాను. అతని ఎత్తిపొడుపు మాటలకు నొచ్చుకోకుండా అలవాటు పడ్డాను. అయినా అతని వైఖరిలో మార్పు రాలేదు. నేను రాత్రింబవళ్ళు లోలోపల శేఖర్‌నే స్మరిస్తున్నానని అతని అపోహ. రవి ప్రవర్తనకు దిగులు పడుతూ నేను ఉదాసీనంగా ఉంటే అతను "శేఖర్ కోసం దిగులు పడుతున్నావా?" అని ఎత్తిపొడిచేవాడు. ఈ కాపరం ఇలా ఎన్నాళ్ళు సాగుతుంది—అని నేను బాధపడేదాన్ని. శేఖర్ ఎక్కడున్నాడో తెలియదు. అతనికి మా గొడవ తెలియదు. అయినా, రవికీ నాకూ మధ్య శేఖర్ పానకంలో పుడకలా ఉన్నాడు.

నాకొక బాబు పుట్టాడు. నేను ప్రసవించి ఆస్పత్రిలో ఉండగా రవి నన్ను చూడటానికి వచ్చాడు. చాలా రోజులతరవాత. అతని ముఖంలో మార్పు ఉంది. ప్రశాంతంగా ఉంది. బాబుని చూచి అతను సంతోషపడ్డాడు. ఈ మార్పు చూచి నేను సంతోషపడ్డాను. అతను ఆప్యాయంగా నా చేయి పట్టుకుని "బాబుకు ఏంపేరు పెడదాం?" అన్నాడు. నేను అప్రయత్నంగా "చంద్రశేఖర్" అన్నాను. నాలో ఏ ఇతర ఆలోచనా లేదు. చంద్రశేఖర్ నా ఇష్టదైవం. ఆ పేరు నాకు ఇష్టం—అంతే. కాని రవి అపార్థం చేసుకున్నాడు. వెంటనే అతని ముఖంలో చిరునవ్వు మాయమైంది. ముళ్ళమీద ఉన్నట్లు కాసేపు ఉండి వెళ్ళిపోయాడు. నేను నా తెలివితక్కువకు దిగులుపడి క్రుంగిపోయాను.

బాబుకు మూడవనెల రాగానే నేను మళ్ళా మద్రాసు వెళ్ళాను. రవి బాబును ప్రేమగానే చూచాడు. నాతోకూడా ఇదివరకు కన్నా కొంత మెరుగు. అయితే మా ఇద్దరి మధ్యా ఉన్న శేఖర్ నీడ మమ్మల్ని వదలలేదు. అప్పుడప్పుడూ అది తల ఎత్తుతూనే ఉంది. ఎప్పుడో ఒకసారి అనుకోకుండా అసూయతో ఏవో ఎత్తిపొడుపు మాటలు అంటాడు. నా మనసు చివుక్కు మంటుంది. అంతే. ఆ రోజు పచ్చని ఆకులో ముల్లు గుచ్చి పట్టుంటుంది.

బాబుకు రెండేళ్ళు వచ్చాయి. నా పెళ్ళై నాలుగేళ్ళయింది. ఇప్పుడిప్పుడు రవి నన్ను ఎత్తిపొడవడం నాకు విసుగు కలిగిస్తోంది. కొన్నాళ్ళు నేను తొలగిపోతేనేగానీ రవిలో మార్పు రాదేమోననిపించింది. ఒక తీర్మానానికి వచ్చి ఒక రోజు రవితో చెప్పాను. "మీరు శేఖర్‌ను గురించి నన్ను ఎత్తిపొడవడం మానేస్తే తప్ప నే నింక ఇక్కడ ఉండలేను. కొన్నాళ్ళు బాబుతో మా ఊరు పోతాను. మళ్ళా మీలో మార్పు వచ్చి మీరు రమ్మని రాస్తేనే వస్తాను. ఒట్టి అనుమానాలతో నన్నెందుకు హింసిస్తారు?" ఈ మాటలు కొంత ఆవేశంతో చెప్పాను. రవి ముఖం చిట్లించుకున్నాడు. ఏం మాట్లాడలేదు. మర్నాడు ప్రయాణమై నేను మా ఊరు వచ్చాను. ఇక్కడకు రాగానే కాలక్షేపానికి ఒక నర్సరీ స్కూల్లో టీచరుగా చేరాను. అమ్మా నాన్నా ఏమీ అనలేదు. 'ఒంట్లో బాగుండ లేదు; కొన్నాళ్ళు ఇక్కడ ఉంటాను' అని చెప్పాను. రోజు రోజు రవి ఉత్తరం వస్తుందేమోనని ఎదురు చూస్తున్నాను. అది ఎప్పుడు వస్తుందో ఏమో!

*

చందమామ చల్లగా ప్రకాశిస్తున్నాడు. బాబు హాయిగా నిద్రపోతున్నాడు. లేచి దీపం వేశాను. పిల్లల పత్రికలోని కథలు చదువుతున్నాను. మనసు ఆలోచనలు లేకుండా తేలికగా ఉంది. ప్రొద్దున్నే ఈ కథలు చెపితే పిల్లలు ఆనందంగా వింటారు. అది తలుచుకున్నాను. నాకూ ఆనందం కలిగింది. □

పుస్తకాలు

రాజారామ మోహన్‌రాయ్ (జీవిత కథ)

[రచయిత్రి: మోటూరి ఉదయం; ప్రచురణ: జయంతి పబ్లికేషన్స్, ఏలూరురోడ్డు, విజయవాడ-2; ⅛ డెమీ సైజులో 80 పేజీలు; వెల: రూ. 2లు.]

స్త్రీ జాతికి పలు విధాలుగా మేలు చేసిన మహనీయుడుగా రాజారామ మోహన్‌రాయ్‌కి వున్న పేరు—చాలా ఘనమైనది. ఆ రోజుల్లో 'ఘోరమైన సంప్రదాయం'—'సహగమనం'. భర్త మరణిస్తే, భార్య కూడా అతనితోపాటే, ఆ చితి మీద పడి కాలి భస్మమైపోవలసిందే. భర్త పోయిన స్త్రీ ఎందుకూ కొరగానిదని, ఒక వేళ జీవించి వున్నా అవినీతికరమైన చేష్టలు చేస్తుందనీ—భర్త చితి మీద పడి భస్మమయిపోవడమే—పతివ్రతా లక్షణమనీ అప్పట్లోని హిందూ సంఘం భావించేది. అటువంటి దురాచారాన్ని తొలగించిన మహానుభావుడు రాజారామ మోహన్‌రాయ్. అంతే కాకుండా, "స్త్రీకి కూడా పురుషునితో సమాన హక్కులు వుండాలి; వున్నాయి" అని కూడా ఆయన వాదించాడు. బాల్య వివాహాలు పనికి రావన్నాడు; స్త్రీ కూడా పునర్వివాహాలు చేసుకోవచ్చునన్నాడు; స్త్రీకి ఆర్థిక సమానత్వం వుండన్నాడు; స్త్రీలు కూడా విద్యార్జన చెయ్యాలని ఘోషించి, అందుకు తీవ్రంగా కృషి చేశాడు. స్త్రీల ఉన్న[illegible]ంతగానో పాటుపడిన రాజారామ మోహన్‌రాయ్ జీవితకథే ఈ పుస్తకం. ఇలాంటి ప్రయత్నం చేసిన రచయిత్రీ, ప్రచురణ కర్తలూ అభినందనీయులు. అయితే, పుస్తకంలోని భాష రెండు రకాలుగా వుండడం, కొన్ని కొన్ని చోట్ల వివరణ సరిగా లేకపోవడం-చింతించవలసిన విషయాలుగా తోస్తాయి. రాజారామ మోహన్‌రాయ్ మరణ విషయాలు సరిగా లేవు. 'అక్టోబరు 18వ తేదీన అతని భౌతిక దేహము భూస్థాపితము చేయబడెను' అని వుంది గాని, సంవత్సరం లేదు. అయితే—ఆ సమాధి మీద చెక్కబడిన ఇంగ్లీషు వాక్యాలలో—"1883వ సంవత్సరము సెప్టెంబరు 27వ తేదీన బ్రిస్టల్ నగరమున మరణించెను" అని వున్నట్టు రచయిత్రి రాశారు. 1842వ సం॥లో "ద్వారకానాధ్ టాగూర్ ఆంగ్ల దేశమునకువచ్చి-తన ప్రియ మిత్రుని రామమోహనుని కళేబరము వుంచబడిన పేటికను బయటకు తీసి...." అని ఇంకో చోట వుంది. 83 ఏమిటి — 42 ఏమిటి? ఇవి అచ్చు తప్పులో లేక, మరేమిటో—తెలియడం లేదు. ఇలాంటి 'గంద్రగోళాలు' మలి ముద్రణలో రాకుండా సవరించుకోడం చాలా అవశ్యకం!

కేమెల్ వనిత క్రైలిన్® పోటీ



మీకు యివ్వబడిన డిజైన్ ట్రేస్ తీసి, చుట్టూ చక్కగా కుట్టబడి, నలుచదరంగా (35 సెం.మీ. x 35 సెం.మీ) వున్న గుడ్డపై కేమెల్ క్రైలిన్ రంగులతో ఆ డిజైన్‌కు రంగులు వేయండి. మీరు వేసే రంగులు వీలయినంత లేతగా వుండాలి. అందుకు కేమెల్ క్రైలిన్ మీడియమ్‌తో రంగులను పలుచన చేసుకోవచ్చు. పోటీ చేస్తే ప్రతి ఒక్కరూ 3 ఎంట్రీలకన్న ఎక్కువ పంపరాదు.

బహుమతులు: రూ. 100/-, రూ. 75/-, రూ. 50/- ఇవే గాకుండా 10 మెరిట్ సర్టిఫికెట్లు

మీరు రంగులు వేసిన ఎంట్రీలను ఈ క్రింది ఎడ్రసుకు పంపండి:

పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్,

కేమ్లిన్ ప్రైవేట్ లిమిటెడ్. ఆర్ట్ మెటీరియల్ డివిజన్, జె.బి. నగర్, బొంబాయి 400 059

పేరు, ఎడ్రసు వ్రాసిన కవర్‌ను పోస్టేజితో సహా ఎంట్రీతోపాటు పంపితే పోటీ చేసే ప్రతి ఒక్కరికీ ఒక ట్రాన్స్‌ఫర్ పంపబడుతుంది.

మీ ఎంట్రీతో జతపరిచే 'ట్యాగ్'పై మీ పేరు, చిరునామా ఇంగ్లీషులో వ్రాయండి. మీ ఎంట్రీ తిరిగి పంపబడదు.

ఎంట్రీలు పంపవలసిన ఆఖరు తేదీ: 15-1-1977

Join Camel School of Art Correspondence Course.
Contact the above mentioned address for details.

Results of Camel Vanitha Crylin Painting Contest No. 4 held in October-November 1976

1st Prize: Rs.100/- Smt. Vasantha Lakshmi, Nagercoil 2. *2nd Prize*: Rs. 75/- G. Aruna, Gudur P.O. *3rd Prize*: Rs. 50/- Kum. P. Santhi, Kakinada 4.
Certificate of Merit: Smt. R. Hanumayamma, Camcherukee 522 212. G. R. Kanthamma, Chandragiri. M. S. Pramila, Bangalore 560 041. Smt. V. Indiramma, Mirinjepalli Village. B. Sita, Vishakapatnam 1



బిష్మగారి పేజీ

మా నాలుగో మనవడిని వాళ్ళమ్మ మొన్న సాయంకాలం పక్కయింటికి వెళ్ళరమ్మంటోంది—ఏదో పని మీద. వాడు వెళ్ళనని ఒకటే మారాం చేస్తున్నాడు. "ఏంరా! పగలంతా వాళ్ళ పిల్లల్తో కలిసి ఆడతావు! ఇప్పుడు వెళ్ళరారా అంటే ఏం?" అని వాళ్ళమ్మ శేకలేస్తోంది. చివరికి వాడు "వెళ్ళను. నాకు భయం!" అని తేల్చాడు. వాడికి ఆరేళ్ళు. బడిలో చదువుకుంటున్నాడు. పక్కనేవున్న యింటికి 'వెళ్ళరారా' అంటే, భయం అంటున్నాడు. వాళ్ళమ్మ "భయం ఏమిట్రా – భయంలేదు గియంలేదు, వెళ్ళు" అంటోంది. వాడు వినిపించుకోడం లేదు. "భయం" అనే అంటున్నాడు. సరే, చివరికి ఆవిడే వెళ్ళి, ఆ పనేదో చేసుకొచ్చిందనుకోండి.

అసలు—ఈ "భయం మాత్ర" వాడిలో వేసిందెవరూ? వాళ్ళమ్మ కాదూ! లేకపోతే వాడికేం తెలుస్తుంది—'భయం' అని! ఏదైనా మనం నేర్పితేనే, తెలుస్తుంది; లేకపోతే ఎలా తెలుస్తుంది!

చరిత్రలో దీనికో కథ కూడా వుంది. శివాజీ చక్రవర్తి పేరు అందరికీ బాగా తెలుసుననుకుంటాను. అతను గొప్ప వీరుడు. అంత గొప్ప వీరుడు కావడానికి కారకులెవరూ?....అతని తలిదండ్రులే గదూ మరి! ఆ శివాజీ ఐదేళ్ళప్పుడు ఏం చేశాడంటేటా-ఓ సాయంకాలం ఆటకు వెళ్ళిన వాడు తిరిగి ఇంటికి రాలేదు. తలిదండ్రులు కంగారుపడ్డారు. నౌకర్లనీ చాకర్లనీ అటూ ఇటూ పంపించి, వెతికించారు. చీకటయిపోతోంది—జాడ లేదు. ఎటు వెళ్ళాడో, ఎలా వెళ్ళాడో చూసిన వాళ్ళు లేరు! అలా వాళ్ళు కంగారు పడిపోతూ వుండగా, వూరవతల వున్న ఓ చిన్న కొండ మీద ఏదో ఆకారం కదుల్తోందనీ, బహుశా అది శివాజీదే అయివుంటుందనీ ఎవరో వచ్చి చెప్పారు. తలిదండ్రులు, నౌకర్లూ అంతాకలిసి, గబగబా కొండ ఎక్కి చూస్తే—ఏముంది — శివాజీయే!! ఒంటరిగా కూచుని ఏదో ఆలోచిస్తున్నాడు. శివాజీ తల్లి జిజియాబాయి గభాలున అతన్ని దగ్గరకు తీసుకుని, ఆత్రుతగా ఒళ్ళంతా నిమిరి—"నాయనా! ఒక్కడివే ఇక్కడికి ఎందుకొచ్చావ్? ఇంత రాత్రివేళ కూచోడానికి నీకు భయం వెయ్యలేదూ?" అని అడిగింది. ఆ అబ్బాయి ఓ క్షణం అలా చూసి—"భయమా! అంటే ఏమిటి? ఎలా వుంటుంది! ఎక్కడవుంటుంది?" అని అడిగాట్ట. అంతలో తల్లి కంగారుపడింది. నిజమే! తాను చెప్పలేదు. కాని, ఏదో ఆ కంగార్లో "భయం లేదా" అని మామూలు ధోరణిలో అడిగేసింది! అంతలోనే సర్దుకుని — "ఏంలేదు బాబూ! పద ఇంటికిపోదాం" అని మాటమార్చి తీసుకెళ్ళిపోయింది!

అంటే ఏమిటి — తల్లి చెప్పకపోతే పిల్లలకు భయం అన్నమాట తెలియడానికి అవకాశం లేదన్న మాట. సాధారణంగా తల్లులు చిన్న పిల్లలు రాత్రి వేళ గుమ్మం దాటబోతే, "వెళ్ళకురా, భయంవేస్తుంది" అని భయపెట్టేస్తారు. అలా 'భయం' అంటే ఏమిటో వాడికి నేర్పుతున్నారు. అయితే, వాళ్ళని రాత్రి వేళల్లో కూడా వీధుల్లోనూ, పెరళ్ళలోనూ తిరగనిమ్మని నా ఉద్దేశం కాదు. కాని, ప్రతిదానికీ 'భయంవేస్తుంది' అని భయపెడితే, వాడు పిరికి వాడిలా తయారుకాడూ!

పిల్లలకి భయం వుండాలి; భక్తి వుండాలి. కాని, ప్రతిదానికీ 'భయం భయం' అంటూ కూచోకూడదు. అలా వాళ్ళు ప్రతిదానికీ భయపడుతున్నారంటే—అందుకు కారణం—కచ్చితంగా తల్లే అంటే ఆశ్చర్యం ఏముంది! పిల్లలకి మనం స్వేచ్ఛ ఇవ్వాలి; వాళ్ళకి వ్యక్తిత్వం తెలియాలి! మరీ దేనికీ పట్టించుకోకుండా, ఇష్టంవచ్చినట్టు తిరగనిస్తే — 'మొండివాడు' అవుతాడు. అంచేత మరీ విచ్చలవిడిగా తిరగనివ్వకూడదు. అందుకే 'పిల్లల్ని పెంచటం కత్తి మీద సాము' లాంటిదన్నారు. అంత జాగ్రత్తగా — అతి కాకుండా, తక్కువకాకుండా ప్రతివిషయంలోనూ జాగ్రత్త వహించాలన్నమాట!

కొందరు పిల్లలు ఏదైనా అల్లరి చేస్తూవుంటే— "అమ్మో, పోలీసు....పోలీసొస్తాడు" అని భయపెడతారు. పోలీసు అంటే వాళ్ళ మనసులో ఏదో భూతం అని నాటుకుపోతుంది. ఆమధ్య ఆదే జరిగింది — మా అవతల వీధిలో వున్న వాళ్ళ అబ్బాయి తప్పిపోయాడు. పేరు, వూరు చెప్పలేని వాడు. అన్నిటికీ ఏడుస్తున్నాడు. ఎవరో పాపం, తీసుకెళ్ళి పోలీస్‌స్టేషన్లో వప్పచెప్పారు. ఇంకేముంది—పోలీసుల్ని చూడగానే వాడి ప్రాణాలు పైనే పోయాయి! గుక్కపట్టి ఏడవడం ప్రారంభించాడు. దాంతో విపరీతమైన జ్వరం కాసింది; ఒళ్ళెరగని స్థితిలోకి జారిపోయాడు! తలిదండ్రులకు తెలిసి, వాళ్ళు పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళేసరికి, పాపం ఆ అబ్బాయి ఒళ్ళెరగని స్థితిలో వున్నాడు. కంగారుపడి, వెంటనే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్ళి వైద్యం చేయిస్తే, నాలుగైదు రోజులకుగాని, వాడు మళ్ళీ మామూలు మనిషి కాలేకపోయాడు! ఇక ఆ తర్వాత వాడు ఎప్పుడు పోలీసును చూసినా ఆ భయం అలాగే వుంటుందిగదా!

ఇంకోటుంది — పిల్లలకి దెయ్యాల కథలు, పిశాచాల కథలు చెప్పకూడదు. ముఖ్యంగా రాత్రులు పడుకునేముందే, ఇలాంటి కథలు చెబుతూ వుంటారు. వాళ్ళకి దెయ్యం అంటే ఏం తెలుసు?—అందుకని అది చెట్లమీద వుంటుందని, కాళ్ళు వెనక్కి వుంటాయనీ-వెళ్తే పట్టుకుంటుందనీ ఏవేవో నూరిపోస్తారు. దాంతో, రాత్రివేళ ఏ చెట్టు చూసినా, వాళ్ళకి దానిమీద దెయ్యం వున్నట్టే వుంటుంది.

వాన పడుతున్నప్పుడు, ఉరుముతుందనుకోండి—ఉరమగానే తల్లి భయపడిపోయి, బిడ్డని దగ్గరగా లాక్కొని 'అర్జునా ఫల్గుణా' అంటూ ప్రారంభిస్తుంది. పిడుగు పడితే, నిజానికి భయమే. కాని, మనమూ భయపడిపోయి, పిల్లల్ని మరింత భయపెట్టేస్తే ఎలా! ఎప్పుడైనా ఒంటరిగా వుండవలసి వస్తే—ఏమవుతాడు!....

"బూచి....బూచి వస్తాడు" అంటూ కొందరు భయపెడతారు. దాంతో, వీధిలోకి ముష్టివాడొస్తే వాడిని చూసి పిల్లలు హడలిపోయి, గదిలో దూరిపోతారు. 'వాడు వెళ్ళిపోయాడ్రా' అన్నా కూడా బయటికి రారు! వాడు ఒకవేళ భయపడితే, "ఏంలేదు బాబూ" అని బిచ్చగాడి సంచి తీసి చూపించామనుకోండి—"ఓస్ ఇంతేనా" అని నవ్వేసి, ధైర్యం తెచ్చుకుంటాడు. కాని, అలా ఎవరూ చెయ్యరు. వాడిని మరింత భయపెడతారు.

దేనికైనా చిన్నతనంలోనే విత్తనం పడాలి. మంచి విత్తనం అయితే, పెద్దయ్యాక మంచివాడు అవుతాడు; పిరికి విత్తనం అయితే, పిరికివాడు అవుతాడు. అంచేతా—పిల్లల్ని వూరికే భయపెట్టేయకూడదర్రా! ఆ భయం వాళ్ళకి ఎన్ని నష్టాలు కలిగిస్తుందో ఆలోచించండి మరి!

అందమైన శరీరానికి

ఐసోమెట్రిక్స్

శ్యామలా చంద్రన్

ఆనవాయితీ ప్రకారం ఈ మాటు కూడా శోభ ఒక నోము పట్టింది. అయితే ఈసారి ఆమె నోములో చిన్న మార్పుంది. ఎప్పటిలా కాక-తన బరువు తగ్గేదాకా – అందుకు ఎన్నిరోజులైనా సరే ఉపవాసం ఉండాలన్నదే ఆమె నోము.

ఉపవాసం చేస్తున్నందువల్ల అలసటగా ఉన్నా, శోభ తోటపని చెయ్యడం వంటి చిల్లరమల్లర పనులన్నీ చేస్తూ ఉండేది.

ఇలా మొత్తం మీద పదిరోజులు గడిచాయి.

పదకొండో రోజు ఉదయం శోభకు ఒక ఆలోచన వచ్చింది. పది రోజుల నుంచీ పెద్దగా ఆహారం తీసుకోక ఉపవాసవ్రతం పాటించిన తన బరువెంత తగ్గిందో చూడాలనిపించింది ఆమెకు.

ఎంతో ఉత్సాహంగా తన బరువు చూసుకోవడానికి వెళ్ళిన శోభకు పెద్ద షాక్ తగిలినట్టయింది. ఆమె బరువు కేవల[illegible]క పౌను మాత్రమే తగ్గింది! అనుమానం కొద్దీ ఆమె మరో చోటికి వెళ్ళి బరువు చూసుకుంది. ఆ యంత్రం అబద్ధం చెప్పడం లేదనీ, తన బరువు ఆ పదిరోజుల ఉపవాసమూ అయ్యాక కేవలం ఒక పౌను మాత్రమే తగ్గిందనీ స్పష్టంగా తెలిసిపోయింది ఆమెకు.

1

శోభకు తాను మోసపోయానన్న బాధ కలిగింది. పదిరోజులు ఉపవాసం చెయ్యగా తన బరువు పౌనన్నా తగ్గలేదంటే తను ఉపవాసం చేసి ఏం లాభం అనుకుంది ఆమె. అంతే-ఆరోజే ఉపవాసానికి స్వస్తి చెప్పింది. 'తిరిగి యథాప్రకార సిద్ధిరస్తు' అనుకుని ఆమె ముప్పూటలా ముచ్చటగా ఘనంగా భోజనం చెయ్యసాగింది.

శోభ కథవల్ల తెలిసే నీతి – ఓర్పు చాలా అవసరం అన్నదే!

తొందరపడకుండా శోభ మరికొద్ది రోజులు

2

కొద్దిగా మాత్రమే ఆహారం తీసుకుంటూ ఉపవాసవ్రతం పాటించి ఉంటే ఆమె బరువు కనీసం నాలుగైదు పౌన్లు తగ్గి ఉండేది.

మళ్ళీ మొదటికి వస్తే – శరీరతత్వం గురించి మనలో ఎంతమందికి సరిగా తెలుసు?

ఒంటి బరువును తగ్గించాలి అనుకుంటే అంతకు ముందొక సత్యం గ్రహించాలి. అది— మనం కోరే ఫలితం లభించేదాకా ఓర్పుగా ఉండాలన్నదే.

శరీరంలో నీరు – ఒక్కొక్క నియమిత భాగంలో అలా పేరుకు పోతుంది.

ఎవరన్నా 'డయటింగ్' చేస్తున్నారనుకోండి. అప్పుడు వారి శరీరానికి ఎక్కువ ఆహారం లభించదు. అలా శరీరమంతటా పొరలుపొరలుగా నేకరించబడిన కొవ్వు వదిలిపోతుంది. ఆహారం శక్తిగా మార్పు చెందేటప్పుడు ఆ కొవ్వులోని నీరు–వెలుపలికి పంపబడుతుంది.

నీరు కొద్దికొద్దిగా-ఒక నిర్ణీతమైన మేరకు తిరిగి చేరేదాకా శరీరం కాచుకుంటుంది. ఆ తర్వాత ఒక నిర్ణీతమైన ఒత్తిడిలో ఆ నీటిని వెలుపలికి పంపుతుంది. ఇందువల్లే శరీరం బరువు ఒక్కసారిగా తగ్గిపోతుంది.

శరీరం బరువు తగ్గాలన్నా పెరగాలన్నా కూడా కొంత కాలం ఓర్పుగా వేచి ఉండడం మంచిది.

శరీరంలో నీరు ఎక్కువగా నిలవ ఉండడానికి కారణమేమిటి?

శరీరంలో జమఅయ్యే కొవ్వు కొలెస్టెరాల్‌గా మారి జీవకణాల్లో చేరి నిలవ ఉండడానికి ప్రకృతిసిద్ధమైన సాధనం–నీరు. మీరు బక్కపలచగా ఉన్నారనుకోండి. మీకు జ్వరం తగలడమో, విరేచనాలు కావడమో – అవుతుందనుకోండి. అప్పుడు ఒళ్ళు బాగా చిక్కిపోతుంది. మళ్ళీ మామూలు మనిషి కావడానికి కొద్ది రోజులు పడుతుంది. ఇలా ఎందుకు జరుగుతుంది? శరీరం జబ్బుపడ్డప్పుడు – ముఖ్యంగా విరేచనాలు అవుతున్నప్పుడు శరీరం నుంచి ఎంతో నీరు విసర్జింపబడుతుంది.

శరీరంలో ఎటువంటి మార్పులు వచ్చినా అందుకు తగ్గ శక్తి నివ్వడగ్గ ప్రకృతిసిద్ధమైన

3

సాధనం—నీరు. అలాగే శరీరం బరువును నిర్ణయించే అంశం కూడా నీరే. [బాగా లావుగా ఉన్న వారిని గురించి చెప్పేటప్పుడు — 'ఏం లావులే! ఒంటికి బాగా నీరు పట్టేసింది. ఆ నీటిమీద మనిషి లావు మీరినట్టు కనిపిస్తున్నాడు' అనడం మామూలే కదా!] శరీరం బరువు తగ్గడానికి కూడా నీరు ఎంతో సాయపడుతుంది.

లావు తగ్గడానికి ఓర్పుగా ఉండక తప్పదు. అలా ఓర్పుగా మంచి ఫలితం కోసం ఎదురుచూడగల వారు చెయ్యదగ్గ ఎక్సర్‌సైజులు ఇక్కడ వివరిస్తున్నాను. ఇందులో మొదటి ఎక్సర్‌సైజు వెన్నెముకకు బలం కలిగించి, గూను లేకుండా చెయ్యగలదు. రెండవ, మూడవ ఎక్సర్‌సైజులు మెడ భాగం చేత బాగా వ్యాయామం చేయిస్తాయి; అలా అవి అక్కడ పట్టిన అదనపు కండలు కరిగేలా చేస్తాయి.

ఇక ఎక్సర్‌సైజులు చేసి చూద్దామా?

1. ఒక గోడనుంచి రెండడుగుల దూరాన నిలబడాలి. అలా నిలబడుతున్నప్పుడు వీపు గోడ వైపుకు ఉండాలి. చేతులను మీదికెత్తి వెనక్కు వంచి గోడను తాకాలి. అలా చేస్తున్నప్పుడు ఊపిరి పీల్చి, కడుపును బాగా లోపలికి లాగి పట్టుకుని చేతులతో గోడను బలంగా నొక్కాలి. అలా ఒక ఆరు సెకండ్ల పాటు గోడను తోసేసేలా చేతులను నొక్కిపట్టుకుని—ఆ తర్వాత చేతులను కిందికి దించి కాసేపు విశ్రాంతి తీసుకుని ఈ ఎక్సర్‌సైజును మళ్ళీ చెయ్యాలి.

2. ఒక కుర్చీలో నిటారుగా కూచోవాలి. అర చేతులను తల వెనుక భాగాన ఒకదానిపై ఒకటి ఆనేలా ఉంచుకోవాలి. చేతులతో తలను నెట్టడానికి ప్రయత్నించాలి. అలా చేస్తున్నప్పుడు నెట్టడానికి వీలుకాని తీరులో తలను బిగించాలి.

3. కుర్చీ ఒకదాంట్లో నిటారుగా కూచోవాలి. అరిచేతులను నుదుటిమీద ఉంచి అలా తలను వెనక్కు నెట్టే ప్రయత్నం చెయ్యాలి. అలా చేస్తున్నప్పుడు తల వెనక్కు వెళ్ళకుండా బిగించి ఉంచుకోవాలి.

ఈ ఎక్సర్‌సైజులు ఒకసారి చేశాక కాసేపు విశ్రాంతి తీసుకుని మళ్ళీ చెయ్యవచ్చు.

ఇక్కడ ప్రచురించిన చిత్రాలను చూస్తే ఈ ఎక్సర్‌సైజులు చేసే విధానాలు స్పష్టంగా తెలుస్తాయి

క్రిస్మస్ ముగ్గు



'క్రిస్మస్ సందర్భంగా ఏదైనా ముగ్గు వేస్తే ఎలా ఉంటుంది?' అనుకొనేవారికి — ఇదిగో ఒక ముగ్గు!

ఈ 'క్రిస్మస్ ముగ్గు' వెయ్యడానికి మొదట వరుసకు 16 చుక్కలు ఉండేలా రెండు వరుసలు ఒకదానికింద ఇంకొకటిగా పెట్టుకోవాలి. (చుక్కలు ఒకదానికొకటి సమాన దూరంలో ఉండాలి.)

ఆ తర్వాత ఆ రెండు వరుసలకూ, రెండు వైపులా రెండేసి చుక్కల చొప్పున తగ్గిస్తూ - రెండు వైపులా రెండేసి చుక్కలు వచ్చేదాకా చుక్కలు పెట్టాలి. ఇక్కడి చిత్రాలు చూస్తే ఈ ముగ్గుమ ఎలా ప్రారంభించి, ఎలా ముగించాలో తెలుస్తుంది.

రకరకాల రం[illegible] ఈ ముగ్గుమ అలంకరిస్తే ఈ ముగ్గు చూడ్డానికి మరింత బావుంటుంది!





కర్ణాభరణాలు



మన దేశంలో అధిక సంఖ్యాకులైన వనితలు-వారు ఏ ప్రాంతానికి చెందినవారైనా, బంగారు ఆభరణాలంటే ఎంతో ఆసక్తి చూపుతారు. అందుకు తగినట్లుగా బంగారు నగలను రూపొందించడంలో నిపుణులైన మనవారు ఎన్నెన్నో అందమైన డిజైన్లను రూపొందిస్తూ-వనితలకు ఆభరణాల మీదున్న మోజును మరింత అధికం చేస్తుంటారు.

ఆభరణాలంటే చెవి కోసుకునేవారి చెవులకు ఈ వర్ణచిత్రాలలో కనిపిస్తున్న మాడల్స్,



మాలా, మోనిషా ధరించిన కొత్తరకం బంగారు చెవి రింగులు మరింత ఆకర్షణీయంగా ఉంటాయనడంలో ఏమాత్రం సందేహం లేదు. వస్త్రాలంకరణ సాధారణంగా 'సింపుల్'గా ఉన్నా, ఇవి చక్కని శోభను చేకూరుస్తాయి. ఐతే–ఇటువంటి పెద్ద చెవి రింగులను ధరించినప్పుడు మాత్రం మెడలో ఎక్కువ నగలను వేసుకోకూడదు. అలా చేస్తే, అవి – ఈ చెవి రింగుల సోయగాన్నించి దృష్టిని మళ్ళిస్తాయి. అందువల్ల ఇటువంటి చెవి రింగులు వేసుకున్నప్పుడు ఒకే ఒక్క 'నెక్లెస్' ధరిస్తే–చాలు!

ఛాయా ఆర్య



చెవి రింగులు : 'దానాభాయ్ మిసీవాలా' (బొంబాయి) సౌజన్యంతో   మాడల్స్ : మాలా, మోనిషా

పసి బిడ్డకు జీర్ణసంబంధమైన
బాధలు కలిగినప్పుడు...



సౌమ్యంగా పనిచేసే
అమృతాంజన్
గ్రైప్ మిక్స్చర్
బాధను అతి త్వరగా తగ్గిస్తుంది

కడుపునొప్పి, అజీర్ణము, వాయువు, పళ్ళు వచ్చేటప్పుడు కలిగేబాధలు మొదలైన వాటిలో దేనితోనైనా సరే, మీ పసిబిడ్డ బాధ పడుతూంటే అమృతాంజన్ గ్రైప్ మిక్స్చర్‌తో అతి త్వరగా ఉపశమనం కల్గించండి త్వరగా సులభంగా తిరిగి మీ పసిబిడ్డ ఆనందంగా నవ్వుతుంది.

గృహౌషధములు
తయారుచేయుటలో
తరతరాలుగా నమ్మకకు
పాత్రమైన అమృతాంజన్‌వారి
తయారీ.

అమృతాంజన్ లిమిటెడ్

OBM 3410/3 TG

"కలౌ వర్ణ సంకరః" అని ప్రాచీనోక్తి. భవిష్యత్తుని తెలుసుకున్న మహర్షుల ఈ జోస్యం నిజమవుతుండడం మనం నిత్యమూ చూస్తున్నటువంటిదే. మన కళ్ళముందు వివాహాల ద్వారా ఎన్నెన్నో వర్ణాలు, మతాలు కలిసిపోతుండడం ఈ కాలంలో తరుచుగా జరుగుతున్నట్టిదే. యుగాలతో పాటు కాలమూ మారుతూంది. కాలంతోపాటు మనుష్యుల భావాలూ మారుతున్నాయి. అసలు మార్పు అనేది కాలం లాగానే నిత్యమూ సాగిపోతూనే ఉంటుంది. అది చైతన్యానికి చిహ్నం. మనిషియొక్క అవసరాలు మారుతుంటుంటే, అతని దృక్పథంలోని విలువలు కూడా మారుతుంటాయి.

పారిశ్రామిక విప్లవం వచ్చిన తర్వాత ప్రపంచం యొక్క స్వరూపమే మారిపోయింది. ఏర్పరచుకున్న హద్దులలో ఖైదీలుగా బ్రతుకుతుండే మనుష్యులంతా ఒక సరసకు రావలసిన అవసరం ఏర్పడింది. పరస్పర సహకారంతో అవగాహనతో జీవించవలసిన పరిస్థితి ప్రతి దేశానికీ ఏర్పడింది. భౌగోళికంగా దేశాల మధ్యనున్న అంతరం అంతరించిపోయింది. ఇటువంటి పరిస్థితుల్లో కులం, మతం జాతి అనే పదాలకు అర్థం లేకుండా పోయింది. పరస్పరం అర్థం చేసుకున్న స్త్రీ పురుషులు, పెద్దల ప్రమేయం ఉన్నా లేకున్నా వివాహం చేసుకొని సుఖమయ జీవితం గడపాలనుకోవడం పరిపాటి అయింది. అట్టిది వివిధ కులాల మధ్య జరిగితే, వర్ణాంతర వివాహం అంటున్నాం, వివిధ మతాల మధ్య జరిగితే, మతాంతర వివాహం అంటున్నాం.

పూర్వ కాలంలో పరిస్థితి పూర్తిగా వేరు. ఏమంటే ఆ రోజుల్లో ప్రయాణ సదుపాయాలు అంతగా ఉండేవి కావు. అందువల్ల ప్రజలు స్థిర నివాసులుగానే ఉండేవారు. ఆ తర్వాత, కుల వృత్తులు ఉండేవి. వాటిని

వర్ణాంతర వివాహాలు

కంచి రమాదేవి

ప్రజలు వంశ పారంపర్యంగా అవలంబించేవారు. కమ్మరి కుమారుడు కమ్మరి పనిచేసేవాడు. కుమ్మరి కొడుకు కుండలే చేసేవాడు. పండితుని కుమారుడు శాస్త్రాధ్యయనమే చేసేవాడు. సాటి వారితోనే వియ్యమొందడం అవసరమే కాకుండా, ఉభయులకూ లాభసాటిగా ఉండేది, కనుక ప్రజలు సహజంగా సాటి వృత్తుల నవలంబించే వారితోనే వివాహాలు జరిపించుకునేవారు. వృత్తులనేవి కులాల ననుసరించి ఉండేవి కనుక, సహజంగా సవర్ణ వివాహాలే జరుగుతుండేవి. ఆ నాటి విలువలను అనుసరించి చూసినప్పుడు, అది పూర్తిగా సబబనే ఒప్పుకోక తప్పదు.

వర్ణాంతర వివాహలు, మతాంతర వివాహాలు—మారిన ఈ కాలంలో తప్పనిసరిగా జరుగుతాయి. అందులో తప్పేమీ లేదు. ఇది కేవలం పాత కొత్తల మధ్య సంధి కాలం. కనుకనే ఇంకా 'కులాంతర' 'మతాంతర' అనే పదాలు వాడుతున్నాం. మరి కొన్ని దశాబ్దాలు గడిస్తే అసలు ఈ మాటలకు అర్థమే ఉండదు. మారుతున్న పరిస్థితులలో ఇది చాలా అవసరం కూడా.

మనిషి మార్పునెపుడూ సరిగా తీసుకోలేదు. మార్పుని చూసి భయపడడం మానవ లక్షణం. అభివృద్ధి చెందిన ఇంగ్లండ్ వంటి దేశాల లోనే, రైళ్ళు వచ్చిన కొత్తలో, అవి దయ్యాల చేష్టలని ప్రజలు భయపడే వారట. కాని మార్పు ఆనేది ఆగదు. మనిషి అనే వాడు మారక తప్పదు. ఒక శతాబ్దం క్రితం అంటరానితనం, విధవా వివాహం, మరింకో శతాబ్దం క్రితం సతీ సహ గమనం వంటి సమస్యల స్వరూపానికీ ఈనాడు వాటి స్వరూపానికీగల తేడా అందరికీ తెలిసిందే. ఆ సమస్యలు ఆ తరంలో అంత భయంకరంగా ఉండేవంటే ఈనాడు నమ్మడం కూడా కష్టమే. అట్లాగే వర్ణాంతర, మతాంతర వివాహాల విషయంలో కూడా. వాటిని చూసి భయపడెవారు, వాటిని ఇష్టపడని వారు అట్టి వివాహాలు విఫలమవుతున్నాయని ఘోషించడంలో ఆశ్చర్యం లేదు.

అయితే, సవర్ణ, సమత వివాహాలన్నీ సఫలమవుతున్నాయా అని ఆలోచించాలి. అనేక సందర్భాలలో అవి విఫలమవుతున్నాయనేది కూడా సత్యమే. నిజానికి అన్యోన్యంగా కాపురం చేస్తున్న దంపతులను వ్రేళ్ళమీద లెక్కపెట్టవచ్చు. పోనీ ప్రేమించుకుని చేసుకున్న సవర్ణ వివాహాలన్నీ సవ్యంగా ఉన్నాయా అంటే అదీలేదు. వాటిల్లోకూడా ఎన్నో విఫలమవుతున్నాయి. కనుక వివాహం విఫలమవడం, సఫలమవడం అనేది మనుష్యుల సంస్కారంపైన, పరస్పర అవగాహనపైన, పరిస్థితుల ప్రాబల్యంమీద ఆధారపడి ఉంటుందే తప్ప, వర్ణంలోను మతంలోను ఉండదు.

కాని, వర్ణాంతర వివాహాలలోని, విఫలమవుతున్నవాటి సంఖ్య కొంచెం ఎక్కువనే చెప్పక తప్పదు. వీరిని విడదీసేవి ముఖ్యంగా వారివారి ఆహారపుటలవాట్లు. మాంసాహారికి, కనీసం తనఇంట్లో శాకాహారిగా ఉండడంలో కష్టం లేదుగాని, శాకాహారి అందులోనూ శాకాహార స్త్రీ మాంసాహారిగా మారడం మాత్రం చాలా కష్టం. ఇలాంటివి వదిలించుకుని, ఆహార పద్ధతులు మార్చుకుని దంపతులిద్దరూ సరిపెట్టుకుని ఉండగలగడం ఆనేది, అంత తేలికైన విషయంకాదు. వర్ణాంతర వివాహాలలో చాలావరకు ప్రేమపెళ్ళిళ్ళు ఉంటాయి. ఎంత ప్రేమ పెళ్ళి అయినా ఆ మోజు కొత్త పొంగులోనే ఉంటుంది. ఆది చల్లారగానే, ఈ భేదాలు దంపతులమధ్య తొంగిచూసి, క్రమేణ అడ్డుగోడలుగా ఎదిగిపోతాయి. దానికితోడు బంధుమిత్రుల విమర్శలుకూడా వినిపిస్తుంటాయి. అప్పుడు అందరికీ చెడ్డామని, తొందరపడి పొరపాటు చేశామనే భావన ఇద్దరికీ కలిగి తాపం కాస్తా పరితాపంగా మారుతుంది. అప్పుడే మొదలవుతుంది వివాహం విఫలమవడం.

ఇదే పరిస్థితి మతాంతర వివాహాలకి కూడా వర్తిస్తుంది. దీనికితోడు భర్త హైందవేతరుడైతే, భార్య విధిగా మతం మార్చుకోవాలని కోరడం, బలవంత పెట్టడం మామూలుగా జరుగుతుంటుంది. ఈ మతాంతర వివాహితుల్లో ఒకరు – (ముఖ్యంగా భార్య) శాకాహారి, మరొకరు మాంసాహారి అయినట్లయితే, అట్టి వివాహాలు విఫలమయ్యే అవకాశం మరీ ఎక్కువే అని చెప్పాలి. ఆహారపు టలవాట్లనూ, అభిప్రాయాలను అవలీలగా మార్చుకోగలిగితే, విఫలమయ్యే వివాహాల సంఖ్య విస్తారంగా తగ్గిపోవచ్చును.

కారణాలు తరచి చూడకుండా, వర్ణాంతర, మతాంతర వివాహాలు విఫలమవుతున్నాయనీ, అందువల్ల అవి తప్పనీ అనుకోవడం ఉష్ట్ర పక్షి చందమే అవుతుంది. అభిప్రాయాలు కలిసి, అవగాహన ఏర్పడిన నాడు వర్ణమూ, మతమూ అనే పదాలకు స్థానమే ఉండదు. పరస్పరం అభిప్రాయాలను గౌరవించుకోగల సంస్కారం ఉన్న నాడు, ఆహార పద్ధతులను మార్చుకోగలిన నాడు, సుఖమయ జీవితం గడపడంలో ఆశ్చర్యం లేదు. ఆ శుభదినం మరికొన్ని దశాబ్దాలలో వచ్చి తీరుతుంది. ప్రస్తుతం ఈ దిశలో మన ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలూ, ఇస్తున్న ప్రోత్సాహం, మన సంఘంలో ఈ మార్పు మరింత త్వరగా రావడానికి దోహదం చేస్తున్నాయి. □

"దేవిగారు గగనవీధులలో విహరిస్తుంటే ఎలా? భువికి దిగిరండి! ఇక్కడ తమ కటాక్ష వీక్షణాలకై ఒక దీనుడు నిరీక్షిస్తున్నాడు...." అన్నాడు చిలిపిగా.

తెల్లని పలువరుస తళుక్కుమనగా, ఫక్కున నవ్వింది రాధ. ఆ వెన్నెల వెలుగులో ముత్యాల నేరుకోసాగాడు మాధవ్.

ముందెన్నడూ అనుభవించలేదు. మది స్వర్గ సోపానాలు అధిరోహించినట్లైంది.....హృదయ తంత్రులు మీటిన గాయకుని పై మమత మరింత పెరగ సాగింది. ఎందుకు స్త్రీ పురుషునికి తన సర్వస్వం సమర్పించడానికి వెనుకాడదో ఇప్పుడిప్పుడే అర్థం కాసాగింది. ఈ అనురాగవల్లరి జన్మజన్మాల అనుబంధం కావాలని ఎందుకు ఆడది కోరుకుంటుందో తెలుసుకోగలిగింది. ఇన్నాళ్ళ

"లేదన్నయ్యా! పూరికే కూర్చున్నాను... నాకెంత పనైనా కష్టంగా లేదు. ఇంకెంతైనా ఆనందంగా చెయ్యగలను...." గాలిలో తేలిపోతూ సమాధానం చెప్పింది.

"సంతోషం సగం బలం" అర్థాంతరంగా నవ్వేడు శ్రీధర్.

అతడి ప్రసన్నతకు సంతోషం కలిగింది రాధకు.



"రాధాదేవీ! కానుక కొత్తదిస్కి గమ్మనుంటే సర్రా! ప్రతిగా నీవేం యివ్వక్కర్లేదా!" కొంటె చూపు విసిరాడు.

"నా దగ్గరేం మిగిలుంది మాధవ్! నా మనసే నీదైనపుడు నేను...."

"అవునవును. నేనే మరచాను నీవు నొప్పులు పుట్టాయా! నా మురళివి కదూ! మరి, అధరాలు దరికి చేర్చు కోవాలిగా! ఏదీ!' అంటూ రాధ మోము దోసిట్లోకి తీసుకుని చటుక్కున చెక్కిలిపై ముద్దు పెట్టుకున్నాడు. ఆ మధురానుభూతి విద్యుత్‌లా మేనంతా ప్రాకి మత్తావరింపజేసింది. మనసు ప్రభావితమై పల్లవించింది. అలాంటి స్పర్శ స్తాదో నని గాభరా పడింది.

తన జీవితానికో అర్థం ఏర్పడింది. ఏ దివ్య లోకాల్లోనో విహరిస్తున్న రాధ అక్కడ 'లైట్లు' వెలగడం, మనుషులు హడావుడిగా తిరగడం గమనించలేక పోయింది.

"ఏమ్మా! ఇక్కడే కూర్చున్నావ్? కాళ్ళు అన్నీ సర్దుకోవాల్సింది నీవేగా!" అనిన అన్న పలకరింపుతో దివినుంచి భువికి వూడిపడింది రాధ.

శ్రీధర్ ప్రక్కనే విజయగర్వంతో అలరారే మాధవ్‌ను చూచి కంగారు పడింది. మాధవ్‌తో తన దొరవను అన్న చూసి ఉంటే ఏమని భావి

"కరెక్ట్....కరెక్ట్...." ఎన్ని సార్లు అన్నాడో గుర్తులేదు.

"ఫుల్‌స్టాప్" అన్న శ్రీధర్ గొంతు విని, పరాగ్గా పలికిన పదాలకు సిగ్గు జనించగా, వడివడిగా అడుగులేసుకుంటూ జనంలో కలిసి పోయింది.

*

సౌధ పెండ్లి జరుగుతున్నప్పుడు పెండ్లి కుమారుడిలో మాధవ్‌నూ, సౌదలో తన్నూ వున్నట్లు ఊహించుకుంటూ మధ్య మధ్యన మాధవ్ కేసి చూచేది రాధ. అదే తరుణంలో

మాధవ్ తనవైపు పూరించే కన్నులతో చూచే వాడు. మురిసిపోయేది రాధ.

"నాతిచరామి, నాతిచరామి" మూడుసార్లు వినిపించేరు.

సౌద సిగ్గు దొంతర్లలో హారగా వరుణ్ణి చూస్తుంటే కవ్వించే కన్నులతో ఎంతో తృప్తిగా చూస్తున్నాడు నిరంజనరావు.

"అర్థంచ కామంచ...." పలుమార్లు పలుకు తున్నాడు వరుడు.

అసలెందుకు చెప్పిస్తున్నారో! ఎందుకు పలుకుతున్నారో! కొందరికి అసలే తెలీదు. సమయం వచ్చినప్పుడు పెళ్ళినాటి ప్రమాణాలకు ప్రాముఖ్యం యివ్వని వాళ్ళెందరో వున్నారు.

పెళ్ళంటే తనకు తెలిసిందల్లా పట్టు పావడా కట్టుకోవడం, పూలజడ వేయించుకోవడం, మిఠా

రాధ

పొన్నలూరు
పద్మావతి

యిలు తినడం, అందరూ తనను దేనికీ కోప్పడకుండా అపురూపంగా చూచుకోవడం మాత్రమే. అయితే తన కప్పుడు అర్థం కానిదల్లా ఒకటే...

11-12-13-14

మిలిటరీలో చేరడానికి సంసిద్ధుడైన మాధవ్‌ను- చివరి నిమిషంలో ఆ ప్రయత్నం నుండి విరమింపజేసి ఇంటికి తీసుకువచ్చాడు అతని తండ్రి సోమశేఖరం. మాధవ్ తనను హృదయపూర్వకంగా ఆరాధిస్తున్నాడని గ్రహించింది రాధ. 'ఇకనుంచి మనిద్దరం ఒకటే' అని మాధవ్‌కు హామీ ఇచ్చింది ఆమె. రాధా మాధవ్‌ల మధ్య అనురాగం దినదిన ప్రవర్ధమానం కాసాగింది.

తనకేమో, మామయ్యగా నే అనిపించేది. 'మొగుడు' అంటుంటే విసుగనిపించేది.

తమ పెళ్ళిలో పూలబంతులాట అవగానే ఎవరిపేర్లు వాళ్ళను చెప్పమన్నారు. తను మామయ్య అనే చెప్పింది—పెండ్లి కొడుకు పేరు. అతడు మామయ్య కాదు. నీ మొగుడు అని కోపగించుకున్నారు.'.....

పెండ్లి జరుగుతున్నప్పుడు వాళ్ళమ్మ చంకలో నుంచి మాధవ్ తన దగ్గరికి రావాలని ఏడ్చేవాడు. అమ్మ ఉరిమి చూడగానే బిత్తర చూపులు చూస్తూ... ఇంకా బిగ్గరగా ఏడ్చేవాడు.... తనకది గుర్తురాగానే బొద్దుగా ముద్దుగా వుంగరాల జుట్టుతో బాలకృష్ణుడిలా వున్న మాధవ్ గుర్తుకొచ్చాడు.... తనకు కలగబోయే బిడ్డలు అచ్చం మాధవ్‌లా.... అలా అనుకుంటూ రాధ మధురానుభూతితో ఉండిపోయింది.

తనకెదురుగా కూర్చున్న మాధవ్ కేసి చూచింది. అతడి చూపులు తూపుల్లా రాధ ఎదను గిలిగింతలు పెట్టేయి. తల్లి తమను చూస్తుందేమోనని తల త్రిప్పి చూచింది. ఆమె తీక్షణ దృష్టికి తట్టుకోలేక ముఖం త్రిప్పుకుంది.

వివాహపు తంతు ముగిసింది.

రాధ పెండ్లి పందిట్లో....వచ్చిన వారందరికి తాంబూలాల కవర్లందాయో లేదో చూడడానికి లేచింది.

15

కొన్ని కారణాలవల్ల రాధకు చిన్నతనంలోనే పెళ్లి చేయాల్సొచ్చింది. జానికమ్మ తండ్రి జబ్బుమనిషి గనక, పొలం ఎక్కువగా వున్నందువల్ల 'బాటు' జరుపుకోలేక మేనల్లుడు రాఘవయ్యను, ఇల్లిటం తెచ్చుకుని జానికమ్మనిచ్చి చేసేడు. కొడుకు చంద్రశేఖరం—గారాబంవల్ల మొండిగా తయారై బడికెళ్ళకుండా....తోటల్లో దొడ్లల్లో దొంగపిల్లల ముఠాను జేర్చి అల్లరి చేసేవాడు. ఒకసారి కోపంతో శేఖరాన్ని వళ్ళు వాతలు బడేట్టు కొట్టాడు తండ్రి....దాంతో అలిగి వూరొదిలి వెళ్ళి పోయినాడు చంద్రశేఖర్.

ఆ వెళ్ళడం....మళ్ళీ ఎనిమిదేళ్ళ తరువాత వచ్చాడు. అప్పటికి ఎన్నో పరిస్థితులు మారాయి. తండ్రి మరణించాడు. సగం ఆస్తి రాఘవయ్య పేర సగం శేఖర్ పేర విల్లురాసి పోయాడు.

అప్పటికైనా యిల్లు చేరినందుకు అందరూ ఆనందించారు. సేద్యపు పనులు చూస్తూ బుద్ధిగానే వుండేవాడు. చదువబ్బకపోయినా లోకజ్ఞానం సంపాదించుకుని వచ్చినందుకు మురిసిపోయేది జానికమ్మ. క్రమేణా నమ్మకం ఏర్పడింది రాఘవయ్యకు.

ఇంతలో పెద్ద జబ్బు చేసింది శేఖర్ తల్లికి. కొన్ని నెలల కంటె బ్రతకదని చెప్పారు వైద్యులు.

కొడుకు పెళ్ళి చెయ్యమని బ్రతిమాలిందామె. శేఖర్ బాగుపడ్తాడనే ఉద్దేశంతో రాధతో శేఖర్ పెళ్ళి జరిపించాడు... పెండ్లైన రెండు నెలల తదనంతరం ముసలామె చనిపోయింది. శేఖర్ కుర్రకారుతో స్నేహాలు మొదలు పెట్టేడు. జల్సాగా తిరిగి డబ్బు ఖర్చు కాగానే ఇల్లు చేరేవాడు. దేశం మీదికి వెళ్ళినప్పుడు అన్నీ దురలవాట్లు పట్టుబడ్డాయి. వచ్చిన క్రొత్తలో కొన్ని రోజుల వరకూ....బుద్ధిగా వుండి, ఆ తర్వాత పాత అలవాట్లను తెచ్చుకున్నాడు.

ఎన్నో విధాల చెప్పి చూచి మందలించాడు రాఘవయ్య. ఫలితం శూన్యమైంది.

"చిన్నప్పటి నుంచి దేశం మీద తిరిగి, ఇప్పుడింట్లో వుండవస్తే వాడికి....నీ అంతలేంటి! వాడి సొమ్ము వాడు ఖర్చు పెట్టుకుంటాడు. వాడిష్టం!" భర్తనంటూ తమ్ముడిని సపోర్టు చేసేది జానికమ్మ.

దాంతో అతడికి అలుసు దొరికింది.

జానికమ్మ మొదట్నించీ పెత్తనం చెలాయించడం అలవాటు చేసుకున్నందువల్లనో, భర్త ఇల్లరికం వచ్చాడని అలుసోగాని, నిర్లక్ష్యంగా మాట్లాడుతుంది.

శేఖర్ అప్పులు చేస్తున్నాడన్న విషయం రాఘవయ్య చెవుల దాకా వచ్చింది.

"మీకు బాకీ తీరుస్తాడని నమ్మకముంటేనే ఇవ్వండి! వాడి అప్పుతో నాకెలాంటి సంబంధం లేదు" ఖచ్చితంగా చెప్పాడు తన నడిగిన వారితో రాఘవయ్య.

"కలిగినింట్లో పుట్టి వాడికేం ఖర్మ. పిసినారిగా బ్రతకడానికి? ఇవ్వండి!" ఆజ్ఞాపించేది జానికమ్మ.

శేఖర్‌కు అప్పుల వాళ్ళధికమైనారు. అందరూ వత్తిడి చెయ్యడం ప్రారంభించారు. ఆస్తి కంటె అప్పే ఎక్కువ కనపడ్డంతో ఐ. పి.—కోర్టులో దాఖలు చెయ్యవలసి వచ్చింది....అప్పుల బెడద తీరిందిగాని దురలవాట్లు మానలేక పోతున్నాడు శేఖర్.

*

చేతికి డబ్బిస్తే చెడిపోతాడని రాఘవయ్య డబ్బు ఎక్కువగా ఇచ్చేవాడు కాదు. పదో, పరకో జానికమ్మ ఇస్తూ వుండేది.

ధాన్యం అమ్మిన డబ్బు ఇంట్లో వుంది. మర్నాడు నెల్లూర్లో బ్యాంక్ లో వేసి రావా లనుకున్నాడు రాఘవయ్య. ఆ నాడు ప్రొద్దు గూకిన తరువాత డబ్బు యిచ్చారు ధాన్యం కొలుచు కున్న వాళ్ళు.

తెల్లవారేసరికి ఆ డబ్బుతో శేఖర్ అదృశ్య మయ్యాడు.

జానికమ్మ నెత్తి నోరు కొట్టుకుని ఏడ్చింది. ఇల్లొదిలి శేఖర్ పోవడానికి భర్తే కారణమని నిందించింది.

తాళి కట్టించుకున్నది దురదృష్టవంతురాలని, అందువల్లే భర్త పారిపోయాడని కూతుర్ని దూషించేది.

మామయ్య పోవడానికి, తనను తిట్టడానికి సంబంధమేమిటో అర్థమయ్యేది కాదు రాధకి.

16

బుట్టెడు పూలు తెప్పించింది రాధ. శోభనపు గది అలంకరించడాని[illegible]్యేక శ్రద్ధ తీసుకుంది.

శాటిన్ గలీబులు కుట్టించుక రమ్మని పురమా యించింది మాధవ్‌ని. కొన్ని నోట్లు అతడి చేతిలో కుక్కి ఒక్కొక్కపని ఆదేశిస్తోంది.

"చెల్లెలి విషయానికే ఇంత హడావుడి చేస్తున్నావ్! మరి మన...." మనోహరంగా నవ్వేడు మాధవ్ రహస్యంగా. "ఛీ....పో.... చిలిపివాడివై పోతున్నావ్....!" చిన్నగా జబ్బపై చరిచింది.

"అ....బ్బా....అలా....ఇంకొన్ని కొంటె మాటలు నేర్చుకుంటే బావుండునే! దేవిగారి కరస్పర్శ భాగ్యమైనా లభిస్తుంది...." అంటూ చిన్నగా చిటికిన వ్రేలితో రాధ బుగ్గ మీటేడు.

రాధ ప్రఫుల్ల ముఖారవిందం గాంచిన మాధవ్ మనసు పల్లవించింది. నాలుగు కళ్ళు ఒకటై నిలిచి పోయాయి. ఇరువురి మధ్య ప్రణయ పవనాలు వీచాయి.

గడపలో ఎవరివో అడుగులచప్పుడు కాగా పెట్టె తాళం వేసే నెపంతో అక్కడికి నడిచింది రాధ. అక్కడున్న బ్యాగ్ అందుకుని హాల్లో కొచ్చాడు మాధవ్.

*

సామాను సంచితో మాధవ్ రూములోకి వచ్చే సరికి పందిరి మంచం చాందినీకి మల్లెలసరాలు, కదంబమాలల్నీ జాలర్లుగా దించుతోంది రాధ.

తెల్లని శాటిన్ గలీబులతో మెరిసిపోయే పడక తనను ఆహ్వానిస్తున్నట్టు తోచింది మాధవ్‌కు.

"ఒక్కమాటు .... పడుకొని చూడనా? హాయిగా వుందోలేదో!...." వాంఛ నిండిన కళ్ళతో వీక్షించాడు మాధవ్.

రాధ కపోలాల్లో గులాబీలు పూసేయి. మేనంతా తియ్యని కోర్కెను వాంఛించింది. మంచంపై సర్దుతూవున్న రాధ చెయ్యి పట్టు తప్పింది. తల దిండుపై ఆనింది.

దువ్వుకొనని ముంగురులు, అల్లనల్లన దిండుపై పరుచుకున్నాయి. శ్రమజేసి అలసిన మేను చమరించి వుంది. స్వేదబిందువులు ముత్యాల్లా మెరవసాగాయి, లైట్ల కాంతికి. చేత్తో అలా దిండు నిమురుతున్న రాధ చేతికి నును వెచ్చని స్పర్శ తగిలింది. నున్నటి చెక్కిలిపై అతడి సన్నని మీసం చివ్వున గ్రుచ్చుకుంది. ఆ సుఖానుభూతిలో యుగాలవరకు వుండిపోవా లనిపించింది రాధకు.

ఆ స్వర్గధామం నుంచి యదార్థానికొచ్చిన రాధ తృళ్ళిపడి చివుక్కున లేవబోయింది. అతడి బలిష్ఠ మైన కరద్వయం ఆమెని నొక్కిపట్టింది. సున్ని తంగా రెండుచేతుల్ని నెట్టివేసింది రాధ.

"ఇక్కడికెవరూ రారు. అంతా హాల్లో భోజనాల మీదున్నారు" అన్నాడు మాధవ్ అదోలాచూస్తూ.

"అయితే అవధులు మీరాలనుకున్నావా, మాధవ్! నన్ను కవ్వించకు....ప్లీజ్!" చేతులు జోడించింది ప్రాధేయ పూర్వకంగా.

"సారీ! రాధా! ఇకమీద కంట్రోల్లో వుండ డానికి ప్రయత్నిస్తాను...." గడ్డం పట్టుకుని వూపాడు.

"ఇదేనా కంట్రోల్లో వుండడం? చిలిపీ!" అతడి నెత్తిన చిన్నగా మొట్టింది.

"నేను....పరిధి దాటేనన్నావే! నువ్వు చేసిం దేమిటి?" అన్నాడు వెక్కిరింపుగా.

రూములోకి మనుష్యులు రాసాగారు. రాధా, మాధవ్, ఏదో సర్దడంలో లీనమైనారు.

*

శోభనపు గదిలో అడుగుపెడుతున్న సౌద కన్నుల్లో ఏదో కాంతి. మందగమనంలో ఏదో మత్తు గోచరిస్తోంది. ముందుకు వేస్తున్న ఒక్కొక్క అడుగు ఆనంద శిఖరాల సోపానాల అధిరోహిస్తున్నట్టున్నది. నిరంజనరావు మేనిలోని గర్వపు పొంగులు నిశ్వాసల ద్వారా వెలువడు తున్నాయి. నయనద్వయం దేదీప్య మానమైన కాంతిని వెదజల్లుతోంది, అతని చూపుల్లో తియ్యని గాఢవాంఛ వ్యక్తమౌతూంది.

వారిరువురి పరిస్థితి గమనిస్తోంది రాధ.

స్త్రీ జీవితంలో యిదో మరపురాని మధుర ఘట్టం. దాంపత్య జీవనానికి రాగబంధం. వలపుల తలపులు, పరువపు పొంగులు సార్థకమయ్యే కమనీయమైన సన్నివేశం.

ఊహాలోకాల్లో విహరిస్తూ అందరితో బాటు రూము వాకిలి దాటనందుకు రాధను తలొక విధంగా విమర్శనా దృష్టితో చూడసాగారు. కొందరు సానుభూతి ప్రకటిస్తే, మరికొందరు విడ్డూరం వ్యక్తపరిచేలా చూస్తున్నారు.

రాధ పరాకునుంచి తేరుకుని చూచేసరికి అలా వుంది పరిస్థితి. సిగ్గుతో కుంచించుకుపోతూ చక చక నడిచి పెరట్లోకి వెళ్ళింది.

*

ఇల్లు చిన్నదైనందువల్ల బంధువుల రాకతో విశాలంగా వాడుకోడానికి వీలుగాలేదు. హాల్లో, వరండాలో చుట్టాలకు పడకలు సరిపోయాయి. రాధ యీజీ ఛేర్లో కిటికీ ప్రక్కన మేను వాల్చింది. శోభనపు గదికి ఆ కిటికీ సమీపాన వుంది. అగ రొత్తుల పరిమళం కిటికీ 'వెంటిలేటర్' నుంచి వస్తోంది. వాకిట్లో వున్న మల్లె, సన్న జాజి పందిర్ల నుంచి మెల్ల మెల్లగ మలయ పవనాలు సౌరభాన్ని మోసుకొస్తున్నాయి. టేబుల్ ఫేన్ శబ్దంలో మధ్య మధ్యన చెల్లెలి చేతి గాజుల చిరుసవ్వడి శ్రుతి కలుపుతోంది.

సన్నని నిశ్వాసలు మధుర సన్నివేశపు సంకే తాన్ని సుస్పష్టం చేస్తున్నాయి.

ఆ పరిస్థితికి రాధ తనువు వాలు కుర్చీలో అసహనంగా కదల సాగింది.

మాధవ్ రూపు తన కళ్ళ ముందు మెదల సాగింది. మనసంతా మాధవ్ భావనలో నిండి పోయింది.

వయసు, మనసు, నేర్పలేని ప్రణయ పాఠాన్ని మాధవ్ నేర్పాడు. స్పందన లేని పాషాణ

ప్రతిమకు ప్రాణం పోసేదు. మూగ వీణపై మధుర గీతం ఆలపింప జేశాడు. ఆరిపోయిన ప్రమిదలో ఆశాదీపం వెలిగించాడు.

కేవలం పురుష స్పర్శలోని మధురానుభూతి స్త్రీ సహజమైన ప్రకృతి వాంఛే అయితే, ఆనాడెందుకు మగస్పర్శకు, కరడు గట్టిన కఠిన శిలగా మారిపోయింది తను?

మనసు లేని శరీరానికి స్పందన లేదని అర్థమౌతోంది. మనసుకు, శరీరానికి అవినాభావ సంబంధమేమో!

రాధ ఆలోచనలు కొన్ని సంవత్సరాలు వెనక్కు వెళ్ళేయి.

17

దేశాలు పట్టుక పోయాడనుకున్న శేఖర్ మావయ్య చాలా సంవత్సరాల తదనంతరం తిరిగొచ్చాడు. అమ్మ ఆనందానికి మేరలేదు. నాన్న ఆందోళనకు అంతులేదు. మావయ్య తిరిగొచ్చాడని మాత్రమే తనకు అనిపించింది.

అమ్మ వాలకం తనను కలవర పరచేది. మావయ్య తీవ్రదృష్టి తన శరీరాన్ని కంపర మెత్తించేది.

అమ్మ కార్యాని కంటూ ముహూర్తం పెట్టించి నపుడు, తనకు భయం ఆవరించింది గాని, అది ఆడదాని జీవితానికి సహజంగా జరగవలసినది, అవసరమైనదిగా తోచలేదు.

తను ఆ ఆపదనుంచి తప్పించుకుని ఎలా బయట పడాల్నా అనే బెంగ పట్టుకుంది.

నాన్న ఆ కార్యం జరపవద్దని అమ్మను శత విధాల బ్రతిమాలుకున్నాడు.

తన నలాంటి వూబిలోకి దింప వద్దని వేడుకుంది తను. అమ్మ అవన్నీ పెడచెవిని బెట్టి తను తలచుకున్నది జరిపించడానికే నిర్ధారించుకుంది.

"ఆ చపలచిత్తుడి చేతిలో దాన్ని పెట్టి, దాని జీవితం ఎందుకు నాశనం చేస్తావే?" అని విసుక్కున్నాడు నాన్న.

"ఎల్లకాలం అట్లానే ఎందుకుంటారూ? కాపరం నెత్తినపడి పిల్లా జల్లా కలిగితే వాడే కట్టి పడేసినట్లు పడుంటాడు. ఏదో విధంగా, పుట్టింటి కాపరం నిలిచి, వాళ్ళ వంశం వృద్ధికొస్తే అదే తృప్తి నాకు. ఇంతకాలానికి ఇల్లు వెతుక్కుంటూ వచ్చాడు. మళ్ళా వాడ్ని కష్టపెట్టి దేశం మీద తరిమి, నా కడుపులో ఎందుక్కు కోత పెడతారు?"

శ్రీమతి జీన్ సిల్లీ అన్న 37 ఏళ్ళ గృహిణి ఒక కారు ప్రమాదం వల్ల తన అందమూ, ఆకర్షణా, కామవాంఛ తరిగి పోయాయని కేసు పెట్టి నష్టపరిహారం పొందింది. ఇటీవల లండన్ హైకోర్టు ఆమెకు 11, 500 పౌన్ల నష్టపరిహారం ఇప్పించింది. 1971లో జరిగిన ఆ కారు ప్రమాదంవల్ల తనకు ఒక కన్ను పోవడమూ, ముఖం మాడి పోవడమూ జరిగి తన వ్యక్తిత్వంలోనే పెద్ద మార్పు వచ్చిందని ఆమె వాదించింది!

తమ్ముడు దూరమౌతాడన్న బాధ తప్ప కూతురి సుఖం గురించిన ఊహ ఆమెకు కలగలేదు. ససేమిరా, తను మాట విననంది. తన పంతం నెగ్గించుకోడానికే పూనుకుంది.

సెకండ్రీగ్రేడు చదువుతూ, సెలవలకు పల్లె కొచ్చి వుందప్పుడు.

స్కూల్లో తనకేదో ముఖ్యమైన పని వున్నట్టు తప్పని సరిగా రావాల్సినట్టు ఎవరిచేతనో చెప్పించి ఆ వూరినుంచి తనను నెల్లూరు చేర్చారు నాన్న.

*

అలా ఆలోచనలతో వున్న రాధకు కునుకు పట్టింది. నిద్రాదేవి ఆహ్వానాన్ని అందుకుని ఆమె వాడిలో కొరిగిపోయింది.

రూములో నుంచి సౌదను బయటికి రానివ్వడు నిరంజనరావు. అందరితో సరదాగా మాట్లాడుతూ గడపాలని, నీటి వొడ్డున పడ్డ చేప పిల్లలా కొట్టుకు లాడుతుంది సౌద.

సౌద స్నేహితురాలు, జయప్రద రాగానే, గది విడిచి బయటికొచ్చాడు నిరంజనరావు.

శ్రీధర్ ఏదో పని మీద బజార్ కెళ్ళగా, మాధవ్ నిరంజనరావుతో మాటలు కలపాలని అతడి సమీపానికి వచ్చాడు.

అయిష్టంగా ముఖం త్రిప్పుకున్నాడు సౌద భర్త. అతడి చర్యకు విస్మయం చెందాడు మాధవ్—వెళ్ళి కూర్చున్నాడు.

ఏమనుకున్నాడో నిరంజనరావు....మాధవ్‌ను పిలిచాడు. రావడానికి అభిమానం అడ్డొచ్చినా, సంస్కారం తృణీకరించలేకపోయింది. మౌనంగా వచ్చి నిలిచాడు మాధవ్. అంతా గమనిస్తూనే వుంది రాధ.

"మిష్టర్.... మీపేరు....?" డిగ్నిటీని మెయింటెయిన్ చేసుకుంటూ క్లుప్తంగా అడిగాడు.

"మాధవరావం[illegible] అంతకంటే మరి మాటలు పెంచలేదు మాధవ్.

"మీరు....బంధువులా!...." కనుబొమలు దగ్గరైనాయి నిరంజనరావుకు.

"అంతకంటే.... ఎక్కువే...." విసుగు ధ్వనించింది మాధవ్ జవాబులో.

"అంటే...." వెయ్యి ప్రశ్నలు, సందేహాలు మిళితమైన స్వరమది.

"ఫామిలీ ఫ్రండుని....శ్రీధర్‌గారికి ప్రైవేటు విద్యార్థిని....వీళ్ళింటికి నేను...."

అర్థాంతరంగా ఆపినందుకు మనసులోనే ధన్యవాదాలర్పించుకుంది రాధ-కొంపదీసి కాబోయే అల్లుణ్ణి అననందుకు. నిరంజనరావు మాటల తీరు రాధను కలవర పరిచింది. కాబోయే షడ్డకులు.... అంత విరసంగా వుంటే ఎలా!....మరదిగారి మనస్తత్వం అంతేనేమో! అని సరిపెట్టుకుంది.

రూములో నుంచి మిత్రురాళ్ళ సంభాషణ వినిపించగా గడపలోనే నిలిచిపోయింది రాధ.

"మాధవ్‌లా పాతకాలపు మనిషి కాదు. ఎంతో సరదా మనిషట – మావారు చెప్పారు. సొసైటీలో చలామణి కాగల ఘటికుడట – నీ కలాంటి వంటే యిష్టం కదటే....? పైగా

రసికుడట - అందుకేగా, అందాన్ని ఆరాధించి నిన్ను వరించాడూ?" వసపిట్టలా చెప్పక పోతోంది జయప్రద.



ఆమె చెప్పే ప్రతి మాట రాధ మనసును తీవ్రంగా ఆలోచింపజేస్తోంది. నిరంజనరావు పద్ధతులు ఒక్కొక్కటే హద్దు మీరనిస్తే ప్రమాదమైనవేనని మనసు హెచ్చరించింది. ఇంతలో చెల్లెలేమంటుందోనని కుతూహలపడింది.

"అయితే మీవారు ... చింతకాయ పచ్చడా! అహాహా...." అది చెల్లెలి కేక.

సౌద వాటిని తేలిగ్గా తీసుకున్నందుకు తృప్తి పడింది రాధ.

"పాత చింతకాయ, ... పట్టనిదైతే, ఎలాగో వాడుకోవచ్చుగాని ఎగిరే పతంగానికి, దారం గట్టిగా లాగి పట్టకపోతే ప్రమాదం సుమా!" పరిహాసంలోనే హెచ్చరిక జోడించింది జయప్రద.

"చూసావుగా...." అన్న సౌద మాటల్లో బాగుపరచుకోగలనన్న భావం కొట్టవచ్చినట్టు తోచింది రాధకు.

కిలకిలమని యిద్దరి నవ్వులూ శ్రుతి కలిశాయి.

మిత్రత్వంలోని గరిమ సాటిలేనిది. నిస్వార్థమైనది - అన్నిటికంటె తియ్యనిది స్నేహం - ఎవరో మహాపురుషుడు వ్రాసిన వాక్యం గుర్తుకొచ్చిందది రాధకు.

నివేదవచ్చి 'అమ్మ వంట ఇంట్లోకి రమ్మంద'ని చెప్పగానే ముందుకు సాగింది రాధ.

18

మొదట గుంటూర్లో అత్తగారింట్లో వదల్చిపెట్టి వస్తే అవతల తను వుద్యోగం చేసే వూరికి తీసికెళతానన్నాడు నిరంజనరావు.

సౌదను కోడరికానికి పంపేటప్పుడు, అందరి మనసులూ ఆర్ద్రమైనాయి... ఈనాటివరకూ తమతో మెలిగినపిల్ల, పరాయిచోటు తన స్థానంగా భావించుకుని మెలగడం కష్టమే...అనిపించింది రాధకు.

అత్తగారింటికెళ్ళే సౌద కళ్ళల్లో, కన్నవారిని వదిలి పోవాల్సొస్తుందనే విచారం కమ్ముకున్నా... ఆనందరేఖలేవో మెరిశాయి.

"అక్కయ్యా! నేను వెళుతున్న బాధకంటే, నీకు తోచదనే వ్యధ నన్ను పీడిస్తూంది! నీకు లేని సుఖాలు నేననుభవిస్తూంటే, నీవు వుసూరుమని మోడులా వున్నందుకు..."

మాటను మధ్యలో తుంచుతూ—

"ఇప్పుడవన్నీ ఎందుకే...!" విషయాన్ని సరుతూ, ప్రియంగా ఓ చేతో చెల్లెలి ముంగురులు సవరిస్తూ బుజ్జగింపుగా భుజం నిమిరింది రాధ.

రిక్షాలు కదిలేదాకా వుండి, లోపలికి నడిచింది రాధ. శ్రీధర్ ముఖం వివర్ణమైవుంది. సౌద ముఖంలో ... వుంది. ... పెళ్ళి ... అక్కాచెల్లెళ్ళు ... తరుణాల్లో... చింతకు ...

ఆడపిల్లను అత్తగారింటికి పంపే ఘట్టంలోని దుఃఖం అలనాటి కణ్వమహామునికే తప్పలేదన్నవేద్ది. తండ్రి విచారవదనం చూచి జాలి పొంగుకొచ్చింది రాధకు.

సౌద విషయంలోని ప్రతి సంఘటన తన గతాన్ని, తన జీవితాన్ని వెలికి తోడుతోంది. తనకు అత్తవారిల్లంటూ వేరేలేదు.

19

"నా భార్యను క్షేమంగా తీసుకెళ్తాను" అన్నాడు శేఖర్.

"నీతో ఇల్లా ... ఎట్లా పోషిస్తావ్? ఎక్కడికి తీసికెళతావ్? ... నీకిద్దరే లేకపోయినా, సంపదానికి నాకున్న జ్ఞానం వుందిగా... తమ్ముడున్నాడు... అవి..." అని కూతుర్ని పంపడానికి తిరస్కరించాడు రాఘవయ్య.

తమ్ముడికి వత్తాసి కొచ్చిన జానకమ్మ—

"వాడి ... మన సొమ్ము తిని ... అని. మన సొమ్ముతో వాడేం ... కోసం ... పంపమన్న మాత్రాన ... పంపుతాం? ఇక్కడే మనతో పాటు వుంటారు."

"వాడికేదైనా ... చేస్తాడ గావిడ ఇంట్లోనే వుంచుకోలేను. ఒకటికి రెండుసార్లు నచ్చ చెప్పబోయి ... పోయినాడు. బుద్ధొచ్చింది. నీ మెంతగింజ్యున్నా సరే అది జరిగే పనికాదు!" నిర్మొహమాటంగా తిరుగులేని జవాబు చెప్పాడు రాఘవయ్య.

"... ఇంట్లో ... ఇష్టం లేకపోతే, వాడి పెళ్ళాన్ని వాడితో పంపు. ... కింద వుంచుకుంటాడు."

"దాన్నింట్లోనే ... ఎందుకు బజారుపాలు చేస్తావ్..." కోపంతో వూగిపోతూ బతిమాలుకున్నాడు రాఘవయ్య.

అప్పటికి పట్టుదల సడలించుకున్నారు అక్కాతమ్ముడు. కాని 'పగ' రాజుకున్నే వుంది. సమయం కోసం వేచి వున్నారు.

*

ఇంతలో రాధ చేత 'విడాకుల' కోసం దావా వేయించాడు రాఘవయ్య.

అగ్గి మీద గుగ్గిలమైపోయింది జానకమ్మ.

మండే కొరివిని ఎగసన ద్రోసినట్లయింది శేఖర్‌కు.

వారిద్దరికీ ద్వేషం పెరిగింది. ... కుండా కార్యరూపంలో చూపాలనుకున్నారు.

ఒకనాడు అనునయంగా నచ్చజెప్పబోయిన తల్లి మాటను తిరస్కరించింది రాధ: ... ఫలితం "జన్మ వున్నంతవరకూ అనుభవిస్తావు" అని బెదిరించింది జానకమ్మ. బెదిరింపులకు లొంగిపోని రాధ, తనను అర్థం చేసుకుని కాపాడమని ప్రార్థించింది తల్లిని. సోదర ప్రేమ, పట్టుదల ఆమెను రాక్షసిగా మార్చేసి, మాతృప్రేమను ... దోచేయి.

ఒకనాడు రాధను ఎంతో ఆప్యాయంగా పిలిచి, ఆప్తులతో ఒక ముఖ్య విషయం మాట్లాడాలన్నాడు శేఖర్.

"మేనమామగా నాకు గౌరవం ఎప్పుడూ వుంది. అలాగే మాట్లాడు" మంది రాధ.

"ఎప్పటికైనా భార్యాభర్తలం మనం. నీవిప్పుడు నాతో కాపరం చేస్తానని ఒప్పుకుంటే కేసు కొట్టేస్తారు. ... నా బుద్ధి మార్చుకున్నాను ఇంకా మార్చుకుంటాను. కూలైనా చేసి ... ... 'ఆదర్శ' చేసుకోవాలంటే ఎవరూ ముందుకు రారు. దాన్ని పొగరుబోతుగా ... తిండి సంపాదించుకుని తిన్నా, దాంపత్య సుఖానికి నోచుకోని నిరర్థక జీవితం అవుతుంది నీది. బాగా ఆలోచించుకో." అన్నాడు భవిష్యత్తును ఏకరువు పెడుతూ.

చదువులేని మనిషి అంత 'జనరల్ నాలెడ్జి' సంపాదించుకున్నందుకు ఆశ్చర్యపోయింది రాధ.

[సశేషం]

వార్తల్లో వనిత:

చియాంగ్ చింగ్

ప్రపంచం మొత్తం మీద—ఒక దేశానికి 80 కోట్ల ప్రజల నాయకుడిగా, వారి భవిష్యత్తును మార్చివేయ గల నిర్ణయాలు చేసే అవకాశం చైనా నాయకుడు మావ్ సేతుంగ్‌కు తప్ప మరెవరికీ దక్కలేదంటారు చరిత్రకారులు. అందువల్లే ఈ సంవత్సరం సెప్టెంబర్ 9 నాడు మావో మరణించగానే ప్రపంచం దృష్టి చైనా వైపుకు మళ్ళింది. 'మావో తర్వాత ఎవరు?' అన్నది. ఆ మధ్య చాలా కాలం నుంచే చైనాలోనే కాక ప్రపంచమంతటినీ ఆకర్షించిన ప్రశ్న. ఆ ప్రశ్నకు తగ్గ సమాధానం చెప్పే బాధ్యతను కొందరు చైనా నాయకులు తమ చేతుల్లోకి తీసుకున్నారు. అటువంటివారితో ప్రపంచం దృష్టిని ఆకర్షించిన వ్యక్తి 61 సంవత్సరాల చియాంగ్ చింగ్.

చియాంగ్ చింగ్—మావో భార్య. 1940 లో మావో—యేనాన్ గుహల్లో అజ్ఞాతవాసం చేస్తున్న రోజుల్లో చియాంగ్ చింగ్ మావోను ఆకర్షించింది. అప్పటికి ఆమె నటిగా మంచి గుర్తింపు తెచ్చుకుంది.

మావో అధికారంలోకి వచ్చాక, చియాంగ్ చింగ్—తన భర్త పేరును ఉపయోగించి పలుకుబడి సంపాయించింది. ఆమె పలుకుబడి పెరిగినట్లే ఆమె శత్రువుల సంఖ్య కూడా పెరిగింది.

మావోను పెళ్ళాడేనాటికి చియాంగ్ చింగ్ వయసు 25 సంవత్సరాలు. అప్పటికి 46 ఏళ్ళ వయసుగల మావో-క్షయతో బాధపడుతున్న తన మూడవ భార్యను విడనాడి చియాంగ్ చింగ్‌ను పెళ్ళాడడానికి సిద్ధపడ్డాడు.

చియాంగ్ చింగ్ బాల్యం అస్తవ్యస్తంగా గడిచింది. ఒక రైతు ఇంట పుట్టిన ఆమెను చిన్నప్పుడే ఎవరో దొంగతనంగా తీసుకుపోయి ఒక నాటకాల బృందానికి అమ్మేశారు. అప్పట్లో ఆమె చాలా బాధపడి ఉండాలంటారు — అప్పటి రోజుల గురించి బాగా తెలిసినవారు.

మొత్తంమీద చియాంగ్ చింగ్‌కు కళలంటే అభిమానం ఏర్పడింది. కొన్నాళ్ళు ఆమె ఒక లైబ్రరీలో గుమస్తాగా పనిచేసింది. అక్కడే జ్ఞానం సంపాయించుకునే ప్రయత్నాలు చేసి వామపక్ష పరిజ్ఞానం గడించింది. ఆ పరిజ్ఞానం కలగడంవల్ల ఆమె జైలుకు కూడా వెళ్ళవలసివచ్చింది.

జైలునుంచి బయటపడ్డాక ఆమె మరో కొత్త దారి తొక్కితే బావుంటుందనుకుంది. అలా ఆమె అప్పట్లో చైనాకు సాంస్కృతిక రాజధానిగా పేరు గడించిన షాంగాయ్‌కి చేరుకుంది. అక్కడ ఆమె దాదాపు పది చలన చిత్రాలలో చిల్లరమల్లర వేషాలు వేసింది.

1937లో జపాన్‌వాళ్ళు షాంగాయ్‌లోకి చొచ్చుకొని రావడంతో చియాంగ్ చింగ్ అక్కడినుంచి చుంగ్‌కింగ్ చేరుకుంది. ఆ తర్వాత ఆమె చుంగ్‌కింగ్ నుంచి కమ్యూనిస్టుల స్థావరమైన యేనాన్‌కు చేరుకుంది.

ఆమె మావో భార్య కావడం—మావో సన్నిహితులు కొందరికి ఇష్టం లేకపోయింది. తన భార్య రాజకీయాలలో ప్రవేశించదని మావో హామీ యిచ్చేదాకా వారు ఊరుకోలేకపోయారు. ఇలా పార్టీ పెద్దలు తమ పెళ్ళిని వ్యతిరేకించడం—చియాంగ్ చింగ్‌కు కోపం కలిగించింది. ఆ కోపాన్ని, ఆ పెద్దల మీది తన ద్వేషాన్ని ఆ తర్వాత అవకాశం వచ్చినప్పుడల్లా ఆమె ప్రదర్శించసాగిందంటారు చరిత్రకారులు.

1960 లో చైనాలో చెలరేగిన శ్రామిక జన సాంస్కృతిక మహా విప్లవం సందర్భంగా— అభ్యుదయ భావాలను వ్యతిరేకిస్తున్నారన్న అభియోగంతో తన కిష్టంలేని పార్టీ పెద్దలెందరినో బయటికి నెట్టించింది ఆమె. ఆమె ప్రోత్సాహంతో ముగ్గురు నాయకులు బలం పుంజుకున్నారు.

మావో మరణించిన తర్వాత ఆమె — వాంగ్ హంగ్‌వెన్, చాంగ్ చున్ చియావో, యావో వెన్ యువాన్ (ఈ నలుగురినీ 'షాంగాయ్ చతుష్టయం' అంటారు.) అన్న ఆ ముగ్గురితోనూ కలిసి వీలున్నంత సైన్య సహాయంతో అధికారం చేజిక్కించుకునే ప్రయత్నం చేసింది.

చైనా ప్రధానిగా ఉన్న చౌ ఎన్‌లాయ్ మరణించినప్పుడు చియాంగ్ చింగ్ — చాంగ్‌ను ప్రధాని చెయ్యాలనుకుంది. అయితే ఆమె ప్రయత్నం ఫలించలేదు. అప్పుడు హువా కువో ఫెంగ్ ప్రధాని అయ్యాడు. ఆ తర్వాత మావో మరణించాక హువా అటు పార్టీకీ, ఇటు ప్రభుత్వానికీ కూడా నాయకుడయ్యాడు.

హువాను చియాంగ్ చింగ్ వ్యతిరేకించసాగింది. అయితే ప్రజల మధ్య ఆమెకు అంత మంచి పేరులేదు. ఆమె దురుసుతనమూ, క్రూరమైన ప్రవర్తన ఎందరి పగకో గురయింది. షాంగాయ్ చతుష్టయం ప్రయత్నాలను హువా సాగనివ్వలేదు. ఒక సైనికాధికారిద్వారా చియాంగ్ చింగ్ సైన్య సమీకరణ గురించి విన్న హువా వెంటనే షాంగాయ్ [illegible] ఖైదు చేయించాడు. ఆ నలుగురూ ఖైదు కావడాన్ని పురస్కరించుకొని పీకింగ్ వీధుల్లో 58 లక్షలమంది ప్రజలు పెద్ద ఊరేగింపు జరిపారట! ఇలాంటివి చైనా మొత్తం మీద ఎన్నో జరిగాయని పత్రికలు పేర్కొన్నాయి. హువా చైనాకు ఛైర్మన్ అయ్యాడు.

ఎలాగైనా అధికారంలోకి రావాలనుకుని చియాంగ్ చింగ్—మావో వీలునామాలో ఆయన వారసురాలు తానే అన్న మార్పు చేసిందనీ, ఆయనను చంపడానికి ప్రయత్నించిందనీ—ఆరోపణలు ఉన్నాయి. బూర్జువా మాక్సీ స్కర్టులు వేసుకోవడం, బంగారు గడియారాలు ధరించడం-ఆమె ఇటీవల చేసిన నేరాల్లో కొన్ని.

నానాటికీ చియాంగ్ చింగ్ ఇదివరలో చేసిన నేరాల గురించిన వివరాలు వెలువడుతూనే ఉన్నాయి. ఈ అన్ని నేరాలకు సంబంధించిన విచారణ త్వరలోనే ప్రారంభమవుతుందంటున్నారు.

నటిగా జీవితం ప్రారంభించిన చియాంగ్ చింగ్ జీవితనాటకం ముగింపు ఆ విచారణ మీద ఆధారపడి ఉంటుంది! □

కృత్రిమ పుష్పాలు

"అరరే! మొన్న వచ్చినప్పుడు చూశాను. అప్పుడూ అలాగే ఉన్నాయి ఆ పువ్వులు. ఇప్పుడూ అలాగే ఉన్నాయి. సరిగ్గా మొన్న చూసిన పువ్వులలాగే ఉన్న ఈ పువ్వులను ఎక్కడినుంచి తెచ్చారు?" అన్నది రమ పొరుగునే ఉన్న సుందరి యింటికి వచ్చినప్పుడు.

సుందరి ఒక్క చిరునవ్వు చిందించి "ఆ రోజు మీరు చూసిన పువ్వు[illegible] అవి. ఆ పువ్వులు నేనే తయారు చేశాను. అవి వాడనిపువ్వులు" అన్నది.

"నేను నమ్మలేను. ఆ పువ్వులు మీరు చేశారా? చూడ్డానికి అసలు గులాబీపువ్వుల్లా ఉన్నాయే!" అన్నది రమ.

సుందరి "కాస్త ప్రయత్నిస్తే మీరు కూడా ఇలాంటి పువ్వులు చెయ్యవచ్చు. అప్పుడు మీరు తయారుచేసిన పువ్వులను చూసి మీ కళ్ళను మీరే నమ్మలేరు" అన్నది.

"సరే....ఈ పువ్వులు ఎలా చెయ్యాలో నాకు చెప్తారా?" అని అడిగింది రమ-ఉత్సాహంగా.

"తప్పకుండా చెబుతాను" అని సుందరి ఆ విధానం చెప్పింది:

కృత్రిమమైన పువ్వులతో ఇళ్ళను అలంకరించడం పాశ్చాత్యదేశాలలో బాగా అలవాటులో ఉంది. వీటిని వాళ్ళు 'పొడిపువ్వులు' అంటారు. ఈ పువ్వులను తయారుచెయ్యడం శ్రమతో కూడిన పనేమీకాదు. కాస్త ఓపిక ఉంటే క్రేప్‌కాగితాలు, వెల్వెట్ వంటి గుడ్డలూ, తీగెలూ ఉపయోగించి అందమైన పువ్వులు తయారుచెయ్యవచ్చును.

ఇటీవల 'వనిత' లో వెల్వెట్‌గుడ్డ ఉపయోగించి అందమైన మందారపువ్వులు రూపొందించే విధానం గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు 'బక్రం' అన్న గుడ్డను ఉపయోగించి 'వస్త్రపుష్పాలు' తయారు చెయ్యడం ఎలాగో తెలుసుకుందాము.

బక్రంగుడ్డ మామూలుగా పట్టణాలలోని దుకాణాలలో దొరుకుతుంది. ఈ గుడ్డ కాస్త గరుగ్గా ఉంటుంది. అలా గరుగ్గా, బిగువుగా ఉన్నందు నల్ల దాంతో పువ్వులు చెయ్యడం సులభం. అలా దాంతో మనకు కావలసిన తీరులో పువ్వులు తయారుచేసుకోవచ్చు.

మామూలుగా బక్రంగుడ్డ తెలుపురంగులో ఉంటుంది. దాన్ని మనకు కావలసిన రంగులలో అద్ది-ఆయా రంగు పువ్వులను తయారుచెయ్యవచ్చును.

కావలసిన కొలతల్లో రేకుల ఆకారాలను రూపొందించి, ఆ ఆకారాలకు తగిన ముక్కలను బక్రంగుడ్డ నుంచి కత్తిరించి తీసుకోవాలి.

ఇలా కావలసినన్ని రేకులు తయారుచేశాక పువ్వులను తయారుచెయ్యవచ్చును. తయారుచేసిన రేకులలో చిన్నవిగా ఉన్నవాటిని మధ్య ఉంచి, వాటి చుట్టూ పెద్ద రేకులను ఉంచి పువ్వులను రూపొందించవచ్చును.

24 గేజ్ తీగె (ఈ తీగెలు ఇనుపసామానులు అమ్మే షాపులలో దొరుకుతాయి) ఒకటి తీసుకుని దాని మీదిభాగాన రేకులను ఊడిపోకుండా పువ్వుల ఆకారంలో గట్టిగాకట్టి ఉంచాలి.

ముందుగానే ఈ తీగెముక్క మీద పచ్చరంగు క్రేప్‌కాగితాన్ని చుట్టుకోవాలి. ఈ తీగె-పూవు కాడగా పనికివస్తుంది. ఆ తర్వాత పువ్వుల మధ్య పుప్పొడిగుత్తి అమర్చాలి. ఇందుకు-బక్రంగుడ్డ నుంచి చిన్న చిన్న ముక్కలు కత్తిరించి గానీ, లేదా తెలుపురంగు క్రేప్‌కాగితం నుంచి కత్తిరించిన ముక్కలు గానీ తీసుకుని గుత్తిలా కట్టి ఆ మీది భాగాన జిగురు పూసి పసుపురంగు రవలో (గోధుమరవను కాస్త తీసుకుని దాన్ని బట్టలకు వెయ్యడానికి ఉపయోగించే పసుపురంగులో కలిపి కాస్త నీళ్ళు చల్లి పసుపురంగు రవ తయారుచేసుకోవాలి) అద్దితే పుప్పొడిగుత్తి తయారవుతుంది. దాన్ని పువ్వు మధ్య అమర్చుకోవాలి. తీగె కొనకు మొదట పుప్పొడిగుత్తి అమర్చి-దారంతో గట్టిగా కట్టి, ఆ తర్వాత ఆ చుట్టూ రేకులు అమర్చితే పువ్వు బాగా రూపొందుతుంది.

రేకులు కట్టిన భాగాన పచ్చరంగు క్రేప్‌కాగితం అతికి పువ్వు కింద ఉండే రక్షకపత్రం రూపొందించాలి. అలాగే పచ్చరంగు క్రేప్‌కాగితం నుంచి ఆకుల ఆకారంలో ముక్కలు కత్తిరించి, వాటిని తీగె మీద తగిన తీరులో అతికితే మరింత బావుంటుంది.

పక్క పేజీలోని వర్ణచిత్రాలలో బక్రంగుడ్డను ఉపయోగించి రూపొందించిన పువ్వులతో బాటు, గులాబీపువ్వు కూడా కనిపిస్తున్నది. ఈ వర్ణచిత్రాలు చూస్తే ఈ పువ్వులు రూపొందించే విధానం మరింత స్పష్టమవుతుంది.

సంభాషణ:

కేశ సంపద

కమల : సుశీలా, నీకు బిడ్డు పట్టించటానికి మళ్ళీ తయారయాను.

సుశీల : బిడ్డా? అలా ఎన్నడూ అనుకోకు. నీ ఆనందోత్సాహం చూస్తే ఎంతో ముచ్చటగా ఉంది. నావల్ల ఏం సహాయం కావాలి?

కమల ; నాకు కాస్త కేశాలంకరణ చేసిపెట్టాలి.

సుశీల : తప్పకుండానూ. కాని ఈ ప్రత్యేకాలంకరణ దేని కోసం? డాన్సుకు గాని, ఏదైనా పార్టీకి గాని పోతున్నావా?

కమల : చాల్లే నీ వెటకారం. ఇవాళ మా పెళ్ళి రోజు. అందుకని మా వారూ, పిల్లలూ నన్ను విస్మయ పరిచే ప్రయత్నంలో ఉన్నారు. అందుకని నేను కొత్తరకం కేశాలంకరణతో వాళ్ళని విస్మయ పరచదలిచాను.

సుశీల ; మంచి పనే.

కమల : ఇవిగో పిన్నులూ, దువ్వెనా అవీనూ.

సుశీల : ఇవన్నీ తీసుకు రావాలా? నా దగ్గిర దువ్వెనా, అద్దమూ అవీ లేవా?

కమల : ఇవన్నీ నా హాండ్ బాగ్‌లోవి సుశీలా, ఎప్పుడూ వెంట ఉంచుకుంటాను.

సుశీల : నువు మామూలుగా వెంట ఉంచుకునే "నెట్" ఇవాళ లేదేం?

కమల : ఇవాళ నువ్వు మహా ఆకతాయి ధోరణిలో ఉన్నావు. త్వరగా తేల్చు. పదిహేను నిమిషాలలో తిరిగిపోవాలి.

సుశీల : సరే, పట్టు!

కమల : నాకున్న కాస్త జుట్టు చిక్కు పడదులే. నీకు శ్రమ ఉండదు.

సుశీల ; కమలా, నీ జుట్టు చాలా బాగు పడింది సుమా.

కమల : ఏ విధంగా నంటావు?

సుశీల : నీ తల అంతటా కొత్త వెంట్రుకలు వస్తున్నాయి. అవి పెరుగుతాయి.

కమల : నా జుట్టు ఒత్తు అవుతుందంటావా?

సుశీల : ఇదివరకంత పలచగా మాత్రం ఉండబోదు. నీ ఆరోగ్యమూ, ఆహారాలూ బాగు పడటంతో జుట్టు పెరుగుతూండాలి.

కమల : నా జుట్టుకు కాస్త పేరూ, ప్రతిష్ఠా రావటానికి ఇంకా ఏం తినాలో, ఏం చెయ్యాలో కాస్త చెప్పు.

సుశీల : జుట్టునుగురించి అత్యంత శ్రద్ధ వహించ వలసినది ఆడపిల్ల 10, 12 ఏళ్ళ వయసులో ఉండగా. అలా చేస్తే యుక్త వయసు వచ్చే సరికి కాకి రెక్క రంగులో ఒత్తయిన కేశ సంపద ఏర్పడుతుంది.

కమల : నేనిప్పుడు దిగబెరిగి చిన్నదాన్ని అయేమాట అబద్ధం గనక, ఈ మధ్య వయసులో మోక్ష మార్గం ఏదన్నా ఉందా?

సుశీల : వేదాంతం మాట్లాడేస్తున్నావే? జుట్టు అందంగా ఉండాలంటే శరీరం ఆరోగ్యంగా ఉండాలి. శరీరం ఆరోగ్యంగా ఉండాలంటే సమతూకాహారం (సమతులాహారం) ఉండి, చురుకుగా పని చెయ్యాలి.

కమల : జుట్టు బాగా పెరగటానికి ఏమైనా తినవలసి ఉంటుందా?

సుశీల : కాల్షియమ్ అధికంగా గల ఆహార పదార్థాలు జుట్టుకీ, దంతాలకీ, గోళ్ళకీ మంచిది. చిన్న పిల్లల ఆహారంలో కాల్షియం లోపిస్తే వాళ్ళ గోళ్ళు పెళుసెక్కి, విరిగిపోతాయి. కాల్షియం లోపించిన ఆహారమే తింటూ పోయే బిడ్డకు, నిత్యమూ పాలుతాగే బిడ్డకున్నంత జుట్టు ఉండదు.

కమల : అవును, పిల్లలకు పాలు అవసరమనీ, పాలలో ఎముకలూ, పండ్లూ పెరగటానికి పనికి వచ్చే పదార్థం ఉన్నదనీ నువ్వు ముందు చెప్పావు.

సుశీల : జుట్టూ, గోళ్ళూ కూడానూ.

కమల : చిన్నతనం నుంచి కూడా నాకు పాలు పడవు. అందుకేనేమో నా జుట్టు పలచన.

సుశీల : ఆకు కూరల్లోనూ, గోరుచిక్కుడులోనూ, ములక్కాడల్లోనూ కాల్షియం ఉంటుంది. అయితే వాటిని హెచ్చుగా తినాలి. గోరుచిక్కుళ్ళు ఉడికించిన నీరు విసర్జించరాదు.

కమల ; మొదట ఉడకబెట్టిన నీరు పారబోస్తే గోరుచిక్కుళ్ళలోనూ, కాకరకాయల్లోనూ ఉండే చేదు పోతుంది.

సుశీల : వాటిలోని కాల్షియమూ, ఇనుమూ దక్కాలంటే ఆ అలవాటు మానుకోవాలి. జుట్టు ఏపుగా పెరగాలంటే రక్తప్రసారం బాగా ఉండాలి. జుట్టు పెరుగుదలకు కావలసిన పదార్థాలన్నిటినీ రక్తం నెత్తి కెత్తుతుంది.

కమల : రక్త ప్రసారాన్ని మెరుగుపరచటమెలాగ?

సుశీల : రోజుకు కనీసం రెండుసార్లు తల అంతా మర్దనచెయ్యాలి. తెల్లవారగానే తలకు నూనె రాచుకుని రుద్దటం మంచిది. ఇందువల్ల రక్తప్రసారం మెరుగవుతుంది. రాత్రిపూట జుట్టు ముందుకు పడేలా వంగి, తాపీగానూ, క్షుణ్ణంగానూ దువ్వాలి. దువ్వేటప్పుడు బ్రష్‌ను వెంట్రుకల కుదుళ్ళనుంచి కొసలకేసి ఆడించాలి. అలా చేస్తే నూనె కొసలకు చేరుతుంది. కొసలకే నూనె హెచ్చుగా అవసరం. తలంటుకోవటం అలవాటుంటే స్నానానికి ముందు నూనెతో తలను బాగా రుద్దాలి, స్నానం అయాక తువాలుతో తల బాగా రుద్దాలి.

కమల : ఇవన్నీ నా కూతురికి చేసి, దాని జుట్టు ఒత్తుగా, అందంగా ఉండేలా చేస్తాను.

సుశీల : జుట్టు ఎంత ఒత్తుగా ఉండేది వారసత్వం నిర్ణయిస్తుందనుకో, అయినా జుట్టు ఆరోగ్యంగా ఉండటానికి చెయ్యదగినది ఎంతైనా ఉన్నది. నల్లగా తుమ్మెద రెక్కల్లాటి, ఒత్తయిన శిరోజాలు పెరగటానికిగాను జుట్టును శుభ్రంగాను, చక్కగా దువ్వి, నూనె రాసి ఉంచుకోవాలి.

కమల : నాతల్లో నెరిసిన వెంట్రుకలేవైనా కనిపిస్తున్నాయా, సుశీలా? కనిపిస్తే పీకెయ్యి.

సుశీల : పీకేసినంత మాత్రాన జుట్టు నెరవటం నిలిచిపోదు.

కమల : వయసుకన్నా ముందే జుట్టు నెరవకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి?

సుశీల: ఇదికూడా వారసత్వాన్నిబట్టి వచ్చేదే కాని దాన్ని గురించి చేసేదేమీ లేదనికాదు, నరాలకు అవసరమైన బి, విటమినుగల ఆహారం జుట్టు నెరవకుండా ఆపుతుంది. పౌష్టికాహారాలు తీసుకుంటే జుట్టు బాగా పెరిగి, నల్లగా ఉంటుందని చెబుతారు.

కమల: ఏవి పౌష్టికాహారాలు?

సుశీల: పుష్కలంగా ప్రొటీన్ (మాంస కృత్తు)లూ, ఖనిజ లవణాలూ ఉన్నవన్నీనూ.

కమల: అంటే పిండి పదార్థాలూ, కొవ్వు పదార్థాలూ ఉన్న ఆహారాలేవీ జుట్టుకు మంచివి కావన్నమాట. అంతేనా?

సుశీల: ఇంచుమించు అంతే. ఇప్పుడు నువ్వు తీసుకునే మాంసమూ, గుడ్లూ, ఆకుకూరలూ, పళ్ళతోబాటు పాలుకూడా తీసుకుంటే నీజుట్టుకు చాలా ఉపయోగంగా ఉంటుంది.

కమల: జుట్టు నెరవకుండా ఆపె బి విటమిను మాటేమిటి?

సుశీల: బియ్యం వండే ముందు మరీ హెచ్చుగా కడగకు. అత్తెసరు పెట్టి వండు. అలాచేస్తే అందులోని బి విటమిను అంతా దక్కుతుంది. గోధుమలు జాస్తిగా తిను. గోధుమ పిండి జల్లెడ పట్టకు. పెరుగూ, మజ్జిగా జాస్తిగా తీసుకో. యీస్ట్ టాబ్లెట్లుకూడా మంచివే.

కమల: లోగడ జబ్బుచేసి నయమైనప్పుడల్లా జుట్టు తెగ ఊడేది. ఇప్పుడంత అన్యాయంలేదు.

సుశీల: అన్నిరకాల అంటువ్యాధులూ తల మీది చర్మానికి పోషణ తగ్గిస్తాయి. సహజంగా జుట్టు రాలుతుంది. కనుక, తాజాపళ్ళూ, కూరలూ, కొన్ని పచ్చివిగా కూడానూ, తింటే, వాటిలో పుష్కలంగా ఉండే విటమినులు నీలో రోగ నిరోధక శక్తిని పెంచుతాయి. ఆ విధంగా నువ్వు జుట్టు రాలకుండా ఆపవచ్చు.

కమల: మనం బజార్లో కొనే షాంపూలంటే మా అమ్మకు మంట. ఆవిడ పిల్లల తలలకు కోడిగుడ్డు సొన పట్టించి, శీకాయిపొడితో రుద్దేది.

సుశీల: వారానికి ఒకసారి వాడితే నష్టం ఏమీలేదు.

కమల: శీకాయి కాయలతో ఇన్నిమెంతులూ, పచ్చిబియ్యమూ చేర్చి మరీ పట్టించి శీకాయిపొడి చేస్తారు. శీకాయి తలకు ఉండే జిడ్డును చాలా చక్కగా తీసేస్తుంది. మెంతులలో చేదు ఉంటుంది చూడూ, అందుకని పేలు చేరవు. అది జిగురుగాకూడా ఉండి వెంట్రుకలను చీలకుండా ఆపుతుంది. పచ్చిబియ్యం పిండి నా వెంట్రుకల లాంటి పలచటి వాటిని గరగరలాడేలాగ చేస్తుంది.

సుశీల: ఇవాళ తలకు పోసుకున్నావా?

కమల: అవును.

సుశీల: అలా అయితే నీ వెంట్రుకలు కేశాలంకరణకు చాలా అనువుగా ఉంటాయి.

కమల: మరీ మంచిది. నా తలలో "బన్" పెట్టి, "నెట్" చుట్టటం తప్ప ఇంక చేసేదేమీ లేదేమో ననుకున్నాను.

సుశీల: ఇవాళ తలకు కోడిగుడ్డు సొన వాడావా?

కమల: అవును. జుట్టు బాగుండాలని ఎన్ని చెయ్యాలో అన్నీ చేశాను. వెంట్రుకలు విడదీసి, తల అంతటా కుదుళ్ళను కోడిగుడ్డు సొన పట్టించాను. తరవాత శీకాయిపొడితో తల రుద్దుకున్నాను.

సుశీల: మరి జుట్టు నిగనిగలాడుతున్నదంటే ఆడకేం జేస్తుందీ?

కమల: పేలు వదిలించుకోవటానికి ఏదన్నా మార్గం ఉందా? నా కూతురు ప్రతి సోమవారం ఉదయమూ జుట్టు శుభ్రంగా పెట్టుకుని స్కూలుకు వెళుతుంది. వారాంతంలో దాని తల నిండా పేలుంటాయి. ఆ తల శుభ్రం చెయ్యలేక సతమత మవుతున్నాను.

సుశీల: కొంతమంది అందుకు కిరసనాయిలు ఉపయోగిస్తారు. రాత్రి పూట తలలోకి ఇంకేలాగా కిరసనాయిలు రుద్దాలి. కిరసనాయిలూ, డీడీటీ కలిపి, ఫ్లిట్ పంపుతో తల అంతా కొట్టవచ్చు. అయితే పక్కా, దిండూ పాడవకుండా తలకు గుడ్డ చుట్టుకోవాలి. ఫ్లిట్ చేసేటప్పుడు అది ముఖానికీ, కళ్ళకూ తగలకుండా చూడాలి. తిరిగి ఉదయం నిద్ర లేవగానే పిల్లను స్నానం చేయించాలి. పేలూ, ఈళ్ళూ చస్తాయి. చచ్చిన పేలు గుడ్డ మీద పడిపోతాయిగాని, ఈళ్లు అంటుకునే ఉంటాయి. వాటిని ఒకటొకటిగా తీయాలి.

కమల: ఈసారి అలా చేసి, ఏమైనా ఉపయోగం ఉంటుందేమో చూస్తాను. మరి....నా కేశాలంకరణ ముగిసినట్టేనా?

సుశీల: ఒక్క క్షణం కదలకు. ఈ కాసిని పిన్నులూ గుచ్చనీ. అమ్మయ్య: ఎలా ఉంది?

కమల: చాలా అద్భుతంగా ఉంది, థాంక్ యూ. జుట్టు నిజంగా అందంగా ఉంది సుమా.

సుశీల: మల్లెదండ చుట్టావంటే ఆకర్షణీయంగా కనిపిస్తావు.

కమల: నీ సలహాలకూ, సహకారానికీ ధన్యవాదాలు.

సుశీల: నీ కెప్పుడూ వాటి లోటుండదు. వెళ్ళిరా.

ఒక వంటకం:

గోరు చిక్కుళ్ళతోనూ, రొయ్యలతో నూ వంటకం. ఇది చెయ్యడానికి కడిగి, తరిగిన గోరు చిక్కుడు ముక్కలు రెండు కప్పులూ, శుభ్రం చేసిన చిన్న రొయ్యలు అర కప్పూ, ఒక ఉల్లిగడ్డా, కొబ్బరి కోరు పెద్ద చంచాడూ, అర చంచాడు కారమూ, చిటికెడు పసుపూ, ఆవాలూ, మినప్పప్పూ, అయిదు వెల్లుల్లి పిలకలు నూరిన పిండి అర చంచాడూ కావాలి.

రెండు చంచాల నూనెను బాణల్లో కాచి అందులో ఆవాలూ, మినప్పప్పూ, తరిగిన ఉల్లిగడ్డా వెయ్యాలి. ఉల్లి ముక్కలు వేగినదాకా కలియబెట్టి రొయ్యలూ, మిరపకాయలూ, పసుపూ, వెల్లుల్లి ముద్దా వెయ్యాలి. బాణలి నుంచి కమ్మని వాసన రావటం ఆరంభం కాగానే గోరు చిక్కుడు ముక్కలూ, ఉప్పూ వెయ్యాలి. బాణలి బాగా కలియబెట్టి, అర కప్పు వేడి నీరు పొయ్యాలి. తరవాత మూతపెట్టి చిక్కుళ్ళు ఉడకనియ్యాలి. రొయ్యలూ, చిక్కుళ్ళూ ఉడికి నీరు ఇగిరినాక, కొబ్బరికోరు అందులో వేసి, పొయ్యి మీద నుంచి దించాలి. ఇది చాలా రుచిగా ఉండి, చపాతీలతో గాని, అన్నంతోగాని తినటానికి వీలుగా ఉంటుంది.

శాకాహారులు ఇదే వంటకాన్ని అచ్చగా గోరు చిక్కుళ్ళతోనే చేసుకోవచ్చు. రొయ్యలూ, వెల్లుల్లీ లేకపోయినా ఈ వంటకం అంత రుచిగానూ ఉంటుంది.

గోరు చిక్కుళ్ళు ఉడికించిన నీరు పైత్య వాతమని కొందరు అనే మాట విని ఆ నీరు పారబోయవద్దు. కాల్షియమూ, ఇతర ఆరోగ్యకరమైన లవణాలూ అందులోనే ఉంటాయి.

—సుశీలా జయకరన్

'చట్నీ' అంటే 'పచ్చడి'. పచ్చడి అన్న మన మాటకంటె. 'చట్నీ' అన్న హిందీ మాట అందంగా వుండడంచేత కాబోలు—ఆమాటనే మనమూ ఎక్కువగా వాడుతున్నాము. మనవాళ్ళు 'పచ్చడి మెతుకులు' అన్నారు. అంటే, కాస్త పచ్చడి వుంటే చాలు—కంచండు అన్నం వెళ్ళిపోతుంది. కారణం ఏమిటంటే—కూరకంటె పచ్చడి

వంటలు:

చట్నీలు



రుచి ఎక్కువ. ఇడ్లీకీ, దోసెకీ రుచి తీసుకొచ్చేది చట్నీయేగా!

చట్నీలు రకరకాలు. అయితే, చేసుకునే విధానంలో కొన్ని మార్పులు కనిపిస్తూ వుంటాయి. మామూలుగా మనం ఇళ్ళలో బీరకాయతో పచ్చడి చేసుకుంటాము. అది తెలిసినదే. కాని, దాన్నే ఇంకోరకంగా చేసుకుంటే ఎలా వుంటుంది? అందుకనే ఆ రకం గురించి చెప్పడం. నిజానికి ఇది బీరకాయ పెరుగు పచ్చడి అన్నమాట.

ఈ బీరకాయ చట్నీలోని కొత్తవిధానం ఏమిటి?-దీనికేం కావాలి?

బీరకాయ చట్నీ:

మూడు బీరకాయలు, ఒక కప్పుడు తురిమిన కొబ్బరి, చేరెడు సెనగపప్పు (వేయించినది) నాలుగు పచ్చిమిరపకాయలు, కాస్త ఉప్పు, రెండు ఉల్లిపాయలు, ఒక కప్పు పుల్లని పెరుగు–దీనికి కావలసినవి.

ముందుగా, బీరకాయలకు తొక్క తీసేయాలి. వాటిని కుక్కర్లో పెట్టినట్టుగా పొయ్యిమీద పెట్టి, ఆవిరిమీద ఉడికిస్తే మెత్తబడిపోతాయి. అప్పుడు, నీరంతా పిండేసి–ముద్దని మాత్రం తీసి పక్కన వుంచాలి. కొబ్బరికోరు, పచ్చిమిరపకాయలు, సెనగపప్పు, కలిపి-ముద్దగా నూరాలి. ఆ ముద్దలో, బీరకాయ ముద్దకూడా పడేసి, మళ్ళీ ముద్దగా నూరేయాలి. అన్ని బాగా కలిపి, ముద్దలా అయిపోగానే, తీసేసి, పెరుగులో కలిపేసి, సన్నగా తరిగిన ఉల్లిపాయ ముక్కలుకూడా పడేసి కలపాలి. ఈ చట్నీ అన్నంలోకీ, దోసెల్లోకీ బావుంటుంది.

ఉల్లి చట్నీ:

నాలుగు పెద్దసైజు ఉల్లిపాయలు, ఒకటిన్నర కప్పు తురిమిన కొబ్బరి, ఆరు ఎండు మిరపకాయలు, కావలసినంత ఉప్పు, కాస్త బెల్లం, పెద్దస్పూను నెయ్యి, కాసిన్ని ఆవాలు, కరివేపాకు–ఈ చట్నీ చెయ్యడానికి కావలసినవి.

ఇవన్నీ ఏర్పాటు చేసుకున్నాక, రెండు ఉల్లిపాయల్ని ముక్కలుగా తరిగి ఎర్రగా వేయించాలి. తక్కిన రెండింటినీ కూడా ఇంకా చిన్న ముక్కలుగా తరిగి ఓ పక్క వుంచుకోవాలి. కొబ్బరికోరు, వేయించిన ఉల్లిముక్కలు, మిరపకాయలు, బెల్లం, ఉప్పు-అన్నిటినీ కలిపి మెత్తగా ముద్దలా నూరాలి. ముద్ద అయిపోయేముందు, పచ్చి ఉల్లిపాయ ముక్కల్ని కూడా అందులో పడేసి, మరి కాసేపు నూరి తీసేయ్యాలి.

ఒక బాణలిలో నెయ్యి వేసి, నెయ్యి మరిగిన తర్వాత ఆవాలు వేసి, అవి పేలుతూ వుండగానే ఈ ముద్దకూడా పడేసి కాస్త ఎర్రరంగు వచ్చే వరకూ వేయించి, దింపేయాలి. దింపేసే ముందు కరివేపాకు పడేస్తేచాలు. ఈ చట్నీ ఇడ్లీలోకీ, దోసెల్లోకీ బావుంటుంది.

పోతే—

మరో రెండు చట్నీల గురించి కూడా తెలుసుకుందాము.

పొదీనా చట్నీ:

కొంతమంది పొదీనా ఆకు వాసన బాగుండదని తినరుగాని, పొదీనా రుచిగానూ వుంటుంది; ఒంటికీ మంచిది. దీంతో కూడా రకరకాలుగా చట్నీలు చేస్తారు. ఈ రకం ఎలా అంటే—

ముందుగా ఒక పెద్ద కట్ట పొదీనా ఆకు, నాలుగు చిన్న కట్టలు కొత్తిమెర, పెద్ద అల్లం ముక్క, ఒక వెల్లుల్లిపాయ, 50 గ్రాములు వేయించిన సెనగపప్పు, 10, 12 పచ్చిమిరపకాయలూ తగినంత ఉప్పు, రెండు పెద్దసైజు నిమ్మపళ్ళు, 1½ పెద్ద స్పూన్ల పంచదార-ఏర్పాటు చేసుకోవాలి.

పొదీనా, కొత్తమెరా బాగా కడిగేసి, ఆకులు విడిగా ఏరెయ్యాలి. అల్లం, వెల్లుల్లి, పచ్చిమిరపకాయలు, సెనగపప్పు, ఉప్పు, ఈ ఆకులూ కలిపి, మెత్తగా రుబ్బాలి. మెత్తబడిన తర్వాత, నిమ్మకాయరసం, పంచదారా కలపాలి. ఈ చట్నీ ముఖ్యంగా ఉత్తరాది హోటల్సులో సొమసా తో ఇస్తారు. ఈ చట్నీ పూరీ, ఇడ్లీ, దోసె–అన్నిటితోనూ తిన్నా బాగానే వుంటుంది–చేసి చూడండి! (పంచదార అక్కర్లేదనుకున్నవారు మానెయ్యవచ్చును.)

బొప్పాయి చట్నీ:

బొప్పాయితో కూర చేసుకున్నట్టే పచ్చడి కూడా చేసుకుంటాము. వంగదేశంలో – వాళ్ళొక విధానంలో ఈ పచ్చడి చేసుకుంటారు. ఇది – 'ఫ్రిజ్'లో పెడితే-[illegible]లు కూడా వుంటుంది.

ఒక బొప్పాయికాయ-(మధ్యసైజులో వుండేది) 100 గ్రా. లు చింతపండు, 50 గ్రా. బెల్లం, అల్లం ముక్క, నాలుగైదు పచ్చిమిరపకాయలు, కాసిన్ని ఆవాలు, చిన్న ఇంగువముక్క, చిటికెడు పసుపుపొడి, కాస్త నూనె – దీనికి కావలసినవి.

బొప్పాయికాయను ముందుగా చిన్నచిన్న ముక్కలుగా కోసి, కుక్కర్‌లో వేసి ఉడికించాలి. (అంటే ఆవిరి మీద అన్నమాట) మెత్తబడిన తర్వాత, ఒక గుడ్డ మీద వేసి ఆరబెట్టాలి. చింతపండు కాసిన్ని నీళ్ళలో నానబెట్టి, రసం తియ్యాలి. దాంట్లో బెల్లం కూడా కలిపేసి, అలా ఉంచాలి.

అల్లం, పచ్చిమిరపకాయలూ చిన్న ముక్కలుగా తరిగి ఉంచుకోవాలి. ఇంగువ, ఆవాలు నూనెలో వేసి, వేచాలి. వేగుతూ వుండగా అల్లం, పచ్చిమిరపకాయ ముక్కలూ, బొప్పాయి ముక్కలూ, పసుపుపొడి, అన్నీ పడెయ్యాలి. కాస్సేపు కలిపి, చింతపండు, బెల్లం కలిసిన మగ్గు పడెయ్యాలి. ఒక పదినిమిషాల పాటు ఉడకనిచ్చి, దింపెయ్యాలి. ఈ చట్నీ అన్నంలో కలుపుకోడానికీ, టిఫిన్లకీ కూడా బావుంటుంది. □

మీ భవిష్యత్తు అదృష్టకరమైనదా ?



ఈ ప్రశ్న జ్యోతిష్కుడ్ని అడక్కండి
ఐఓబిని అడగండి. మీరు ప్రతిమాసం అయిదు రూపాయలుగాని లేక అయిదువందల రూపాయలు గాని పొదుపుచేయగల్గితే దాన్ని అనేక రెట్లు పెంచి మిమ్మల్ని గొప్ప అదృష్టవంతులుగా మార్చే ప్రణాళిక లెన్నో మా దగ్గరున్నాయి.

ఏ సందర్భానికైనా సులువుగా కావలసిన పెద్ద మొత్తాల్ని అందజేయడానికి అనుగుణ్యంగా ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు ఎన్నో ప్రణాళికల్ని రూపొందించింది. వాటిలో ఇవి కొన్ని.

రీ ఇన్వెస్ట్‌మెంట్ డిపాజిట్ ప్లాను
ఇది మీ పెట్టుబడిని నిర్ణీత వ్యవధిలో అనేక రెట్లు పెంచుతుంది.

ఆటోమేటిక్ క్యుములేటివ్ వెడ్డింగ్ డిపాజిట్టు
మీ పిల్లల వివాహానికి కావలసిన డబ్బు పొదుపు చేసేందుకు యిది సులభ మార్గం.

రికరింగ్ డిపాజిట్టు
ఈ ప్రణాళిక మీరు ప్రతినెలా పొదుపుచేసే చిన్నచిన్న మొత్తాల్ని కొన్నాళ్ళకు ఒక పెద్ద మొత్తంగా పెంచేందుకు సహాయం చేస్తుంది.

లాంగ్‌టర్మ్ బెనిఫిట్ డిపాజిట్టు
ఈ ప్రణాళికలో మీరు కట్టే ప్రతి మొత్తమూ (అంతకుమించిన సొమ్ము కూడా) వడ్డీతో భద్రంగా మీకు తిరిగి ఇవ్వబడుతుంది.

వీటి వివరాలు మరింకెన్నో ఆకర్షణీయమైన ప్రణాళికల వివరాలు తెలుసుకోవాలంటే మీకు సమీపంలో ఉండే ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంకు శాఖను దర్శించండి. లేక మా అడ్రసుకు వ్రాసి కరపత్రాలు తెప్పించుకోండి. "మీ సొమ్ము అభివృద్ధికి పదునాలుగు మార్గాలు" మీ కందులో లభిస్తాయి.

అవసరమైనంత డబ్బును మాత్రమే నేడు ఖర్చుపెట్టండి. మిగతా సొమ్మంతా మరోనాటికి పొదుపుచెయ్యండి.

PIN CODE FOR FAST MAIL

ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్
మీ ఔన్నత్యాన్ని కోరే ఉత్తమ మిత్రుడు

IOB-1325

విశాలహృదయం

వై. అమృతవల్లి

పెళ్ళిచూపులు కోసం ఏర్పాటు చేసిన గదిలో అతడు, ఆమె మిగిలారు. అంతవరకు ఆ గదిలో ఉన్న పెద్దలందరూ ఏదో ఒక సాకుతో బయటకు జారుకున్నారు. వారిద్దరూ ఆశించిన ఏకాంతం!.... ఒకరి యిష్టాన్ని మరొకరు ప్రత్యక్షంగా తెలుపుకునేందుకు, తెలుసుకునేందుకు అది పెద్దలు కల్పించిన అవకాశం!

సిగ్గుపడుతూ తలవంచుకుని కూర్చున్న వినీల-జడలో విరిసీవిరియని సన్నజాజి మొగ్గలాగే ఉంది. పెళ్ళికూతురి వేషం. ఎలాటివారికైనా అదనపు కళని తెచ్చిపెడుతుంది. అందునా అందమైన వినీల లాంటి అమ్మాయిలసంగతి ఇక చెప్పనవసరం లేదేమో! అరచేతి వెడల్పున జరీ బార్డరున్న ఇటుక రంగు పట్టుచీర, అదే రంగు జాకెట్ వేసుకుని ముత్యాలసెట్టు ధరించిన వినీల దారితప్పి భువికి వచ్చిన మేనకలా ఉంది. గుండె 'గుడుగుడుగుంచం' పాడుతుంటే చేతిలో కర్చిఫ్‌ని మడత సవరిస్తూ మౌనవ్రతం ఆచరిస్తున్న మునికన్యలా నిశ్శబ్దంగా కూర్చుంది. ఇబ్బందిగా కదులుతున్న ఆమె కనురెప్పల్ని, వాటి అంచు మీద సన్నగా గీసిన కాటుక రేఖని, సంపెంగ మొగ్గలాంటి నాసికని, చిగురాకు పెదవుల్ని, చిన్నారి చుబుకం మీద పుట్టుమచ్చని పరీక్షగా చూస్తూ పెదవి కదిపాడు మధుకర్.

'మీరు నచ్చారు. మరి....మీ యిష్టం కూడా చెపితే...' అర్థవంతంగా ఆపి నాజూకుగా ఉన్న ఆమె వ్రేలికి ముద్దుగా అమరిన ముత్యాల ఉంగరం మీదకి దృష్టి మరల్చుకున్నాడు. అలా అయితే ఆమె తనకేసి నిర్భయంగా చూసేందుకు ఇబ్బంది ఉండదని అతడి ఉద్దేశ్యం. కాని వినీల తలని మరికొంచెం క్రిందకి వాల్చిందే తప్ప అతడివైపు చూడలేదు.

'చదువుకున్న మీరలా సిగ్గుపడటం ఏం బాగోలేదు. పైగా....ఉద్యోగం చేస్తున్నారు....!'

మధుకర్ మాటలకి వినీలకి ఒళ్ళు మండింది. చదివి, ఉద్యోగాలు చేస్తున్నంత మాత్రాన సిగ్గు వదిలేయాలని రూలుందా? పెళ్ళిచూపుల్లో సిగ్గు పడక, రోడ్డు మీద, ఆఫీసుల్లో సిగ్గుపడతారేమిటి! అనుకుంది కోపంగా.

‘పోనీలెండి మీకంత బిడియంగా ఉంటే రేపు నా ఫొటో పంపిస్తాను. చూశాక మీ ఉద్దేశం చెప్పండి. అప్పటివరకు నేను కూడా నా నిర్ణయాన్ని ఎవరికీ చెప్పను. ఏమంటారు?’

ఏమంటుంది? గుండెలు వేగంగా స్పందిస్తుంటే మాటలు మరిచిపోయిన దేవకన్యలా కూర్చుండిపోయింది. పాతిక వేలు పెట్టి కొనుక్కుంటుంది కనుక తానే అతడిని ప్రశ్నలు వేసి పరీక్షించి పంపించాలని స్నేహితుల దగ్గర శపథం తీసుకుంది. తీరా..ఇప్పుడేమిటిలా అయిపోతోంది?

‘చూడండీ....కట్నం యిచ్చి కొనుక్కుంటున్నారు కనుక మీరు నాకు నచ్చటం మాట అటుంచి నేను మీకు నచ్చాలన్నదే ముఖ్యం అని మా చెల్లెలి అభిప్రాయం.... ఐ మీన్....నాది కూడా అనుకోండి.’ తన మనసులో అనుకుంటున్నదే అతడి నోటివెంట రావటం విని కంగారు పడింది వినీల. కొంపదీసి .... పరధ్యానంగా ఆ మాటలు పైకి అనేయలేదు కదా!

‘....అందుకనే ఇంతగా మిమ్మల్ని ‘ప్రెస్’ చేసి అడుగుతున్నాను. మరొకలా భావించి కోపం తెచ్చుకోరు కదూ!’

అప్రయత్నంగా [illegible] అడ్డంగా తిప్పింది వినీల.

‘థాంక్స్. ఇకపోతే నా గురించి మిగిలిన వివరాలు .... బహుశా మీ వాళ్ళ ద్వారా వినే ఉంటారు. అయినా స్వయంగా మీకు తెలపటం నా విధి!’

‘పర్వాలేదు. మీమీద ఆమాత్రం నమ్మకం ఉంది’ అందామనుకుంది వినీల. కాని....స్వరం ఇంకా అధీనంలో లేదని గ్రహించి మౌనం వహించింది.

‘ఎమ్. టెక్’ పాసయి అయిదు సంవత్సరాలుగా హెచ్. ఎ. ఎల్. లో టెక్నీషియన్‌గా పని చేస్తున్నాను. మీరు ఉద్యోగం చేయాల్సిన అవసరం లేదు. చేయాలనే నియమం మీకుంటే అభ్యంతరం లేదు!’ అన్నాడు. అతడి మాటల్లో కొంచెం అతిశయం ఉన్నట్లుగా తోచింది వినీలకి.

‘నేను మాట్లాడటమే కాని, మీరు పెదవి కదపనేలేదు.’ అంటూ నవ్వాడు. ‘సరే, మీరు వెళ్ళిపోవచ్చు!’

మధుకర్ ఆమాట అన్నదే తడవుగా చటుక్కున లేచి తడబడుతున్న కాళ్ళతో గదిలోకి వచ్చిపడింది వినీల.

‘ఇంతసేపు ఏం మాట్లాడుకున్నారు?’ స్నేహితురాలి ముఖాన చిరుచెమటని గమనించి ‘ఫాన్’ వేస్తూ అడిగింది సునీత.

‘నేనేం మాట్లాడలేదు.’ మంచంమీద కూర్చుని కర్చీఫ్‌తో ముఖం తుడుచుకుంటూ అంది వినీల.

‘అంటే....‘ఛాన్స్’ అతనికే వదిలేశావన్న మాట!’

‘పోవే! ముక్కుముఖం తెలినివాడితో ఏం మాట్లాడాలి?’ అంది చిరుకోపం నటిస్తూ.

‘అఘోరించావులే. ఈ ప్రశ్న అప్పుడే వేస్తే ప్రశ్నలు....జవాబుల పత్రం తయారుచేసి కంఠతా చేయించే వాళ్ళం. ఊఁ....ఇంతకీ ఆ మహానుభావుడి ఉపన్యాసమైనా సరిగ్గా విన్నావా?’

‘ఏమోనే, నాకు జ్ఞాపకం లేదు.’ తప్పించుకోబోయింది వినీల.

‘ఈ మతిమరుపు సంగతికూడా ముందే చెప్పిఏడిస్తే ‘టేప్‌రికార్డర్’ పెట్టేవాళ్ళం. ఛ....ప్లానంతా ఫెయిలైపోయింది.’ నీరసంగా కుర్చీలో కూలబడింది సునీత.

‘పోనీలే. నీకూ రేపోమాపో ఇలాటి ‘ఛాన్స్’ రాకపోదు. అప్పుడు చూపించు నీ ప్రతాపం.’

‘చూస్తావుగా!’ నవ్వి, పనిపిల్ల తెచ్చిన కాఫీ కప్పులు అందుకుంది సునీత.

‘అలసిపోయావు కానీ, కాఫీ సేవించు!’ స్నేహితురాలి మాటలకి తేలిగ్గా నవ్వింది వినీల. పెళ్ళివారటు వెళ్ళగానే ‘మళ్ళీ శుభలేఖలో ‘లగ్నం’ చూసుకుని వస్తా’ అంటూ తానుకూడా ఇంటికి బయల్దేరింది సునీత.

*

వీధిలో పూలమ్మేవాడి కేకవిని గబగబా వరండాలోకి వెళ్ళింది వినీల. అప్పుడే గేటులోంచి వస్తున్న పోస్టుమాన్ చిర్నవ్వుతో “మీకేనమ్మా” అంటూ నీలిరంగు కవరొకటి ఇచ్చి వెళ్ళిపోయాడు. గుండె ఝల్లుమంటుంటే మధుకర్ మాటలు జ్ఞాపకం చేసుకుంటూ కంగారుగా గదిలోకి పరుగెత్తింది.

‘అమ్మా... మీరేనా పిలిచింది?’ గేటు దగ్గర్నుంచి పూలమ్మేవాడి కేక దూసుకు వచ్చింది. తలుపులు చేరవేసి కవరు చింపబోతున్న వినీల చిరాగ్గా దాన్ని దిండుక్రింద పెట్టి వరండాలోకి వెళ్ళింది. తట్ట దింపుకుని మల్లెమొగ్గలు లెక్కపెట్టి ఆమె పైటకొంగులో వేశాడు. రోజూలాగా వాటిల్లో మంచివి కానివి ఏరలేదు వినీల. డబ్బులిచ్చేసి వంటింట్లోకి వెళ్ళి పూలు గిన్నెలో వేసి తిరిగి వస్తూ బామ్మ, తల్లి – ఏ స్థితిలో ఉన్నారో గమనించింది. పూజగది బయట వసారాలో మంచంమీద వాలి భారతం దీక్షగా చదువుకుంటోంది బామ్మ. తల్లి మంచానికి కొంచెం దూరంలో కూర్చుని పత్రిక తిరగేస్తోంది. తేలిగ్గా నిట్టూర్చి నిశ్చింతగా మంచంమీద పడుకుని ఉత్తరం చదవటంలో లీనమైంది వినీల.

గులాబీరంగు కాగితం మడతలు విప్పుతుంటే ఫోటోజారి గుండెలమీద పడింది. క్షణంసేపు ఫొటోకేసి చూసింది. గార్డెన్‌లో కాబోలు.... కుర్చీలో కూర్చుని పుస్తకం చూస్తూ తీయించుకున్నాడు. నిలువుచారల ఫుల్‌హాండ్స్ షర్టు, డార్క్ కలర్ పాంట్ అతడి పర్సనాల్టీకి హుందాతనాన్ని తెచ్చిపెట్టాయి. నవ్వుతూ ఆగినట్టున్న పెదవులు, పలకరించే చూపులు ముఖంలో చిర్నవ్వు ఛాయలు.....అందంగా ఉన్నాడనిపిస్తున్నాడు.

‘అయినా’ మగవాడికి అందమేమిటి? నీటైన వ్యక్తిత్వమే నిజమైన సౌందర్యం. అదే ముఖ్యం- ఆడది సుఖపడాలంటే. కానీ, తనకి పరిచయమైంది బాహ్యరూపం ఒక్కటే. అతడి వ్యక్తిత్వం ఎలాటిదో మరి, అనుకుంటూ ఫొటో ప్రక్కన పెట్టి ఉత్తరంలోకి చూసింది.

వినీలగార్కి :

ఇప్పుడు చెప్పండి. నేను మీకు నచ్చానా? మీ దగ్గర్నుంచి ఎలాంటి జవాబు రాకపోతే నచ్చలేదనే భావిస్తాను.

ఇకపోతే....ఒకరి నొకరు యిష్టపడ్డాక కట్నం ముఖ్యం కాదు. మీరే నాక్కావాల్సిన విలువైన కట్నం. కట్నం తీసుకోనని వేదికలెక్కి ప్రమాణాలు చేయలేదు...కానీ, నా మనసులో చేసుకున్న నిర్ణయం అదే! ఈ సంగతే మా వాళ్ళు నేరుగా మీ వాళ్ళకి చెపుతారనుకుంటాను.

ఇంకా ఎంతో వ్రాయాలని ఉంది. కాని.... సమయం రావాలి. సందర్భం కుదరాలి. అందుకే ఇంతటితో ముగిస్తున్నాను. జవాబు వ్రాస్తారుకదూ?

—మధుకర్

అతడు వ్రాసిన దాంట్లో అర్థం కానిదేమీ లేకపోయినా పదేపదే చదువుకుంది వినీల. జవాబు వ్రాయాలని కూర్చునేసరికి కలం పెట్టిన చోటే ఆగిపోయింది. అంతటితో ఆ ప్రయత్నాన్ని

మర్నాటికి వాయిదా వేసుకుని ఆలోచనలో పడింది.

మూడవ నాటికి జవాబు అందుకున్న మధుకర్ సంతృప్తిగా నవ్వుకున్నాడు. ముద్దులొలికే అక్షరాలతో ముచ్చటగా మూడే లైన్లు ఉన్న ఆ ఉత్తరాన్ని మళ్ళీ మళ్ళీ చదువుకున్నాడు.

శ్రీ మధుకర్‌గారికి :

నా జాబు మీ ప్రశ్నకి జబాబుగా తీసుకుంటానంటే నాకు అభ్యంతరం లేదు. కళ్ళకి కనిపించేది మనిషి, కనుపించనిది మనసు. అయినా ఇది పెద్దలు చేస్తున్న పెళ్ళి కనుక ఒకరి మనసు ఒకరు తెల్సుకునేందుకు అవకాశం లేదు మరి!

—వినీల

ఆ రోజే తన నిర్ణయాన్ని తలిదండ్రులకు తెలిపాడు మధుకర్. ఆ వెంటనే పెద్దలు సమావేశమై, లగ్నాలు నిర్ణయించారు. పెళ్ళి పనులు చురుగ్గా సాగిపోతున్నాయి. చూస్తుండగానే వారం రోజుల్లోకి వచ్చేసింది పెళ్ళి.

సునీతని వెంట తీసుకుని వెళ్ళి చీరలు కొనుక్కుంది వినీల. ఆ రోజుకి ఆమెను బలవంతంగా ఇంట్లో ఉంచేసుకుంది. మధ్యాహ్నం ఇద్దరూ హాల్లో చాప పరుచుకుని శుభలేఖలమీద అడ్రస్‌లు వ్రాస్తూ కూర్చున్నారు. పోస్టుమాన్ కేక విని లేచి వెళ్ళింది సునీత. కవరు తెచ్చి 'నీకే' అంటూ వినీల ఒళ్ళో పడేసింది. పైన అడ్రస్ చూసింది వినీల. ఆ దస్తూరి ఎవరిదో వెంటనే గుర్తు పట్టింది. దడదడ లాతున్న గుండెల్ని సర్దుకుంటూ కవరు చింపింది. శుభలేఖతోపాటు, నాలుగు మడతల నీలిరంగు కాగితం కూడా ఉంది.

డియర్ నీలూ,

ఇదే నా పెండ్లి పిలుపు. పెళ్ళి కూతురివై పచ్చని పందిట్లో కల్సుకుంటావుకదూ?

నీ వన్నట్లుగా, నిజంగానే ఒకరి మనసు లొకరు తెల్సుకునేందుకు మనకి అవకాశం లేదు. మనసొకరితో మనువొకరితో జరగటం ఈ రోజుల్లో 'సహజం' అయిపోయింది. కానీ.... నా దృష్టిలో అది అన్యాయం.

నా ప్రాణస్నేహితుడు శేఖర్ నిన్ననే వైజాగ్ నుండి వచ్చాడు. మా యిద్దరి మధ్య ఎలాటి రహస్యాలు, తెరలు ఉండవు. అతడు కోరకముందే నీ ఫొటో చూపించాను. చూచి 'ఇది రెండవసారి ఈమెని చూడటం' అన్నాడు. మొదటిసారిగా రెండు సంవత్సరాల క్రితం పనిమీద హైద్రాబాద్ వెళ్తే ఒక హోటల్లో తన ప్రక్క-

తాము వూళ్ళోగాని, ఇంట్లోగాని లేనప్పుడు, తమ భార్యలు 'చెడ్డ తిరుగుళ్ళు' తిరుగుతారేమోనని-పూర్వం రోజుల్లో (కొన్ని దేశాల్లో) ఇనపకచ్చడాలు (చేస్టిటీ బెల్ట్)నడుముకు బిగించి, తాళం వేసేసి, వెళ్ళిపోయేవారు. ఈ 'బెల్ట్' 'శీలరక్షణి' అన్నమాట!....రామ రామ ఈ విధానం తగ్గిపోయిందనుకోవటం పొరపాటు అని — ఈజిప్ట్‌లోని ఒక భర్తగారు—ఈ మధ్యనే ఋజువు చేశాడు. అతను వ్యాపారరీత్యా కువైట్, లిబియా దేశాలు తిరుగుతూ ఉంటాడు. అలాంటప్పుడు, భార్యకు 'శీలరక్షణి' వేసేస్తాడన్నమాట. తాను లేనప్పుడు తన భార్య 'రక్షణి'ని తొలగించేసి, తన 'కజిన్'తో వ్యవహారం నడుపుతున్నదని అనుమానం వచ్చి-అతను ఆ 'కజిన్'ను హత్య చేశాడు! కువైట్ పోలీసులు అతన్ని అరెస్ట్ చేసి, ఈజిప్ట్ పంపించారు. ఇలాంటి నేరమే అతను ఇదివరలో కూడా చేశాడు; అయితే సాక్ష్యాధారాలు సరిగా లభించకపోవడంచేత, అప్పుడు విడిచిపెట్టేశారు.

"నా భర్త నన్ను వేల మీదికి తోసేసి, బలవంతంగా ఈ బెల్ట్ బిగించేసి వెళ్ళిపోతాడు. కదలడానికి కూడా నాకు చాలా బాధగా వుందని, ఆ బెల్ట్ తీసేయమనీ ఎన్నిసార్లో ప్రార్థించాను" అని అతని భార్య పోలీసులకు చెప్పింది!

రూమ్‌లో ఓ యువకుడితో చూచానని ఇద్దరూ కల్సి సరదాగా తిరిగే వారనీ చెప్పాడు. నిజమేదైనా నిన్ను చేసుకోటానికి ఎలాంటి అభ్యంతరం లేదు నాకు. ప్రతి మనిషి గతంలోనూ ఏవో కొన్ని లోటుపాట్లు ఉంటూనే ఉంటాయి. అన్నీ పట్టించుకోవటమే పనిగా పెట్టుకుంటే జీవితంలో సుఖశాంతులు మిగలవు. కనుక ఆ విషయాన్ని ఇంతటితో మర్చిపోయి..ఎప్పటిలాగే నిన్ను నా జీవితంలోకి ఆహ్వానించడానికి సిద్ధంగా ఉన్నాను. ఇంక ఉండనా మరి; ఆశీస్సులతో—మధుకర్.

*

శ్రీ మధుకర్ గార్కి :—

మీ విశాల హృదయానికి నా జోహార్లు. కాని ఆ విశాలతని అర్థం చేసుకునే శక్తి నాకు లేదు. అలాంటప్పుడు ఈ పెళ్ళి జరగకపోవటమే మంచిది. ఒకరి నొకరు అర్థం చేసుకోగలిగితేనే జీవితం సుఖమయం అయ్యేది. మీ విశాల హృదయాన్ని చాటుకోటానికి మీరు చేస్తున్న త్యాగాన్ని సహించలేను.

ఇక పోతే మీరు విన్న దాంట్లో నిజం ఇది. హోటల్లో నాతోపాటు ఉ[illegible]వ్యక్తి మా పెద్దమ్మ కొడుకు సతీష్. ఉద్యోగం రాకముందు ఓ బ్యాంక్ ఇంటర్వ్యూకి వెళ్ళినప్పుడు నాకు తోడుగా వచ్చాడు. బంధువులెవరూ లేకపోవటం వలన హోటల్లో బస చేశాం. ఎలాగూ అంత దూరం వెళ్ళాం కదా అని నాలుగు రోజులపాటు ఉండి ఊరంతా తిరిగి చూశాం.

ఆడది ఓ మగాడితో కనిపించిందీ అంటే అతడెవరైనాకానీ ఆమె ప్రియుడేనని అభిప్రాయపడే మనుషులు మన 'సొసైటీ'లో చాలామంది ఉన్నారు. 'నిజం' ఏమిటో నన్ను అడగకుండానే మీ అభిప్రాయం మీరు చెప్పారు. నా అభిపా్రయం ఏమిటో పైన చెప్పాను. ఆడది తొందర పడినా, అపోహపడినా గెల్చుకుపోయే నేర్పు, అవకాశం మగ వాడికి ఉంటాయి. కాని, మగవాడిలో ఆ తొందరపాటు భావనలు ఒకేసారి 'స్త్రీ' జీవితాన్నే బలి తీసుకుంటాయి. అందుకని తెల్సి, తెల్సి జీవితాన్ని నరకం చేసుకోలేను

ఇంక సెలవు

వినీల.

తిరుగు టపాలో ఆమె దగ్గర్నుంచి వచ్చిన జవాబు చదువుకుని మధుకర్ లోని విశాల హృదయం బిత్తర పోయింది!

*

కుట్టుపని: అభ్యాసం

వనిత - ఉషా కుట్టుపని బడి

[కుట్టుమెషీన్లు తయారు చేసే ప్రసిద్ధ సంస్థ 'ఉషా' వారి సౌజన్యంతో]

స్లీపింగ్ సూట్

38-వ పాఠం

కొలతలు: బుష్ షర్ట్ పొడవు 28", మెడ 15", ఛాతీ 36", సీటు 38", పూర్తి షోల్డర్ 18", చెయ్యి 23", పైజమా పొడవు 40½", బాటమ్ 20".

వర్కింగ్ స్కేల్ : ⅓ సీట్ + 6" = 18½".

భాగం-ఎ (పైజమా)

ఎ బి-అనే నిర్మాణరేఖను గీసి, దాని మీద ఒకచోట O-అనే బిందువును గుర్తించండి.

1–0 2" టర్నింగ్ కోసం.

2–1 పైజమా పొడవు.

3–2 2" టర్నింగుకుగాను.

4–1 ⅓ వర్కింగ్ స్కేల్.

బిందువులు 0, 1, 2, 3, 4 నించి అడ్డంగా చదరపు గీత.

5–4 ⅛ సీట్ + 1½".

6–5 ⅙ వర్కింగ్ స్కేల్; బిందువు 6 నుంచి 7 వరకు పైకి చదరపు గీత; 7 నుంచి 5కి మధ్య ఫ్రంట్ సీము యొక్క షేప్ తియ్యాలి.

8–5 1".

9–2 ½ బాటమ్ తగ్గింపు ½"; 8, 9 కలపాలి.

10–3 (9-2) + ¼"కు సమానం; బిందువు 9 ద్వారా 5 నుంచి 10కి కాలి షేప్ తియ్యండి.

బ్యాక్‌కు ఈ మార్పులు చెయ్యండి :

11–7 1"; 5, 11 కలిపి, పైకి పొడిగించండి.

12–11 1"; 12, 0 కలపండి.

13–5 } 2"; డ్రాఫ్టులో చూపినట్టుగా బిందువు
14–9 } 14 ద్వారా 13 నుంచి 15కి కాలి
15–10 } వెనక షేప్ తియ్యండి.

ఈ పైజమాకి ప్రక్కల్ని సీములు లేవు, కాబట్టి కత్తిరించేటప్పుడు దీన్ని బట్ట మడత పైనే ఉంచాలి.

ప్రక్కసీమ్ మీద ఫ్రంట్-బ్యాక్ రెండింటి పైనా సీమ్ అలవెన్సు వదలాలి.

భాగం-బి (బుష్ షర్ట్)

వర్కింగ్ స్కేల్ : ½ చెస్ట్ = 18".

సి డి-అనే నిర్మాణరేఖను గీసి, దాని మీద ఒకచోట O-అనే బిందువును గుర్తించండి.

1–0 బుష్ షర్ట్ యొక్క పొడవు.

2–1 1½" టర్నింగుకుగాను.

3–0 ½ వర్కింగ్ స్కేల్.

బిందువులు 0, 1, 2, 3 నుంచి అడ్డంగా చదరపు గీత.

4–0 ½ షోల్డర్ + ⅜"; బిందువు 4 నుంచి క్రిందికి చదరపు గీత.

5–0 ⅙ మెడ; బిందువు 5 నుంచి పైకి చదరపు గీత.

6–5 1½"; 6 నుంచి 0కి బ్యాక్‌నెక్ షేప్ తియ్యండి.

7–4 ¾"; 7, 6 కలపాలి.

8–3 ¼ చెస్ట్ + 2½"; డ్రాఫ్టులో చూపినట్టుగా 7 నుంచి 8కి బ్యాక్‌సై యొక్క షేప్ తియ్యాలి – (బయటి షేపు).

9–1 (8-3) తగ్గింపు ½"కు సమానం; 9, 8 కలపాలి (షోల్డరు లేని వీపు).

10–2 (9-1) + ¼"కు సమానం.



ఫ్రంటుకు ఈ మార్పులు చెయ్యండి :

11–0 బొత్తాం పట్టీకోసం; 11 నుంచి క్రిందికి చదరపు గీత.

12–11 ⅙ మెడ; డ్రాఫ్టులో లాగా 5 నుంచి 12కి ఫ్రంట్ నెక్ యొక్క షేప్ తియ్యండి.

13–4 1½"; 13, 5 కలపాలి; డ్రాఫ్టులో చూపినట్టుగా ఫ్రంట్‌సై షేపు తియ్యండి (లోపలి షేప్). కావలసినట్టుగా చెస్ట్‌లైను పైన ఒకటి లేక రెండు జేబులు కుట్టండి. మెడకు ఓపెన్ కాలరు కుట్టాలి. షర్టుకి సంబంధించిన డ్రాఫ్టులో కాలర్ బొమ్మ చూడండి.

స్లీవ్ (చెయ్యి)

ఇ ఎఫ్-అనే నిర్మాణరేఖను గీసి, దాని మీద ఒకచోట O-అనే బిందువును గుర్తించండి.

1–0 స్లీవ్ పొడవు + 1" (కఫ్ మీద మడత కోసం ½" అదనంగా చేర్చబడింది). బిందువులు 0, 1 నుంచి పైకి చదరపు గీత.

2–0 ½ వర్కింగ్ స్కేల్; బిందువు 2 నుంచి అడ్డంగా చదరపు గీత.

3–2 ¼ వర్కింగ్ స్కేల్ తగ్గింపు ½"; స్లీవ్ టాప్ సీముయొక్క షేప్ తియ్యండి (ఎదురు వేపు మరి కొంచెం ఎక్కువ వంపుతో).

4–1 ⅓ వర్కింగ్ స్కేల్, లేదా ఇష్టాను సారంగా; 4, 3 కలపండి.

స్లీపింగ్ సూట్‌ను కాటన్ నైట్ సూటింగ్ తోను, ప్లెయిన్ రంగు పాప్లిన్‌తోను కూడా తయారుచేస్తారు. ధరించేవారి అభిరుచిని బట్టి స్టయిల్ బాణీలు మారుతూ వుంటాయి.

బట్ట అంచనా :

గుడ్డ పన్నా కనీసం 30" అయినా వున్నప్పుడు (2 పొడవులు + 2 స్లీవ్ పొడవులు + 2 పైజమా పొడవులు + 18").

జవహర్ జాకెట్

39-వ పాఠం

కొలతలు: పొడవు 25", మెడ 15", ఛాతీ 36", నడుము 32", పూర్తి భుజం 15", మామూలు వెయిస్ట్ పొడవు 16". వర్కింగ్ స్కేల్; ½ చెస్ట్ = 18".

భాగం-ఎ (వెనక వేపు)

ఎ బి-అనే నిర్మాణ రేఖనుగీసి, దానిమీద ఒకచోట O అనే బిందువును గుర్తిచండి.

1- 0 పొడవు.

2–1 2", టర్నింగుకోసం (లైనింగ్ బ్యాక్‌న ఉంచకపోతే).

3–0 మామూలు వెయిస్టు పొడవు.

4–0 ½ వర్కింగ్ స్కేల్.

బిందువులు 0, 1, 2, 3, 4 నుంచి అడ్డంగా చదరపు గీత.

5–0 ⅙ మెడ; బిందువు 5 నుంచి పైకి చదరపు గీత.

6–5 ¾"; O నుంచి 6 కి బ్యాక్ నెక్ షేప్ తియ్యండి.

7–0 ½ షోల్డర్ + ⅜".

8–7 1½"; 8, 6 కలపాలి.

9–4 ¼ చెస్ట్+1"; 8 నుంచి 9 కి బ్యాక్ సై షేప్ తియ్యండి.

10–3 ½ వెయిస్ట్+1".

11–1 (9-4) కు సమానం; బిందువు 10 ద్వారా 9 నుంచి 11 కి ప్రక్క సీమ్‌యొక్క షేప్ తియ్యాలి. (బట్ట కత్తిరించేటప్పుడు ఇస్లేను ప్రక్కగా ఉంచండి).

భాగం-బి (ముందువేపు)

సి డి–అనే నిర్మాణ రేఖను గీసి, దాని మీద ఒక చోట O–అనే బిందువును గుర్తించండి.

1–0 పొడవు.

2–0 మామూలు వెయిస్ట్ పొడవు.

3–0 ½ వర్కింగ్ స్కేల్. బిందువులు 0, 1, 2, 3 నుంచి అడ్డంగా చదరపు గీత.

4–3 1".

5–4 ½ వర్కింగ్ స్కేల్–1½".

6–5 ½ (5-4); బిందువు 6 నుంచి 7 వరకు పైకి చదరపు గీత.

8–7 ⅙ మెడ; 8 నుంచి 4 కి షేప్ తియ్యాలి.

9–8 ¾"; 9 నుంచి 3 కి షేప్ తియ్యండి.

10–9 ⅙ మెడ+½"; 10 నుంచి 7 కి ఫ్రంట్ నెక్ షేపు తియ్యండి.

11–7 భాగం-ఎ లోని (8-6)లో ¼ తగ్గింపుకి సమానం; బిందువు 11 నుంచి క్రిందికి చదరపు గీత.

12–11 1½"; 12, 7 కలపాలి.

13–4 ¼ చెస్టు + 1".

14–5 1"; డ్రాఫ్టులోలాగా బిందువు 14 ద్వారా 13 నుంచి 12 కు ఫ్రంట్ సై షేపు తియ్యండి.

15–2 ¼ వెయిస్ట్ + 2".

16–1 (13-3) సమానం; బిందువు 15 ద్వారా



16 నుంచి 13 కి ప్రక్కసీమ్ షేప్ తియ్యాలి.

17–1 ¾"; చూపినట్టుగా 17 నుంచి 16 కి ఫ్రంట్ బాటమ్ షేప్ తియ్యండి.

బటన్–పట్టీ కోసం కుడిచేతి వేపు ఫ్రంటులో- బిందువులు 10, 3, 2, 1, 17 లకు బయటి వేపు 1½" అదనపు వెడల్పు ఉంచాలి.

(ఎడమచేతి ముందువేపు చెస్ట్‌లైను మీద ఒక జేబూ, సుమారు ⅙ వర్కింగ్ స్కేల్ ప్రకారం వెయిస్టులైన్ దిగువని రెండు ఫ్రంటుల మీదా ఒక్కొక్క జేబు చొప్పునా వేయండి. ఈ జేబులు 'వెల్ట్'లో నైనా, లేదా కట్–పాషన్‌లోనయినా వెయ్యవచ్చు).

భాగం-సి (స్టాండ్ కాలరు)

ఇ ఎఫ్–అనే నిర్మాణ రేఖను గీసి, దాని మీద ఒక చోట O–అనే బిందువును గుర్తించండి.

1–0 ½ మెడ.

2–1 ¾"; బిందువులు 0, 1, 2 నుంచి పైకి చదరపు గీత.

3–2 1"; O నుంచి 3 కి, చూపినట్టుగా కాలరు షేప్ తియ్యండి.

4–0 1½".

5–3 1¼"; 5, 3 కలిపి, డ్రాఫ్టులో చూపినట్టుగా 4 నుంచి 5 కి షేప్ తియ్యండి.

కత్తిరింపు:

లే – అవుట్‌లో చూపినట్టుగా బట్టను కత్తిరించండి.

సింగిల్ బ్రెస్టెడ్ కోట్

40–వ పాఠం

కొలతలు:

పొడవు 28", చెస్ట్ 36", వెయిస్టు 32", సీట్ 38", మామూలు వెయిస్ట్ పొడవు 16", పూర్తి షోల్డరు 18", సగం వీపు 7½", చెయ్యి పొడవు 24", కఫ్ 6½". వర్కింగ్ స్కేల్: ½ చెస్ట్=18".

భాగం–ఎ (వెనుకవేపు)

ఎ బి- అనే నిర్మాణ రేఖను గీసి, దాని మీద ఒక చోట O–అనే బిందువును గుర్తించండి.

1–0 కోటు పూర్తి పొడవు.

2–0 8" మామూలు సీట్ లైను కోసం.

4–0 ½ వర్కింగ్ స్కేల్.

5–0 ½ (4–0)

6–0 ½ (5–0)

బిందువులు 0, 1, 2, 3, 4, 5, 6 నించి అడ్డంగా చదరపు గీత.

7–4 ½".

8–2 1", మధ్య బ్యాక్ యొక్క షేప్ తియ్యాలి.

9–3 } డ్రాఫ్టులోలాగా O నుంచి 10 కి, బిందు
10–1 } వులు 6, 5, 7, 8, 9 ద్వారా సీమ్ చెయ్యండి.

11–0 ⅙ వర్కింగ్ స్కేల్.

12–11 ¾"; డ్రాఫ్టులో చూపినట్టుగా 12 నించి 0 కి బ్యాక్ నెక్ షేపు తియ్యండి.

13–6 ½ బ్యాక్ + ¾"; బిందువు 13 నించి క్రిందికి చదరపు గీత.

14–13 ½" లేదా ½షోల్డరుకు సమానమయిన 14–6; 14 నించి 12 కి షోల్డర్ సీమ్‌షేప్ తియ్యాలి.

16–15 1½"; 14 నించి 16 కి బ్యాక్ సై యొక్క షేప్ తియ్యండి.

17–16 ⅜".

18–8 ⅓ వర్కింగ్ స్కేల్+½" లేదా ¼ వెయిస్ట్+1".

19–9 (18–8)+½"కు సమానం.

20–10 (19–8)+¾"కు సమానం. డ్రాఫ్టులో చూపినట్టుగా బిందువులు 15, 18, 19 ద్వారా 17 నుంచి 20 కి బ్యాక్ యొక్క ప్రక్క సీము షేప్‌ను తియ్యాలి. బాటమ్ దగ్గర టర్నింగ్‌కుగాను 1½" చేర్చండి.

Edited & Published by B. Viswanatha Reddi for CHANDAMAMA CHILDREN'S TRUST FUND (Prop.

"లోధ్ర" టానిక్ వనితలకు మాత్రం!

ప్రకృతి సిద్ధమైన పద్ధతి ద్వారా ఆరోగ్యంగా ఉండడానికి
నెలలో ప్రతిరోజూ బాధలేని రోజుగా గడపడానికి
"లోధ్ర" టానిక్ తీసుకోండి! ఏ బాధా లేకుండా ఆరోగ్య
మయమైన జీవితాన్ని గడపండి.

Sistas

75 సంవత్సరాల నుంచీ స్త్రీల విశ్వాసానికి
పాత్రమైన టానిక్.
"లోధ్ర" మందుల షాపులలో దొరుకుతుంది.

ఉచితమైన వైద్య సలహాలకు క్రింది చిరునామాకు ఈ కూపనును పూర్తిచేసి, మీ ఉత్తరంతోబాటు జతచేసి పంపండి.

పేరు : ____________

చిరునామా : ____________

____

____________ PIN ____________

కేసరి కుటీరం (ప్రై) లిమిటెడ్

15, వెస్ట్‌కాట్ రోడ్, రాయపేట, మద్రాసు-600 014

ఏజెంటు : శీతారామ జనరల్ స్టోర్స్ ఏజన్సీస్, విజయవాడ, సికింద్రాబాదు, బెంగళూరు

ఈ రోజుల్లో తలనొప్పి అంటే మాటలా!
సాలోఫేన్‌ను వాడండి.
అమోఘంగా నొప్పులను నివారించే విశిష్టమైన మాత్ర.
వెల అతిచౌక



మంచి నొప్పుల నివారిణి సాలోఫేన్‌ను
గమనించండి. దీనిలో రెండు మందులు
అమోఘంగా నొప్పులను పోగొట్టేవి
చేరివున్నాయి—అస్ప్రిన్, ఫెనాసిటిన్—
అయినప్పటికీ వెల మాత్రము 7 పైసలే
ఒకమాత్ర. సాలోఫేన్ అతిశీఘ్రంగా,
తలనొప్పులకు జలుబులకు పండ్లనొప్పి.
ఫ్లూ జ్వరాలకు కండలనొప్పులకు ఉపశమనం
కల్గిస్తుంది. సాలోఫేన్ నొప్పుల నివారిణి మాత్రలు—
ఏళ్లతరబడి ఇంటింటా ప్రసిద్ధిపొందిన అమృతాంజన్
లిమిటెడ్ వారి తయారీ.

అమృతాంజన్ లిమిటెడ్ వారి నమ్మకమైన తయారీ

సాలోఫేన్ – అమోఘమగు నిరపాయకరమైన నొప్పుల నివారిణి

SAA/AMS/2197 TEL

మెడిమిక్స్

15 రకముల ఆయుర్వేద వనమూలి కలచే తయారుచేయబడిన మెడిమిక్సు సబ్బువలన చిన్నపిల్లల చర్మరోగములైన తామర, గజ్జి, చాకలిపొడలు, మంగలి పొడలు, చెమటకాయలు లేకుండ జేయును. ముఖముమీద మొటిములు తొలగించును. నల్లటి మచ్చలు తీసివేయును.

మెడిమిక్స్

ఆధునికముగా లభించు సౌందర్య సాధనములకంటె మెడిమిక్సు సబ్బులో వున్న వెలకట్టలేని వనమూలికల వలన ముఖమునకు సౌందర్యమును కలుగ జేసి చర్మమును ఆరోగ్యవంతముచేసి చర్మమునకు సొగసును, మెరుపును కలుగజేయును.

మెడిమిక్స్

స్వచ్ఛమైన కొబ్బరినూనె వలన మెడిమిక్సు సబ్బు తయారగుచున్నది. కావున ఉప్పునీటిలో కూడా సమృద్ధిగా తెల్లటి నురగనిచ్చును.

మెడిమిక్స్

మెడిమిక్సు సబ్బునందు చందనపు నూనె, వట్టివేరు నూనె మరియు వెల గలిగిన ఆయుర్వేద వనమూలికల వలన దినమంతయు చల్లదనము ఆహ్లాదమును కలుగజేయును.

మెడిమిక్స్

ఇండియా పరిమళ ద్రవ్యములలో ఎన్నికైన తాయంపు సువాసన ద్రవ్యం మెడిమిక్సు సబ్బు కలిగినందున దానివలన వచ్చు సువాసనలు రోజంతా మిమ్ములను పరవశింపజేయును.

రక్షణ! సువాసన!!
ఎక్కువ నురుగు!!!

చర్మ వ్యాధులకు డాక్టర్లచే సిఫారసు చేయబడినది

మెడిమిక్స్

ఆయుర్వేద టాయిలెట్ సబ్బు

CHOLAYIL PHARMACEUTICALS 1, PALAYAKARA STREET, MADRAS-600 023

SUBHODAYA

REGD. No. TN/MS(S)/64

వివాహాలు మరియు అన్ని శుభకార్యాలకు

వాణి

వెదజల్లుతున్న కొత్తరంగులు

సంగీత, లావణ్యా, ప్రియ, సరికొత్త హరివిల్లు

వాణి సుప్రభాతం

వాణి సిల్క్స్ హౌస్

'జైన్ భవన్'

(ఏర్ కండిషన్డ్ షోరూమ్)

92, పాండిబజార్ (మేడమీద)

టి. నగర్, మద్రాసు - 600017

మా ఆదాయ పొదుపు పథకంలో చేరి లాభం పొందండి!